నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ
జిల్లా టాబ్లాయిడ్
వార్తల కోసం
10,11 పేజీలు
చూడండి.

శనివారం 4.4.2020
• సంపుటి 9 • సంచిక 280 • వెల. రూ. 6.50

కరీంనగర్
పేజీలు : 12

ఏకాదశి

సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.25, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం ఏకాదశి రాత్రి 10.31 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఆశ్లేష సాయంత్రం 5.08 వరకు, తదుపరి మఖ, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.39 నుంచి సాయంత్రం 5.08 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.44 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.06 నుంచి 7.45 వరకు, వర్జ్యం: ఉదయం 6.40 నుంచి 8.09 వరకు, తిరిగి ఆదివారం తె.ఝూ.4.03 నుంచి ఉదయం 5.31 వరకు.

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1.22 కోట్ల విరాళం చెక్కును శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్స్‌వెల్ఫేర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కే సుధీర్‌రెడ్డి. చిత్రంలో కార్యదర్శి ఎస్వీ రఘు, సంయుక్తకార్యదర్శి ఎం గోపాల్‌రావు, టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి ఉన్నారు.

ప్రధాని సహాయనిధికి
ఆదిత్య బిర్లా విరాళం
500 కోట్లు

12

సంకల్పజ్యోతి వెలిగిద్దాం!

- కరోనాపై పోరులో సమిష్టి శక్తిని చాటుదాం.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ వీడియో సందేశం
- రేపు రాత్రి 9 గంటలకు లైట్లన్నీ బంద్ చేసి కొవ్వొత్తులు, దీపాలు వెలిగించాలని సూచన
- ప్రధానమంత్రి మోదీ పిలుపును పాటిద్దాం.. రాష్ట్ర ప్రజలను కోరిన ముఖ్యమంత్రి కేసీఆర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు సమిష్టిపోరు సాగిద్దామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ నెల 5న (ఆదివారం) రాత్రి 9 గంటలకు దేశ ప్రజలందరూ తమ ఇండ్లలోని లైట్లను ఆర్పివేసి కొవ్వొత్తులు, దీపాలు లేదా మొబైల్ టార్చ్‌లైట్లను 9 నిమిషాలపాటు వెలిగించాలని కోరారు. తద్వారా కరోనాను ఓడించడంలో దేశ 'సమిష్టి సంకల్పాన్ని' చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జరిగేటప్పుడు 'లక్ష్మణ రేఖ'ను దాటొద్దని, ప్రజలందరూ

మిగతా 4వ పేజీలో

ఆర్థికం ఆగమాగం

- స్టాక్ మార్కెట్లలో ఆగని పతనం
- మరింత బక్కచిక్కిన రూపాయి
- 43 నెలల గరిష్ఠానికి నిరుద్యోగరేటు

కరోనా కాటుతో దేశ ఆర్థిక వ్యవస్థ బీటలువారుతున్నది. ప్రపంచవ్యాప్తంగా మరణమృదంగం మోగిస్తున్న మహమ్మారిని ప్రతిఘటించేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో అత్యవసర సేవలు మినహా దాదాపు అన్నిరంగాలు స్తంభించిపోయాయి. స్టాక్ మార్కెట్లలో పతనం అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతుండటం, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ నానాటికీ తరిగిపోతుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 2%లోపే ఉంటుందని, గత 30 ఏండ్లలో ఇదే అత్యంత కనిష్ఠమని ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఫిచ్' పేర్కొన్నది. మరోవైపు దేశంలో నిరుద్యోగ మరింత పెరుగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.

Fitch Ratings

కరోనా వైరస్ వ్యాప్తి వల్ల ఇటీవల చైనాలో పలు పరిశ్రమలు మూతపడటంతో భారత్‌లోని వివిధ పరిశ్రమలకు ముడిసరుకులు, విడిభాగాల సరఫరాలు ఆగిపోయాయి. ప్రస్తుతం చైనాలోని వివిధ పరిశ్రమల్లో మళ్లీ పనులు ప్రారంభమైనప్పటికీ కరోనా వైరస్ వ్యాప్తి ఉద్ధృతమవడంతో ఆ ప్రభావం భారత్ ఎగుమతులను, కొనుగోలు శక్తిని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటుపై మా అంచనాను 5.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం. ఇది గత 30 ఏండ్లలోనే అతితక్కువ వృద్ధిరేటు.

- ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఫిచ్'

దేశంలో ప్రమాద ఘంటికలు

- కరోనా కాటుతో దేశ ఆర్థికవ్యవస్థకు బీటలు
- 30 ఏండ్ల కనిష్ఠానికి జీడీపీ దిగజారే అవకాశం
- అన్ని దేశాల్లోనూ భయానక పరిస్థితులు
- ప్రపంచ ఆర్థికవ్యవస్థకు 4.1 ట్రిలియన్ డాలర్ల నష్టం

28,000	5,00,000 కోట్లు	రూ. 76.13
దిగువకు సెన్సెక్స్	రెండ్రోజుల్లో ఆవిరైన సంపద	డాలర్ విలువ

ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో కరోనా తీవ్రత అంతగా లేకపోవడం కాస్త ఊరటనిస్తున్నది. దీన్ని ఇంతటితోనే కట్టడిచేయగలిగితే ఆర్థిక సంక్షోభం నుంచి మనం కొంతవరకు బయటపడినట్టే. కానీ సేవలరంగంతోపాటు ఐటీ, ఆతిథ్య, పర్యాటక రంగాలు దెబ్బతినే అవకాశమున్నది.

– నర్సింహమూర్తి, ప్రముఖ ఆర్థికవేత్త

కరోనా దుష్ప్రభావం నుంచి తెలంగాణకూ మినహాయింపు ఉండదు. దీనివల్ల రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అంచనా వేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆర్థిక వ్యవస్థకు జరగకూడని నష్టం జరిగింది. కానీ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈసారి వ్యవసాయరంగంలో అభివృద్ధి నిలకడగానే ఉండవచ్చు.

–డాక్టర్ సుహాసిని, వ్యవసాయ ఆర్థికవేత్త

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కరోనా.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఏ నోట విన్నా ఈ వైరస్ మాటే. చైనా నుంచి పుట్టుకొచ్చిన ఈ 'మహమ్మారి' ఇప్పటికే వివిధ దేశాల్లో 58 వేల మందికిపైగా ప్రజల ప్రాణాలను కబళించడంతో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే అతలాకుతలం చేస్తున్నది. దీని ధాటికి చైనా సహా దాదాపు అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచంలోనే అతిపెద్దవైన అమెరికా, ఐరోపా ఆర్థిక వ్యవస్థలు దారుణంగా పతనమవుతున్నాయి. కరోనా కాటుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 4.1 ట్రిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశమున్నదని తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ప్రపంచ మొత్తం రాబడిలో దాదాపు 5 శాతం మేరకు ఉండవచ్చు. అయితే వివిధ రకాల చర్యలు, ఉద్దీపనలతో ఈ నష్టాన్ని స్వల్పకాలంలోనే 2 ట్రిలియన్ డాలర్లకు తగ్గించవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో కరోనా ప్రభావం భారత్‌పైనా అధికంగానే ఉండవచ్చని స్పష్టమవుతున్నది. ఇప్పటికే గత ఆరు త్రైమాసికాల నుంచి మందగమనంలో కొనసాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుందని, ఫలితంగా

మిగతా 7వ పేజీలో

పాలం వద్ద స్వీయనిర్బంధం

నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలోని బైరంపల్లి గ్రామానికి చెందిన కుర్వ హన్మంతు తమ కుటుంబసభ్యులతో కలిసి బతుకుదెరువుకోసం బెంగళూరుకు వలస వెళ్లారు. దేశవ్యాప్త లాక్‌డౌన్ కారణంగా పనుల్లేక గురువారం రాత్రి కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వచ్చారు. ఊరికి దూరంగా ఉన్న తమ పొలంలో గుడారం వేసుకొని భార్యాపిల్లలతో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాగనూరు జెడ్పీటీసీ వెంకటయ్య ఆ కుటుంబానికి కావాల్సిన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. - మాగనూర్

మరో 75 మందికి

శుక్రవారం ఇద్దరు కరోనా రోగుల మృతి

రాష్ట్రంలో 229కి చేరిన పాజిటివ్ కేసులు

అనుమానితులందరికీ పరీక్షలు: మంత్రి ఈటల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 75 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, ఇద్దరు మృతి చెందారని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 229 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని, వీరిలో 32 మంది కోలుకున్నారని, పలువురు డిశ్చార్జి కూడా అయ్యారని వివరించారు. మొత్తం మృతుల సంఖ్య 11కు చేరగా, ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో 186 మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. శుక్రవారం మృతి చెందినవారిలో ఒకరు షాద్‌నగర్‌కు చెందిన మహిళ కాగా, మరొకరు సికింద్రాబాద్‌వాసి అని తెలిపారు. ఢిల్లీకి వెళ్లి వచ్చినవారిని, వారి కుటుంబసభ్యుల్లో కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నవారిని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. ఆరు ల్యాబ్‌లలో 24 గంటలు మూడు షిఫ్టుల్లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా
మొత్తం కేసులు: **10,81,153**
మరణాలు: **58,127**
కోలుకున్నవారు: **2,27,716**

తెలంగాణలో

	శుక్రవారం	మొత్తం
పాజిటివ్ కేసులు	75	229
కోలుకున్నవారు	15	32
మరణాలు	2	11
చికిత్సలో ఉన్నవారు		186

దేశంలో నమోదైన మొత్తం కేసులు: **2,983**
మృతులు: **84** కోలుకున్నవారు: **209**

దేశీయ విమాన సర్వీసులు

15 నుంచి!

బుకింగ్‌లను ప్రారంభించిన పలు సంస్థలు

30 వరకు నిలిపివేశామన్న ఎయిర్‌ఇండియా

శంషాబాద్: లాక్‌డౌన్ కారణంగా నిలిచిపోయిన దేశీయ విమాన సర్వీసులను ఈ నెల 15 నుంచి పునరుద్ధరించనున్నారు. ఈ మేరకు పలు విమానయాన సంస్థలు బుకింగ్‌లను కూడా ప్రారంభించాయి. పలువురు ప్రయాణికులు సైతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే.. దేశీయ, విదేశీ మార్గాల్లోనూ ఈ నెల 30 వరకు బుకింగ్‌లను తీసుకోబోమని ఎయిర్‌ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 14వ తేదీన లాక్‌డౌన్ పూర్తికానున్న నేపథ్యంలో.. ఆ రోజు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నామని ఎయిర్‌లైన్ అధికార ప్రతినిధి తెలిపారు. గతనెల 24 నుంచి నిలిచిపోయిన విమాన సర్వీసులను యథావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర విమానయానమంత్రి హర్దీప్‌సింగ్ పూరి రెండ్రోజుల కిందట ప్రకటించిన విషయం తెలిసిందే.

15 నుంచి ప్యాసింజర్ రైలు సేవలు! 2

అమెరికా.. అష్టకష్టాలు

- అగ్రరాజ్యాన్ని కమ్మేసిన కరోనా
- 6,500 మందికిపైగా మృత్యువాత
- 2.5 లక్షలకుపైగా బాధితులు
- 85% మంది ఇండ్లకే పరిమితం
- తీవ్రస్థాయికి చేరుకున్న నిరుద్యోగం
- రెండువారాల్లో కోటి ఉద్యోగాలు ఉఫ్

కరోనా కోరల్లో చిక్కి అగ్రరాజ్యం అతలాకుతలమవుతున్నది. ఇప్పటివరకు అమెరికాలో 2.50 లక్షలకుపైగా కరోనా కేసులు నమోదుకాగా, 6,500 మందికిపైగా మృత్యువాతపడ్డారు. గత 24 గంటల్లోనే 1,100 మంది ప్రాణాలు కోల్పోవడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నది. వచ్చే రెండువారాలు పరిస్థితులు మరింత విషమించనున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. దేశంలో దాదాపు 85 శాతం మంది ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. కరోనాతో అమెరికాలో దాదాపు లక్ష నుంచి రెండున్నర లక్షమంది బలికానున్నారని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉన్నవాటికి తోడు రోజూ వందల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతుండడంతో వైద్య సిబ్బంది సతమతమవుతున్నారు. మృతదేహాలను భద్రపరిచేందుకుం లక్ష సంచులు కావాలని అమెరికా విపత్తు ప్రతిస్పందన సంస్థ 'ఫెమా' అక్కడి సైన్యాన్ని కోరడం గమనార్హం. మరోవైపు, నిరుద్యోగం కూడా తారాస్థాయికి చేరుకున్నది. రెండువారాల్లో దాదాపు కోటిమంది అమెరికన్లు నిరుద్యోగులుగా మారారు. ఆంక్షల నేపథ్యంలో రెస్టారెంట్లు, హోటళ్లు మూసివేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్నింటిని తెరిచినా, 'టేక్ అవే'కు మాత్రమే అనుమతిస్తుండటంతో వాటి ముందు భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి.

వివరాలు 4వ పేజీలో

లాక్‌డౌన్-డే 12

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
హైదరాబాద్	35.2°c	26.4°c
కరీంనగర్	37.0°c	25.0°c
వరంగల్	32.5°c	25.0°c
రంగారెడ్డి	38.0°c	24.0°c
నల్లగొండ	39.4°c	23.4°c
మెదక్	37.0°c	26.0°c
ఆదిలాబాద్	39.3°c	25.6°c
నిజామాబాద్	39.0°c	27.8°c
మహబూబ్‌నగర్	38.3°c	26.1°c
ఖమ్మం	39.0°c	26.0°c

వ్యాక్సిన్‌పై ముందడుగు!

త్వరలో జంతువులపై పరీక్షించనున్న ఆస్ట్రేలియా • పరిశోధనలో నిమగ్నమైన భారత్ బయోటెక్
ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా క్లినికల్ ట్రయల్స్ • కరోనాకు మందుపై ఒక్కటైన శాస్త్రవేత్తలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూమండలాన్ని వణికిస్తున్న కరోనావైరస్‌కు వ్యాక్సిన్ కనుగొనడంలోనే ప్రపంచ శాస్త్రవేత్తలంతా నిమగ్నమయ్యారు. పక్కనున్నవారికి కూడా తెలియకుండా సాగే ప్రక్రియ 'పరిశోధన'. కానీ కరోనాను ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలు అంతర్జాతీయంగా పరిశోధన ఫలితాలను పంచుకొంటున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నట్టు అంచనా. ప్రపంచంలోని శాస్త్రవేత్తలందరూ దాదాపు ఒకే అంశంపై పరిశోధన సాగించడం బహుశా చరిత్రలో ఇదే మొదటిసారి కావొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వైరస్‌ను అడ్డుకోవచ్చని భావిస్తున్న రెండురకాల టీకాలను ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు పరీక్షిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భారత్ బయోటెక్ కొరోఫ్లూ పేరుతో వ్యాక్సిన్ తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నది. అమెరికాలోని పిట్స్‌బర్గ్ పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్, ఆస్ట్రియన్ డ్రగ్ కంపెనీ థెమిస్ బయోసైన్స్ కూడా వ్యాక్సిన్ తయారీప్రయత్నంలో ముందున్నాయి.

దేశంలో ఈ ఏడాది చివరికి ట్రయల్స్

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భారత్ బయోటెక్ సంస్థ కొరోఫ్లూ పేరుతో వ్యాక్సిన్‌ను తయారీకి ప్రయత్నిస్తున్నది. అమెరికాకు చెందిన విస్కాన్సిన్ వర్సిటీ, ఫ్లూజెన్ కంపెనీతో కలిసి రూపొందించిన వ్యాక్సిన్‌ను ఇప్పటికే పశువులపై ప్రయోగించారు. ఫలితాలు రావడానికి ఆరునెలల సమయం పడుతుందని ఫ్లూజెన్ సహ వ్యవస్థాపకుడు గాబ్రియెల్ న్యూమానన్ తెలపారు. ఈ ఏడాది చివరినాటికి మనుషులపై క్లినికల్ ట్రయల్స్ చేయనున్నారు. కొరోఫ్లూ వ్యాక్సిన్‌ను కూడా ఎం2ఎస్ఆర్ లాగానే ముక్కులో(ఇంట్రానాసల్) వేసేలా తయారుచేస్తున్నామని చెప్పారు. ప్రయోగాలు విజయవంతమైతే ప్రపంచానికి అవసరమైన 300 మిలియన్ల వ్యాక్సిన్‌ను హైదరాబాద్‌లోనే తయారుచేస్తామని భారత్ బయోటెక్ బిజినెస్ హెడ్ డాక్టర్ రాచెస్ ఎల్లా చెప్పారు. తమ సంస్థ 16 రకాల వ్యాక్సిన్లను సరఫరా చేస్తున్నదని, 2009లో స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1ఫ్లూ) నివారణకు వ్యాక్సిన్‌ను కనుగొన్నామని తెలిపారు.

అందరి లక్ష్యం ఒక్కటే

అమెరికాలోని పిట్స్‌బర్గ్ పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్, ఆస్ట్రియన్ డ్రగ్ కంపెనీ థెమిస్ బయోసైన్స్ కూడా సంయుక్తంగా చేస్తున్న పరిశోధనలకు నార్వేకు చెందిన ఓ సంస్థ నిధులు అందిస్తున్నది. వీరంతా వ్యాక్సిన్ తయారీకోసం భారత్‌కు చెందిన సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరుపుతున్నారు. పరిశోధనల వేగం చూస్తుంటే మరో ఆర్నెళ్లలో కొవిడ్-19కు వ్యాక్సిన్ రావచ్చని సీరం సంస్థ చైర్మన్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఫ్రెంచ్ పబ్లిక్ రిసెర్చ్ హెల్త్ సెంటర్ శాస్త్రవేత్తలు, చైనాశాస్త్రవేత్తలు కూడా క్లినికల్ ట్రయల్స్‌ను ఇతరదేశాల్లో నిర్వహించేందుకు అంతర్జాతీయ సహకారాన్ని కోరారు. హార్వర్డ్ డాక్టర్లు కరోనా రోగుల్లో నైట్రిక్ ఆక్సైడ్ ప్రభావంపై పరిశోధన చేస్తున్నారు. 1990 దశకంలో ఎయిడ్స్‌పై ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, వైద్యులు ఏకమై పరిశోధనలు చేశారని, మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ అదే ధోరణి కనిపిస్తున్నదని ఆక్స్‌ఫర్డ్ శాస్త్రవేత్త హిల్ చెప్పారు.

ఆస్ట్రేలియాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతి

కరోనాను అరికట్టే వ్యాక్సిన్‌ను కనుగొనడంలో ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు పురోగతి సాధించినట్టు తెలుస్తున్నది. వైరస్‌ను అడ్డుకోవచ్చని భావిస్తున్న రెండురకాల టీకాలను వారు పరీక్షిస్తున్నారు. ఇప్పటికే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నిపుణులు, అమెరికాకు చెందిన ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఇనోవియాతో ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు కలిసి రూపొందించిన వ్యాక్సిన్‌ను జంతువులపై ప్రయోగించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతినిచ్చింది. ఈ వ్యాక్సిన్ సత్ఫలితాన్నిస్తే మానవాళికి వరంగా పరిణమించగలదని ఆస్ట్రేలియా నేషనల్ సైన్స్ ఏజెన్సీ పేర్కొన్నది.

వైద్యారోగ్య, పోలీస్‌శాఖలకు పూర్తివేతనాలు

- ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా కట్టడికోసం 24 గంటలూ కష్టపడుతున్న వైద్యారోగ్య, పోలీస్‌శాఖల ఉద్యోగులకు పూర్తివేతనాలు చెల్లిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వాలకు రావాల్సిన ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఉన్న కొద్దిపాటి నిధులు కొవిడ్-19 వైరస్ వ్యాప్తి నివారణకు, వైద్యం అందించడానికి దవాఖానలను సిద్ధం చేయడానికే సరిపోతున్నది. రాష్ట్రఆదాయం, ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన ప్రభుత్వం ఉద్యోగులకు ఈ నెల 50 శాతం వరకు తాత్కాలికంగా కోత విధించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎపిడమిక్ యాక్ట్-1897 ప్రకారం ఉత్తర్వులు ఇచ్చింది. విపత్కర పరిస్థితుల్లో 24 గంటలు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులతోపాటు.. లాక్‌డౌన్‌ను విజయవంతం చేస్తున్న పోలీసుశాఖకు వేతనాల్లో కోత లేకుండా పూర్తిస్థాయిలో చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రెండుశాఖలకు పూర్తిస్థాయిలో వేతనాలు ఇస్తూ శుక్రవారం ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

వైద్యారోగ్యశాఖ ధన్యవాదాలు

వైద్యారోగ్య సిబ్బందికి మార్చినెల పూర్తి వేతనం ఇస్తూ జీవో జారీచేయడం హర్షణీయమని టీఎన్జీవో మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరం పేర్కొన్నది. సీఎం కేసీఆర్, మంత్రి ఈటలకు ఫోరం అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ వేతనాల చెల్లింపుపై హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వ్యాప్తి చెందుతున్న క్లిష్ట పరిస్థితుల్లోనూ పెండింగ్ వేతనాలు అందజేసిన సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు మూడునెలల పెండింగ్ వేతనాలు, బకాయిలు చెల్లించడంపై సంఘం నాయకులు వినోద్ కుమార్, కిరణ్మయి, కదారవల్లి అరుణకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.

పొరుగు రాష్ట్రాల సరుకుల రవాణా నిలిపివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మలక్‌పేట: కరోనా నేపథ్యంలో హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్‌కు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి సరుకుల రవాణాను నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉండటంతో అక్కడి మార్కెట్లు మూతపడ్డాయని, దీంతో ఆ సరుకంతా మలక్‌పేటకు వస్తున్నదన్నారు. శనివారంనుంచి ఈ నెల 15వరకు ఆయా రాష్ట్రాల సరుకులను అనుమతించబోమని స్పష్టంచేశారు. ఉల్లిగడ్డ నిల్వలు మరో రెండునెలలకు సరిపడా 25 వేల టన్నులవరకు మార్కెట్‌లో నిల్వ ఉన్నట్టు మార్కెటింగ్‌శాఖ అధికారులు చెప్పారు. అత్యవసరమైతే చింతపండు, మిర్చి సరఫరా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నమని మలక్‌పేట మార్కెట్, కమిటీ చైర్మన్ చీదల్ల రాధ, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి దామోదర్, అసిస్టెంట్ కార్యదర్శి రవీందర్ తెలిపారు.

ఐఎస్‌సీఈలోనూ పరీక్షల్లేకుండానే పాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా నేపథ్యంలో కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (ఐఎస్‌సీఈ) సైతం సీబీఎస్‌ఈ బాటలోనే నడుస్తున్నది. 1-8 వరకు విద్యార్థులను పరీక్షలు నిర్వహించకుండానే పైతరగతులకు పంపాలని శుక్రవారం నిర్ణయించినట్టు ఐఎస్‌సీఈ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జెర్రీ ఆరతున్ తెలిపారు.

డైట్‌సెట్ దరఖాస్తులకు 27 వరకు గడువు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా నేపథ్యంలో డిప్లొమా ఇన్ ప్రీస్కూల్, డీఎడ్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న (డైట్‌సెట్) డీఈఎల్‌ఈడీ సెట్-2020కి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకొనే గడువు తేదీన ఈ నెల 27 వరకు పొడిగించినట్టు సెట్ కన్వీనర్ కృష్ణారావు తెలిపారు.

ఎంసెట్‌కు 1.75 లక్షల దరఖాస్తులు

రాష్ట్రంలో ఎంసెట్ కోసం ఇప్పటివరకు 1.75 లక్షల ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించినట్టు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. దరఖాస్తుల గడువు పొడిగించాలని యోచిస్తున్నట్టు చెప్పారు.

లోకం పోకడ



మొన్న మన డాక్టర్ల మీద దాడి చేశాడు.. రోగం కుదరడానికి మంచి సూది మందు ఇచ్చాను!

ఇంటివద్దే కొవిడ్ -19 స్క్రీనింగ్ టెస్ట్

- కిట్ విడుదలచేసిన బయోన్ సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వ్యాధి లక్షణాలను 10 నిమిషాల్లో నిర్ధారించే పరికరాన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు బెంగళూరుకు చెందిన బయోన్ సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌తోపాటు ఇతర దేశాలకు పంపిణీ చేసేందుకు రూపొందించిన ర్యాపిడ్ కొవిడ్-19 హోం స్క్రీనింగ్ టెస్ట్ కిట్‌ను బయోన్ సంస్థ తాజాగా విడుదలచేసింది. ఈ కిట్‌కు వైద్య నియంత్రణమండలి అధికారుల ఆమోదం తెలిపినట్టు ఆ సంస్థ వెల్లడించింది. దీనిద్వారా పరీక్ష చేసుకొనేందుకు ముందుగా ఆల్కహాలిక్ శానిటైజర్‌తో వేలిని శుభ్రం చేసుకోవాలని, అందులోని లాన్సెట్ వేలికి గుచ్చి, సేకరించే రక్తనమూనా ద్వారా అందులోని కాట్రిజ్ 5 నుంచి 10 నిమిషాల్లో ఫలితాన్ని తెలుపుతుందని సంస్థ తెలిపింది. ఈ కిట్ ధర రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఉంటుందని, కావాల్సినవారు bione.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, 2-3 రోజుల్లో కిట్లను అందజేస్తామని వెల్లడించింది.

అందుబాటులోకి డీఆర్డీవో శానిటైజేషన్ పరికరాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పరిసరాల శుభ్రతపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నది. అన్ని పరిసరాల్లోనూ క్రిమిసంహార ద్రావణాలు పిచికారీ చేయిస్తున్నది. ఈ పిచికారీకి వినియోగించేందుకు డీఆర్డీవోకు చెందిన సీఎఫ్ఈఈఎస్ (ది సెంటర్ ఫర్ ఫైర్ ఎక్స్‌ప్లోజివ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సేఫ్టీ) ఢిల్లీ ఆధ్వర్యంలో రెండురకాల పరికరాలను అందుబాటు లోకి తెచ్చింది. శుక్రవారం డీఆర్డీవో విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ పరికరాల వివరాలు వెల్లడించారు. సిబ్బంది వీపుభాగంలో వేసుకొని వెళ్లేది ఒకటికాగా, చక్రాలపై తీసుకెళ్లేది మరొకటి ఉన్నది. ప్రస్తుతం ఈ రెండు రకాల పరికరాలను ఢిల్లీలో వినియోగిస్తున్నారు.

ఆస్ట్రేలియాలో విద్యార్థికి సరుకులను అందిస్తున్న శ్రీకర్‌రెడ్డి

ఆస్ట్రేలియాలో తెలంగాణ జాగృతి సేవలు

- తెలంగాణ విద్యార్థులకు సరుకులు పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా నేపథ్యంలో తెలంగాణ జాగృతి సంస్థ ఇతర దేశాల్లో ఉన్న మన రాష్ట్రానికి చెందినవారికి అండగా నిలుస్తున్నది. ఆస్ట్రేలియాలో విద్యనభ్యసిస్తున్నవారికి మొదటివిడుత సరుకులను సంస్థ పంపిణీ చేసిందని తెలంగాణ జాగృతి ఆస్ట్రేలియాశాఖ అధ్యక్షుడు శ్రీకర్‌రెడ్డి అండెం తెలిపారు. రెండోవిడుత సరుకుల పంపిణీని ప్రారంభించామన్నారు. ఎంతమందికైనా సాయం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్ నగరాల్లోని భారతీయ విద్యార్థులకు ఏదైనా సాయం కావాలంటే 0406969095 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆదర్శ అన్నదాతకు అభినందనలు

కరోనాపై పోరుకు విరాళమిచ్చిన ఆదిలాబాద్ రైతన్నకు మంత్రి కేటీఆర్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాపై పోరుకు విరాళం ఇచ్చిన పలువురిని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా అభినందించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రైతు మోర హన్మాండ్లు కరోనాపై పోరాటానికి రూ.50 వేల విరాళం ఇచ్చారు. ఆయనను మంత్రి కేటీఆర్ అభినందించారు. 'మోర హన్మాండ్లు.. చిన్న రైతు అయినా పెద్దమనసు చాటుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో నాలుగున్నర ఎకరాల భూమి ఉన్న సన్నకారు రైతు. ఆ భూమే ఆయన కుటుంబానికి జీవనాధారం. ఈ ఏడాది పంటపై వచ్చిన ఆదాయంలో రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు' అని ట్వీట్ చేస్తూ ఆయనను ప్రశంసించారు.

మంత్రి కొప్పుల సాయం గొప్పది

ఉపాధి కోసం ముంబై వెళ్లి లాక్‌డౌన్ నేపథ్యంలో అక్కడే ఇరుక్కుపోయిన ధర్మపురి నియోజకవర్గానికి చెందిన పలువురికి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆర్థిక సాయంచేశారు. గూగుల్ పే ద్వారా రూ.1.18 లక్షలు పంపించారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్.. గొప్ప పనిచేశారంటూ మంత్రి కొప్పులను ట్విట్టర్ ద్వారా ప్రశంసించారు. మెదక్ జిల్లా శివంపేట దొంతి గ్రామంలోని బేతనీ అనాథాశ్రమంలో 81 మానసిక వికలాంగ పిల్లలు ఉన్నారు. వారంతా తినడానికి తిండి, ఇతర అవసరాలు లేక ఇబ్బంది పడుతున్న విషయం ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన మంత్రి ఆ పిల్లలకు కావాల్సిన సాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేల విరాళం ఇచ్చిన మిషితా గోడిశాల, రూ.5 వేలు సీఎంఆర్ఎఫ్‌కు విరాళం ఇచ్చిన రాజ్ సూర్యాన్స్‌లను మంత్రి కేటీఆర్ ట్విట్టర్ ద్వారా అభినందించారు. వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పోర్టబుల్ వెంటిలేటర్

ఎమర్జెన్సీ పోర్టబుల్ వెంటిలేటర్

- రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ బృందం

కంది: ఏరోబేసిస్ ఇన్నోవేషన్ సహకారంతో పోర్టబుల్ ఎమర్జెన్సీ యూజ్డ్ వెంటిలేటర్‌ను అభివృద్ధి చేశామని ఐఐటీ హైదరాబాద్ శుక్రవారం తెలిపింది. రోజుకు 50-70 యూనిట్లను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బయోమెడికల్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ రేణుజాన్, ఐఐటీ డైరెక్టర్ బీఎస్‌మూర్తి చెప్పారు. దీనిధర రూ.లక్షగా నిర్ణయించామని, ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఉత్పత్తులతో పోలిస్తే ఈ ధర తక్కువేనని వారు తెలిపారు.

నెలాఖరు దాకా బియ్యం పంపిణీ

- బియ్యం తీసుకోకున్నా రూ.1,500 జమ
- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రేషన్ షాపుల్లో ఉచిత బియ్యాన్ని నెలాఖరువరకు పంపిణీచేస్తామని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. 15 రోజుల నిబంధనను ఎత్తివేశామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రేషన్ పంపిణీపై శుక్రవారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల నెలాఖరు వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటలవరకు రేషన్ షాపులు తెరిచే ఉంటాయన్నారు. బియ్యం తీసుకున్నా, తీసుకోకపోయినా రెండుమూడు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా రూ.1,500 నగదును ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు, పోలీసు షెల్టర్‌లో ఉన్నవారికి, కిందిస్థాయి సిబ్బందికి భోజనం అందించడానికి బియ్యం సరఫరా చేయాలని పోలీసుశాఖ విజ్ఞప్తి చేసింది. దీంతో రైస్ మిల్లర్లు 90 క్వింటాళ్ల బియ్యం అందజేశారు.

ఆహార పంపిణీ బాధ్యత అదనపు కలెక్టర్లకు

దాతలు ఎవరైనా పేదలకు విరాళాలు, ఆహారం అందజేయాలనుకుంటే జీహెచ్ఎంసీ ద్వారా వితరణ చేయాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ కోరారు. రంగారెడ్డి మణికొండలో ఒక వ్యక్తి వితరణ చేసిన సమయంలో 3 వేల మంది ఒకేచోట గుమిగూడారనే విషయం తమ దృష్టికొచ్చిందని చెప్పారు. జీహెచ్ఎంసీలో ఒక కేంద్రీకృతమైన వ్యవస్థను ఏర్పాటుచేసి అదనపు కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి దాతలు విరాళాలు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. జీహెచ్ఎంసీయే అవసరమైనవారికి అందజేస్తుందని చెప్పారు. సంబంధిత జిల్లా కలెక్టర్లు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్లను నియమించాలని ఆదేశించారు.

ఇబ్బంది లేకుండా నిత్యావసరాలు

లాక్‌డౌన్ నేపథ్యంలో అత్యవసర సేవలకు, నిత్యావసరాల రవాణాలో ఇబ్బంది రాకుండా పోలీస్‌శాఖ ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్ సత్ఫలితాలనిస్తున్నది. ఆహార పదార్థాలు, మందులు, ఇతర సామగ్రిని తరలించే వాహనాలు అడ్డుకోకుండా ఉండేందుకు డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాలతో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. 25 మంది అధికారుల బృందం నిత్యం రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర, నిత్యావసరాల రవాణాలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే తగిన సూచనలు చేస్తున్నారు.

ఫోన్‌చేస్తే ఇంటికే మందులు

- ఎలాంటి ఆసరాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత సేవ
- ముందుకొచ్చిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ స్వచ్ఛంద సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫోన్ చేస్తే ఇంటికే మందులు తెచ్చి ఇచ్చేందుకు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎలాంటి ఆసరాలేక, ఎటూ కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత సేవ చేసేందుకు పూనుకున్నది. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించేవారు ఫోన్ చేయగానే వీరు స్పందిస్తున్నారు. వాట్సాప్ ద్వారా ప్రిస్క్రిప్షన్, చిరునామా వంటివి తెలుసుకొని మెడికల్ షాపుల నుంచి మందులు తీసుకొని వారికి అందిస్తున్నారు. బిల్ ఆధారంగా నగదు చెల్లించాలని కోరుతున్నారు. ఇందుకు ఎలాంటి రుసుం వసూలు చేయడంలేదు. దీంతో ఈ సంస్థ చేస్తున్న సేవ పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్.. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్నాటి రాజేందర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వారి సేవలను అభినందించారు. మందులు అవసరమైతే 9491114616, 8143304148, 7037471129, 9182339595, 8897736324 నంబర్లను సంప్రదించాలని సంస్థ అధ్యక్షుడు సూచించారు. మందుల కొరత వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదమున్నదని, అందుకే ఫోన్‌చేస్తే మందులు అందించే సేవను ఉచితంగా ప్రారంభించామని తెలిపారు. భారత పౌరులుగా ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు.

15 నుంచి ప్యాసింజర్ రైలు సేవలు!

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఈ నెల 14 లాక్‌డౌన్ ముగియనుండటంతో 15వ తేదీ నుంచి ప్యాసింజర్ రైల్వే సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. మొత్తం ఒకేసారి కాకుండా మొదట ఎంపికచేసిన కొన్ని ప్రాంతాలకు రైళ్లను నడిపించనున్నారు. ఆ తర్వాత క్రమంగా వీటి సంఖ్యను పెంచుతామని రైల్వేకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. దగ్గరి ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే సబర్బన్ రైళ్లతోపాటు లోకల్ రైళ్లను కూడా ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని అధికారులు నిర్ణయించారు. కరోనా నేపథ్యంలో గత మార్చి 22 నుంచి ఈనెల 14 వరకు ప్యాసింజరు రైళ్లు రద్దుచేసిన విషయం తెలిసిందే. నాటినుంచి కేవలం గూడ్స్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. లాక్‌డౌన్ ముగిసిన వెంటనే మెట్రో, ఎంఎంటీఎస్ కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. రైల్వే సర్వీసులకు సంబంధించిన రిజర్వేషన్ బుకింగ్‌లను ఈ నెల 15 నుంచి ఐఆర్‌సీటీసీ స్వీకరించనున్నట్టు సమాచారం.

రైల్వేలో 2,672 లీటర్ల శానిటైజర్

దక్షిణమధ్య రైల్వే ఆధ్వర్యంలో 2,672 లీటర్ల శానిటైజర్, 17,800 మాస్కులను తయారుచేసినట్టు శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కరోనా నివారణలో భాగంగా వీటిని సిబ్బందికి, ఉద్యోగులు తదితరులకు పంపిణీ చేశామని రైల్వే అధికారులు తెలిపారు.

శంషాబాద్‌లో ఎమర్జెన్సీ సరుకుల రవాణా

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖతార్ ప్యాసింజర్ విమానం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం.. ఎట్టకేలకు విదేశాల నుంచి ప్యాసింజర్ విమానంలో అత్యవసర సరుకులను తెప్పించింది. కరోనాతో ప్రపంచదేశాలు విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఈ సమయంలో ఆయా దేశాల అత్యవసర సేవలకు సంబంధించిన సరుకుల రవాణా కోసం జీఎమ్మార్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం.. డీజీసీఏ అనుమతి తీసుకున్నది. ఖతార్ ఎయిర్‌లైన్స్ ప్యాసింజర్ విమానం నిత్యావసరాలతో దోహానుంచి గురువారం అర్ధరాత్రి 1.35 గంటలకు శంషాబాద్ చేరుకున్నదని జీఎమ్మార్ కమ్యూనికేషన్ విభాగంవర్గాలు వెల్లడించాయి. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు అదే విమానం 28 మెగా మెట్రిక్ టన్నుల కార్గోతో దోహా, ఇతర దేశాలకు తిరిగి బయలుదేరిందని తెలిపాయి. అత్యవసర సేవల్లో జీఎమ్మార్ ఎప్పుడూ ముందే ఉంటుందని, ఇది సంతృప్తినిస్తుందని ఎయిర్‌పోర్టు సీఈవో ఎస్జీకే కిశోర్ తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లింపు గడువు జూన్ 30

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ నేపథ్యంలో ఆస్తిపన్నును చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడునెలల వరకు గడువును పొడిగించింది. జరిమానా లేకుండా వచ్చే జూన్ 30 వరకు చెల్లించే వెసులుబాటును కల్పించింది. సాధారణంగా పట్టణ ప్రజలు ఎక్కువగా మార్చి చివరి వారంలో ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తుంటారు. ప్రస్తుతం లాక్‌డౌన్ నేపథ్యంలో పన్ను చెల్లించలేకపోయారు.

ఇండ్లలోనే జగ్జీవన్‌రాం, అంబేద్కర్ జయంతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రాం, 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఇండ్లలోనే జరుపుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నేతలు గుమిగూడకుండా కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు మార్గదర్శకాలు జారీచేసిందని తెలిపారు.

ఖైదీలకు కరోనా ముప్పుపై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా నేపథ్యంలో జైళ్లలో ఖైదీలకు పొంచి ఉన్న ముప్పు, ప్రస్తుతం జైళ్లలో పరిస్థితులపై ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ శుక

శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న జీఎస్‌జీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ చైర్మన్ జీఎస్ గుప్తా. చిత్రంలో మంత్రులు తలసాని, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న సాయి లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్ సీఈవో కృష్ణ కనుమూరి

మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న వీఎస్టీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎండీ దేవ్‌రాజ్. చిత్రంలో మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌కు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న ఏవీఆర్ఏ లేబోరేటరీస్ లిమిటెడ్ చైర్మన్ ఏవీ రామారావు

సీఎంఆర్ఎఫ్‌కు విరాళం ఇచ్చినవారి వివరాలు

దాత పేరు	మొత్తం
జేఎస్ గుప్తా	రూ. 1 కోటి
థ్రిల్ సిటీ(తలసాని సాయికిరణ్)	రూ. 25 లక్షలు
ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి	రూ. 10 లక్షలు
టీఎస్ఐఐసీ ఉద్యోగులు	రూ. 10 లక్షలు
కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ	రూ. 10 లక్షలు
శాంతాశ్రీరాం కన్‌స్ట్రక్షన్స్	రూ. 10 లక్షలు
త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ	రూ. 10 లక్షలు
గుజరాతీ స్కూల్ (ఘనశ్యాంపటేల్)	రూ. 11 లక్షలు
వంశీరామ్	రూ. 10 లక్షలు
జెమ్స్ అవెన్యూ (పరమేశ్)	రూ. 10 లక్షలు
అభిరుచి స్వీట్స్ (కిషోర్)	రూ. 10 లక్షలు
సాయిబాబా కంపెనీ	రూ. 10 లక్షలు
ఆంధ్ర కెమికల్స్	రూ. 7 లక్షలు
లక్ష్మీదాస్ షా	రూ. 7 లక్షలు
రాజ్ తాడ్ల	రూ. 5 లక్షలు
చింతల రవీందర్, శుభం గార్డెన్స్	రూ. 5 లక్షలు
గుజరాతి స్కేల్ ఆశిక్ కేడియం	రూ. 5 లక్షలు
గిరీష్ రంగ్ తేరా	రూ. 5 లక్షలు
గోపాల్ పీజీరోడ్	రూ. 5 లక్షలు
మానేపల్లి గోపి	రూ. 5 లక్షలు
సూర్యనారాయణ గుర్‌ప్రీత్ గాల్వనైసింగ్	రూ. 5 లక్షలు
కుమరం ఫిలమెట్స్ వీవీ నెట్స్	రూ. 4 లక్షలు
విస్కాన్ ఫార్మా(విజయ్‌కుమార్)	రూ. 3 లక్షలు
ప్రదీప్, ప్రమోద్, ప్రశాంత్	రూ. 3 లక్షలు
వివేక్ ఘంటా	రూ. 3 లక్షలు
పవన్‌కుమార్ గౌడ్	రూ. 1లక్ష
ఎంవీవీ సత్యనారాయణ	రూ. 1లక్ష
ఆశోక్‌కుమార్	రూ. 1లక్ష
మహాలక్ష్మి ఎల్పీజీ సెంటర్	రూ. 1లక్ష
వ్యవసాయమార్కెట్ మర్చంట్స్- వనపర్తి	రూ. 2 లక్షలు
తిరుమల తిరుపతి డెవలపర్స్ వనపర్తి	రూ. 1 లక్ష
జిన్నింగ్ మిల్లు అసోసియేషన్-కల్వకుర్తి	రూ.5 లక్షలు
రైస్ మిల్లు అసోసియేషన్-కల్వకుర్తి	రూ. 2 లక్షలు
సూర్యలత కాటన్‌మిల్లు-కల్వకుర్తి	రూ. 2 లక్షలు
మెడికల్ అసోసియేషన్-కల్వకుర్తి	రూ. 1లక్ష
హరినారాయణ్ భట్టడ్- నారాయణపేట	రూ. 2 లక్షలు
బులియన్ మర్చంట్స్- నారాయణపేట	రూ. 1లక్ష

ఫలితమిస్తున్న వైద్యుల కృషి

- కోలుకుంటున్న కరోనా బాధితులు
- ఇప్పటికే కోలుకున్న 32 మంది
- శుక్రవారం ఒక్కరోజే 15 మందికి నయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా.. ఇప్పుడు ప్రపంచంలో ఏ నోట విన్నా వినిపిస్తున్న పదం. ఆ పేరు వింటేనే జనం వణికిపోతున్న తరుణం.. ఆ వైరస్ సోకినవారు ఉన్న ప్రాంతాల్లో తిరగాలంటేనే జంకుతున్న సమయం.. ఇలాంటి భయానక పరిస్థితుల్లోనూ కరోనా వైరస్ బారిన పడ్డవారికి చికిత్స అందించడంలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో వారి కృషి ఫలితం దక్కుతున్నది. పాజిటివ్‌గా నిర్ధారణ అయినవారు పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి పాజిటివ్ బాధితుడితో సహా మొత్తం 32 మంది పూర్తిగా కోలుకోగా, పలువురు డిశ్చార్జి అయ్యారంటే దాని వెనుక ఉన్న వైద్యులు, ఇతర సిబ్బంది కృషిని మాటల్లో చెప్పలేం. ఈ 32 మంది 15 మంది శుక్రవారం కోలుకున్నవారే. కరోనా నోడల్ కేంద్రమైన గాంధీతోపాటు ఫీవర్, ఛాతి, ఇతర దవాఖానల్లో చేరిన కొవిడ్ బాధితులు, అనుమానిత లక్షణాలున్నవారికి 500 మందికిపైగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నిరంతం వైద్యసేవలు అందిస్తున్నారు.

నయం చేస్తున్నారిలా..

కొవిడ్-19 బాధితులకు ప్రధానంగా క్లోరోక్విన్, రెండు యాంటీ వైరల్ ఔషధాలు వినియోగిచినట్టు గాంధీ, ఛాతి దవాఖాన వైద్యబృందం ప్రతినిధులు పేర్కొన్నారు. సవాలుగా తీసుకొని వైద్యం అందించామని, బాధితులు భయపడుతున్నట్టు గుర్తించి నిత్యం సైకాలజిస్టుతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం కరోనా బాధితులకు చైనా, అమెరికా, ఇతర దేశాలు అనుసరిస్తున్న చికిత్స విధానాలనే మన దేశంలోనూ పాటిస్తున్నారు. వివిధ దేశాల్లో కరోనా బాధితులకు మలేరియా, ఎయిడ్స్, ఎబోలా, రుమటాయిడ్, ఆర్థరైటిస్ వంటి వ్యాధులకు వినియోగించే ఔషధాలతోనే ఇచ్చి నయం చేస్తున్నారు. అదే విధానాన్ని మన వైద్యులూ అవలంబిస్తున్నారు. కరోనా వైరస్ పాజిటివ్ వ్యక్తులకు నయం చేసేందుకు షిఫ్టుల వారీగా జనరల్ ఫిజిషియన్, పల్మనాలజిస్ట్, జనరల్ మెడిసిన్, సైకాలజిస్టుతో కూడిన వైద్యబృందాలు పనిచేస్తున్నాయి. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఒక అంచనాకు వచ్చిన తర్వాత సమయానుకూలంగా చికిత్స అదిస్తూనే ఫ్లూయిడ్స్ కూడా ఇస్తున్నారు. కరోనా బాధితుల్లో చాలావరకు న్యుమోనియా, జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం.. వంటి లక్షణాలను ఎక్కువగా గుర్తించినట్టు వైద్యవిభాగాల అధికారులు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అయినవారు వెంటనే బయట తిరగకూడదని, 14 రోజులపాటు స్వీయ గృహ నిర్బంధంలో ఉండటం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.

ఆశ కార్యకర్త, ఏఎన్ఎంపై దాడి

- ఢిల్లీ ప్రార్థనకు వెళ్లొచ్చిన వ్యక్తుల దాష్టీకం
- రిజిస్టర్ చించేసి బూతులు తిడుతూ దౌర్జన్యం
- ఆదిలాబాద్‌లో ఘటన.. కేసు నమోదు

ఎదులాపురం: కరోనా వైరస్‌పై ఇంటింటి సర్వేకు వెళ్లిన ఆశ కార్యకర్త, ఏఎన్ఎంపై శుక్రవారం ఆదిలాబాద్‌లో దాడి జరిగింది. పట్టణంలోని చోటతలాబ్ ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్ ఢిల్లీలో ప్రార్థనలకు వెళ్లాడు. ప్రభుత్వ సూచనల మేరకు అతడిని స్వీయనిర్బంధంలో ఉంచారు. ఢిల్లీ నుంచి వచ్చాక ఎవరెవరిని కలిశాడో తెలుసుకొనేందుకు ఆశ కార్యకర్త, ఏఎన్ఎం శుక్రవారం వారింటికి వెళ్లారు. ఏ వివరాలు చెప్పబోమంటూ షేక్ హుస్సేన్ తమ్ముడు అల్తాఫ్‌హుస్సేన్ వారిని బెదిరించాడు. సర్వే ఎందుకు చేస్తున్నారంటూ దుర్భాషలాడి, ఆశ వర్కర్ చేతిలో ఉన్న రిజిస్టర్‌ను చించేసి దాడికి యత్నించాడు. ఆశ కార్యకర్త, ఏఎన్ఎం తప్పించుకొన్నారు. అంతకుముందు ఖుర్షీద్‌నగర్‌లోనూ ఢిల్లీకి వెళ్లొచ్చిన యూసుఫ్‌అలీ సైతం ఏఎన్ఎం, ఆశ కార్యకర్త వెళ్లగా బూతులు తిట్టారు. దీంతో తమపై దాడికి యత్నించినవారిపై చర్యలు తీసుకోవాలని, రక్షణ కల్పిస్తేనే సర్వే నిర్వహిస్తామంటూ ఆశ కార్యకర్త, ఏఎన్ఎం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. డీఎంహెచ్‌వో చందు, ఎస్సీ సీఐ సుభాష్‌రావు విషయాన్ని కలెక్టర్ శ్రీదేవసేన దృష్టికి తీసుకెళ్లారు. కేసులు నమోదు చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా అల్తాఫ్‌హుస్సేన్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఢిల్లీ మత ప్రార్థనలకు వెళ్లొచ్చినవారు సర్వేకు సహకరించాలని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు కోరారు. దాడులకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కామారెడ్డిలో ఉద్రిక్త

కామారెడ్డిలోని సైలానీబాబా కాలనీలో శుక్రవారం ఇంటింటి సర్వేచేస్తున్న ఆశ, మెప్మా కార్యకర్తలను ఒక వర్గంవారు అడ్డుకున్నారు. ఎన్నార్సీలో భాగంగానే ఆధార్‌కార్డు తదితర సమాచారం అడుగుతున్నారని సర్వేచేస్తున్న సిబ్బందిని నిలదీయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. వార్డు కౌన్సిలర్ ప్రవీణ్ సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సీఐ జగదీశ్, తసీల్దార్ అమీన్‌సింగ్, రాపిడ్ యాక్షన్ టీంవారిని సముదాయించారు. కరోనా వ్యాప్తి నియంత్రణకు చేపడుతున్న ఇంటింటి సర్వే అని, జ్వరం, దగ్గు, జలుబు తదితర వివరాలు సేకరిస్తున్నట్టు తెలుపడంతో కాలనీవాసులు శాంతించారు.

ఆదిలాబాద్‌లో దాడి వివరాలను వెల్లడిస్తున్న ఆశ కార్యకర్త, ఏఎన్ఎం

మీ కుటుంబసభ్యులనూ కాపాడుకోండి

- రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజలందరూ తమతమ కుటుంబసభ్యులను కూడా కాపాడుకునేలా మెదలాలని రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు. 'మీ రోగ నిరోధక శక్తి ఎంతో బలంగా ఉన్నదని మీరు భావించినా.. మీ కుటుంబసభ్యులు, పరిచయస్తులు కొవిడ్-19తో పోరాడలేకపోవచ్చు. మీరు కాలు బయటపెడితే మీరొక్కరి జీవితమే కాదు.. ఇతరుల జీవితాన్ని కూడా ప్రమాదంలో పడేసినవారు అవుతారు. ఇంట్లోనే ఉండి సురక్షితంగా ఉండాలి' అని ట్వీట్‌చేశారు. ప్రజానీకాన్ని జాగృతం చేసే వీడియోను కూడా పోస్ట్‌చేశారు.

కరోనాకు నియంత్రణే మందు

- సబ్బుతో చేతులు కడిగితే వైరస్ కొవ్వు కరుగుతుంది
- రోగ నిరోధక శక్తి పెంచుకోవడం మేలు
- అన్ని వయసుల వారికి వైరస్ సోకే ముప్పు
- సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్ ఆర్ విజయ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్‌ను కట్టడి చేయడం మినహా ప్రస్తుతానికి ఔషధాలు, వ్యాక్సిన్లు లేవని సీనియర్ పల్మనాలజిస్టు ఆర్ విజయ్‌కుమార్ చెప్పారు. ఈ వైరస్ అత్యంతవేగంగా మనిషి శ్వాస కోశ వ్యవస్థను దెబ్బతీసి మరణశాసనం లిఖిస్తున్నదన్నారు. సార్స్, ఎబోలో వంటివి కరోనాకు కజిన్‌లాంటివని, ముక్కు, గొంతు దీనికి ప్రధాన ద్వారాలని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో ఫ్లూ వల్ల వెయ్యికి ఒక్కరు మరణించే అవకాశం ఉంటే, కరోనాతో వందకు ఒకరు మరణించే ప్రమాదం ఉన్నదని విశ్లేషించారు. కరోనా వ్యాప్తి నియంత్రణ, జాగ్రత్తలపై ఆయన 'నమస్తే తెలంగాణ'కు వివరించారు.

తుంపర్లతో వ్యాప్తికి అవకాశం

కరోనా సోకిన వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా పక్కనే ఉన్నవారికిలోకి ప్రవేశిస్తుంది. తుంపర్లు మూడున్నర అడుగుల దూరం(మీటరు) వరకు పడే అవకాశం ఉన్నది. అందుకే నిర్ణీత దూరం(మూడు మీటర్లు) పాటిస్తే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. కరోనా రోగి తుంపర్లలో ఉండే వైరస్ వాతావరణంలో ఎంతసేపు బతికి ఉంటుందనే విషయంపై భిన్న వాదనలున్నాయి. తుంపర్లు పడినప్రదేశం, వస్తువులపై చేతులుపెట్టి ముఖాన్ని తాకడం, నోట్లో/ముక్కులో/కళ్లలో పెట్టుకున్నపుడు వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ప్రతి ఒక్కరూ గంటలో కనీసం 23సార్లు ముఖాన్ని తాకుతారని ఓ అధ్యయనంలో తేలింది. అందుకే తరచూ సబ్బుతో నురగ వచ్చేవరకు 20 సెకన్లపాటు కడుక్కోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. సబ్బు నీటితో కడిగితే వైరస్ చుట్టూ కొవ్వుపొర కరిగిపోయి అది నిర్జీవమవుతుంది.

లాక్‌డౌన్‌తో వైరస్‌వ్యాప్తికి చెక్

చిన్నపిల్లలు 'స్టాచ్యూ' ఆట ఆడుతారు. స్టాచ్యూ అనగానే ఉన్నచోట ఆగిపోవాలి. ప్రస్తుత లాక్‌డౌన్ ఉద్దేశం కూడా అదే. ఎవరి ఇండ్లలో వారుంటే వైరస్‌వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు. ఎవరికైనా వైరస్‌సోకినప్పటికీ వైద్యసిబ్బంది సులభంగా గుర్తించి దవాఖానకు తరలించి ఐసొలేషన్‌లో చికిత్స చేసేందుకు అవకాశం కలుగుతుంది.

ఐదు రోజుల్లో లక్షణాలు

కరోనా వైరస్ సోకిన వ్యక్తిలో కనిష్ఠంగా ఐదురోజుల్లో, గరిష్ఠంగా 14 రోజుల్లో లక్షణాలు బయటపడుతాయి. అందుకే విదేశాల నుంచి వచ్చినవారిని, వ్యాధి లక్షణాలున్నవారిని 14 రోజులపాటు స్వీయనిర్బంధంలో ఉంచుతున్నారు. వైరస్‌సోకినవారిలో 90 శాతం మందికి పొడిదగ్గు, జ్వరం వస్తుంది. కొంతమందిలో జ్వరం లేకున్నా దగ్గు కచ్చితంగా ఉంటుంది. వృద్ధులు, చిన్నపిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువ ఉండటంతో మరణాలు సంభవించే అవకాశం ఎక్కువ. సమతుల ఆహారం, పండ్లతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాలి. వేడినీళ్లలో ఉప్పువేసుకొని పుక్కిలించాలి. కరోనా వ్యాక్సిన్ రావడానికి 18 నెలలు పట్టే అవకాశం ఉన్నది.

న్యూస్‌పేపర్లతో కరోనా వ్యాప్తిచెందదు

వార్తాపత్రికలతో కరోనా వైరస్ వ్యాప్తిచెందదు. ఐసీఎంఆర్‌లోని ఎపిడమాలజీ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే ప్రకటన కూడా చేసింది. న్యూస్‌పేపర్‌తో కరోనా వ్యాపించిందనడానికి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాల్లేవు.

మరణం తర్వాతా మరిన్ని జాగ్రత్తలు

- కొవిడ్ మృతుల కోసం ప్రత్యేక మార్చురీ
- బంధువులకు సహకరించేందుకు లైజన్ అధికారి
- శ్మశానవాటికకు తరలించేందుకు ప్రత్యేకరంగు అంబులెన్స్
- మార్గదర్శకాలను జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వ్యాప్తిని అరికట్టడం, పాజిటివ్ వ్యక్తికి చికిత్స అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం.. కొవిడ్ మృతదేహానికి అంతిమసంస్కారాలు జరిగేవరకు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నది. మృతుల నుంచీ వైరస్ వ్యాప్తి చెందకుండా అతి సూక్ష్మ అంశాలపై కూడా దృష్టి సారిస్తున్నది. కొవిడ్-19తో మృతిచెందినవారి అంత్యక్రియలను పద్ధతి ప్రకారం నిర్వర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటుచేసింది. కరోనా మృతులకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలను తెలియజేస్తూ తాజాగా మార్గదర్శకాలను విడుదలచేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవిందర్‌కుమార్ శుక్రవారం జీవో విడుదలచేశారు. మృతదేహాలను మార్చురీలో భద్రపరిచే విధానం, తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శ్మశానవాటికలో పాటించాల్సిన నియమాలను అందులో వివరించారు. దీని ప్రకారం..

- ప్రతి దవాఖానలో ప్రత్యేక మార్చురీ గదిని ఏర్పాటుచేయాలి.
- మృతదేహాన్ని ప్రత్యేకంగా రంగువేసిన వాహనంలో తరలించాలి. స్ట్రెచర్ ట్రాలీకీ రంగువేసి ఉండాలి. ఫ్రీజర్ బాక్సు కనీసం నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా చూడాలి.
- ఒక డ్రైవర్, ఒక హెల్పర్, నలుగురు సహాయకులను ఏర్పాటుచేసుకోవాలి. వారికి నాణ్యమైన ఎన్ 95 మాస్కులు, సర్జికల్ క్యాప్, ప్రొటెక్టివ్ గాగుల్స్, సర్జికల్ గ్లవ్స్, తొడల వరకూ ప్లాస్టిక్ కవర్ ఉండేలా బూట్లు, ఫేస్‌షీల్డ్ వంటి వ్యక్తిగత సంరక్షణ పరికరాలను అందించాలి.
- మృతదేహాల్ని తరలించేందుకు ఫ్రీజర్ బాక్సును కొనుక్కోవడమో లేదా అద్దెకు తీసుకోవడమో చేయాలి.
- చికిత్స తీసుకుంటున్న కొవిడ్ పాజిటివ్ వ్యక్తుల్లో పదిశాతం మేరకు శరీర సంచులను సిద్ధం చేసుకోవాలి.
- చనిపోయినవారి మత ఆచారాన్ని పాటిస్తూనే మృతదేహానికి మొత్తం ప్లాస్టిక్ షీట్‌ను కప్పాలి. తర్వాత దానికి తెల్లటి కాటన్ వస్త్రాన్ని చుట్టాలి. శ్మశానవాటికకు సులువుగా తరలించేందుకు మృతదేహాన్ని సిద్ధంచేయాలి. శవాల గదిలోని గోడలు, గచ్చు, తలుపులు, కిటికీలు, పైకప్పు, ఇతరత్రా వస్తువులపై ప్రతిరోజూ ఐదుసార్లు సోడియం హైపోక్లోరైట్‌ను చల్లాలి.
- మృతుడి కోసం వినియోగించిన వైద్య పరికరాలన్నీ ప్రత్యేకంగా ఒక బ్యాగులో పెట్టి జాగ్రత్తగా తీసుకెళ్లి దహనంచేయాలి.
- మృతదేహాన్ని చూసేందుకు వీలుండేలా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఒక అద్దాల కిటికీ ఉండేలా ఏర్పాటుచేయాలి. అందులో నుంచి మరణించిన వ్యక్తిని చివరిచూపుగా చూసేందుకు కుటుంబసభ్యులను, బంధువుల్లో ఐదుగురిని అనుమతించాలి.
- డాక్టర్లు, నర్సులు, స్టాఫ్ నేరుగా మృతుడి బంధువులను కలవడానికి వీల్లేదు. ఇందుకోసం దవాఖాన విభాగం విడిగా ఒక కోవిడ్ లైజన్ అధికారిని నియమించాలి.

శ్మశాన వాటికల్ని ఇలా సిద్ధం చేయాలి

- ప్రస్తుతం ఉన్న శ్మశానవాటికల్లో కొవిడ్ మృతదేహాల కోసం జిల్లా కలెక్టర్/మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా కొంతస్థలాన్ని కేటాయించాలి.
- మృతదేహాన్ని ఖననం చేసేందుకు సుమారు ఎనిమిది అడుగుల లోతుదాకా గుంతను తవ్వాలి. రెండువైపులా మూడు అడుగుల దూరం ఉం డాలి. ముందుగా అందులో సోడి యం హైపోక్లోరైట్‌ను చల్లాలి.
- కుటుంబసభ్యులు, బంధువులు సామాజికదూరాన్ని పాటించాలి. వారంతా మాస్కుల్ని ధరించి, శానిటైజర్లను వినియోగించాలి.
- మృతదేహం నుంచి కనీసం నాలుగు మీటర్ల దూరం నుంచి ప్రదిక్షణాలు, ప్రార్థన, నమాజు వంటివి చేయాలి. ఆ తర్వాత పూర్తిగా మట్టి కప్పేసి దాని మీద ఒక శాతం సోడియం హైపోక్లోరైట్‌ను చల్లాలి.
- మృతదేహాన్ని దహనంచేస్తే సంబంధిత వ్యక్తులు చేతికి గ్లవ్స్, శానిటైజర్‌ను వినియోగించి అస్థికలను కుటుంబసభ్యులకు అందజేయాలి.
- ఆయా శ్మశానవాటిక మొత్తాన్ని ప్రతిరోజూ రెండుసార్లు సోడియం హైపోక్లోరైట్‌ను చల్లాలి.
- జీహెచ్ఎంసీతోపాటు మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన కలెక్టర్లు కొవిడ్ మృతులను ఖననం చేసేందుకు ప్రత్యేకంగా 20-30 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కమిటీ అభిప్రాయపడింది.

నాగర్‌కర్నూల్ కలెక్టర్ శ్రీధర్‌కు తాము పొదుపు చేసుకున్న మొత్తం రూ.5 వేలు అందజేస్తున్న చిన్నారులు

సీఎంఆర్ఎఫ్‌కు చిన్నారుల విరాళం

బిజినేపల్లి: చిన్నారులు సైతం సీఎం సహాయనిధికి తమ చిన్న మొత్తాల పొదుపును విరాళంగా అందజేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన శఫిపాషా, సోహెయిల్ రెండేండ్లుగా పొదుపు చేసుకున్న మొత్తం రూ.ఐదు వేలను శుక్రవారం కలెక్టర్ శ్రీధర్‌కు అందజేశారు.

నిర్ణీత దూరంతోనే కరోనా కట్టడి

మీడియా సమావేశంలో డాక్టర్ వినయ్‌శేఖర్, డాక్టర్ విష్ణురావు

మీడియాతో మాట్లాడుతున్న గాంధీ దవాఖాన జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వినయ్, అపోలో కన్సల్టెంట్ విష్ణురావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతి ఒక్కరూ నిర్ణీత దూరాన్ని పాటించడం ద్వారా కరోనా వైరస్‌ను కట్టడి చేయవచ్చునని గాంధీ దవాఖాన జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ వినయ్‌శేఖర్, అపోలో కన్సల్టెంట్ డాక్టర్ విష్ణురావు సూచించారు. శుక్రవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్నిరకాల వైరస్‌ల వంటిదే కొవిడ్-19 అని చెప్పారు. ఈ వైరస్ సోకిన 100మందిలో 85 మందికి ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. వృద్ధుల్లో మాత్రమే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, మూత్రపిండాలు, గుండె, కాలేయ సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులు, గొంతునొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు కనిపించిన్నప్పుడు శరీరానికి పూర్తి విశ్రాంతినిస్తూ ఎక్కువ మోతాదులో ద్రవాలు తాగాలని చెప్పారు. చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ స్వీయ గృహ నిర్బంధంలో ఉండటం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. సాధారణ ప్రజలు ఎన్-95 మాస్కులు వేసుకోవాల్సిన అవసరంలేదని, క్లోరోక్విన్ వంటి మందులను వైద్యుల సలహా లేకుండా తీసుకోకూడదన్నారు.

కరోనా ఇంకా గరిష్ఠస్థాయికి చేరలేదు

- పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో కరోనా ఇంకా గరిష్ఠస్థాయికి చేరలేదని పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వైరస్ వ్యాప్తి గరిష్ఠస్థాయికి చేరకుండా లాక్‌డౌన్ సహా ఇతర చర్యలు దోహదపడుతున్నాయని తెలిపారు. జనం ఒక్కచోట చేరే ఏ కార్యక్రమమైనా కరోనా నియంత్రణ చర్యలను దెబ్బతీస్తుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
కార్యనిర్వాహక ఇంజినీర్ వాలి కార్యాలయం, ఐ.బి. డివిజన్, నల్లగొండ

1. టెండర్ నోటీస్ నెం. 01EE/2019-20 తేది: 30-03-2020

పని పేరు: నల్లగొండ జిల్లా-కట్రుంగూర్ మండలం-పెద్ద చెరువు అక్కెన్నపల్లి ఫీడర్ చానల్-పెద్ద చెరువు, ఆకారం నుండి నల్లకుంటబొల్లు కుంట (KM.0.00 నుండి KM. 0.46) నల్లకుంటబొల్లు గ్రామం వరకు ఫీడర్ చానల్ తవ్వకము పనులు. **అంచనా విలువ: రూ.** 9.98 లక్షలు **పై పనులకు సంబంధించిన వివరములు:** ఎ) టెండర్ డాక్యుమెంట్స్ అభ్యమగు కాలం: 06-04-2020 ఉ. 10.00గం. నుండి 13-04-2020 మ. 3.00గం.వరకు. బి) టెండర్ స్వీకరించు చివరి తేది మరియు సమయం: 13-04-2020 సా. 5.00గం.వరకు. సి) టెండర్ తెరుచు తేది మరియు సమయం: 15-04-2020 ఉ. 11.00గం. సంబంధిత అధికారి పేరు/ చిరునామా: శ్రీ ఎం. రఘునాథ్ ప్రసాద్, ఎం.ఇ., కార్యనిర్వాహక ఇంజినీర్ ఐ.బి. డివిజన్, నల్లగొండ. **గమనిక:** మిగతా వివరాలకు tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, ఐ.బి. డివిజన్, నల్లగొండ

DIPR RO. No. 1065-PP/CL/Advt/1/2020-21, Dt: 03/04/2020

లాక్‌డౌన్ డే-12

	హైదరాబాద్	ముంబై	ఢిల్లీ
పెట్రోల్	రూ. 73.97	రూ. 75.30	రూ. 69.59
డీజిల్	రూ. 67.82	రూ. 65.21	రూ. 62.29

అమెరికా అష్టకష్టాలు

- అగ్రరాజ్యాన్ని కమ్మేసిన కరోనా
- 6500మందికిపైగా మృతి
- 2.5లక్షలు దాటిన బాధితులు
- 85% మంది ఇండ్లకే పరిమితం
- తీవ్రస్థాయికి నిరుద్యోగం

పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నాం. అమెరికాలో ఇంతవరకెన్నడూ ఇలాంటి విపత్తు చూడలేదు. ఈ పరిస్థితి భారత్‌లో ఉంటే అల్లకల్లోలమే..
అగ్రరాజ్యంలో కరోనా కల్లోలంపై కాలిఫోర్నియాలో ఉంటున్న ఒక తెలుగు వ్యక్తి చేసిన వ్యాఖ్యలివి.

'రోజురోజుకూ పరిస్థితులు దిగజారుతున్నాయి. తలుపు తెరవాలంటేనే భయమేస్తున్నది. చేతుల్లో డబ్బులు ఉన్నా బయటకు వెళ్లి కొనలేని పరిస్థితి. షాపుల వద్ద క్యూలు తిరుమల క్యూలను తలపిస్తున్నాయి' అని మరొకరు వ్యాఖ్యానించారు.

ఫిలడెల్ఫియాకు చెందిన ఇంకొకరు మాట్లాడుతూ.. ఆరు వారాలుగా ఇంట్లోనే ఉంటున్నట్లు చెప్పారు.

కరోనా నేపథ్యంలో నిర్మానుష్యంగా మారిన న్యూయార్క్‌లోని టైమ్‌స్క్వేర్

న్యూయార్క్: అగ్రరాజ్యాన్ని కరోనా కమ్మేసింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం కరోనా బాధితుల్లో పావువంతు అమెరికా ప్రజలేనని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పరిస్థితులు మరింత క్షీణిస్తాయన్న అంచనాలు అక్కడి ప్రజలను కలవరపెడుతున్నాయి. కరోనా ఆంక్షల నేపథ్యంలో రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాలు మూసివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని హోటళ్లు తెరిచినా, డెలివరీకి మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో వాటి ముందు భారీ 'క్యూ'లు దర్శనమిస్తున్నాయి. మరోవైపు, నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడింది. చైనా ఉత్పత్తులపైనే అమెరికా ఎక్కువగా ఆధారపడుతున్నది. ఆంక్షల నేపథ్యంలో సరుకు రవాణా నిలిచిపోవడంతో తీవ్రత మరింత పెరిగింది. ఇక లాక్‌డౌన్ ప్రకటిస్తే ప్రజలు తుపాకులు చేతబట్టి దుకాణాలపై పడుతారనే ఆందోళన వ్యక్తమవుతున్నది. కాగా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రెండోసారి నిర్వహించిన కరోనా పరీక్షల్లోనూ నెగెటివ్ ఫలితం వచ్చిందని ఆయన వ్యక్తిగత వైద్యుడు తెలిపారు.

పెరుగుతున్న నిరుద్యోగం

కరోనా కారణంగా అమెరికాలో నిరుద్యోగం భారీగా పెరుగుతున్నది. రెండువారాల్లోనే దాదాపు కోటిమంది నిరుద్యోగులుగా మారారు. గత వారం సుమారు 66.5 లక్షల మంది నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రవాస భారతీయుల ఉద్యోగాలు కూడా ప్రమాదంలో పడ్డాయి.

వైద్య సంక్షోభం..

రోజూ వందల సంఖ్యలో కొత్త కేసులు వెలుగుచూస్తుండటంతో వైద్య సిబ్బంది సతమతమవుతున్నారు. మాస్క్‌లు, వెంటిలేటర్లు ఇతర వైద్య సామగ్రికి తీవ్ర కొరత నెలకొన్నది. తమ వద్ద ఆరురోజులకు సరిపడా వెంటిలేటర్లు మాత్రమే ఉన్నాయని న్యూయార్క్ మేయర్ ఆండ్రూ క్యూమో ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే తగినన్ని వెంటిలేటర్లు అందుబాటులోకి రాకపోతే మరణాలు భారీగా పెరుగుతాయని వ్యాఖ్యానించారు. మరోవైపు, వచ్చే రెండు రోజుల్లో మాస్క్‌లు ధరించడాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. న్యూయార్క్‌లో ఇప్పటికే పరిస్థితి దయనీయంగా ఉన్నది. టెక్సాస్‌లోనూ ఈ నెల మధ్యనాటికి పరిస్థితులు తీవ్రస్థాయికి చేరుకుంటాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శీతాకాలం మొదలైతే వైరస్ వ్యాప్తి మరింత తీవ్రంగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

వారే కొంపముంచారా?

సాంకేతికత, సదుపాయాలపరంగా అగ్రపథాన ఉన్న అమెరికా, ఇటలీలో పరిస్థితులు ఇంతలా దిగజారడానికి.. ఆ దేశాల్లో నివసిస్తున్న చైనీయులు నూతన ఏడాది వేడుకలకు స్వదేశానికి వెళ్లిరావడమే కారణమని ఎన్నారైలు భావిస్తున్నారు. వారి ద్వారా స్థానికులకు వైరస్ వ్యాపించిందని అంచనావేస్తున్నారు.

నైతిక మద్దతులే కారణం కావడం బాధాకరం

చైనాలో వెలుగులోకి వచ్చిన కరోనా వైరస్‌పై అవగాహన తెచ్చుకునేలోగానే.. అమెరికా, ఇటలీల్లో అది మరణమృదంగం మోగించింది. తొలుత చైనాలో పరిస్థితిపై ప్రపంచానికి తెలియకపోవడంతో.. అమెరికా, ఇటలీ నుంచి నూతన సంవత్సర వేడుకులకు స్వదేశానికి వెళ్లిన చైనీయులకు వైరస్ సోకింది. అక్కడ ఉత్సవాలు ముగించుకుని వచ్చిన చైనీయులతో స్థానిక ప్రజలకు సోకడం మొదలైంది. అలాగే మానవతా దృక్పథంలో నైతిక మద్దతుగా చేపట్టిన హాంగ్ ఎ చైనీస్ విధానం ఇటలీని తీవ్ర ప్రమాదంలోకి నెట్టింది. ఉత్సవాలు చేసుకోవడం.. నైతికంగా బాసటగా నిలువడమే న్యూయార్క్, న్యూజెర్సీలతోపాటు ఇటలీలో కరోనా పెరుగడానికి కారణం కావడం బాధాకరం.

– మహేశ్ బిగాల, టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్

పీఎంకేర్స్@ఎస్బీఐ

- ఇదే అసలైన యూపీఐ
- మిగతావన్నీ నకిలీవే: సీఈఆర్టీ-ఇన్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మోదీ విజ్ఞప్తి మేరకు గత కొన్ని రోజులుగా పీఎంకేర్స్ అకౌంట్‌కు భారీగా విరాళాలు అందుతున్నాయి. దీన్ని పసిగట్టిన సైబర్ నేరగాళ్లు నకిలీ యూపీఐలను సృష్టించి విరాళాలను తమ అకౌంట్లకు మళ్లిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ వాచ్‌డాగ్ సీఈఆర్టీ-ఇన్ సంస్థ గుర్తించింది. ప్రజలు నకిలీ యూపీల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. పీఎం కేర్స్ అనే అకౌంట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన పీఎంకేర్స్@ఎస్బీఐ.. యూపీఐ మాత్రమే సిసలైనదని సూచించింది. పీఎంకేర్@పీఎన్బీ, పీఎంకేర్@హెచ్డీఎఫ్‌సీ, పీఎంకేర్@యెస్‌బ్యాంక్, పీఎంకేర్@వైబీఎల్, పీఎంకేర్@యూపీఐ, పీఎంకేర్@ఎస్బీఐ, పీఎంకేర్స్@ఐసీఐసీఐ పేర్లతో నకిలీ యూపీఐలను సృష్టించారని తెలిపింది.

కవలల పేర్లు.. కరోనా, కొవిడ్!

రాయ్‌పూర్: కరోనా పేరు వింటేనే వణికిపోతున్న సమయంలో ఛత్తీస్‌గఢ్‌లో ఓ జంట తమ కవల పిల్లలకు కరోనా, కొవిడ్ అని నామకరణం చేశారు. రాయ్‌పూర్‌లోని పాతబస్తీకి చెందిన ప్రీతివర్మకు మార్చి 27 అర్ధరాత్రి నొప్పులు రాగా.. అంబేద్కర్ మెమోరియల్ హాస్పిటల్‌లో కవలలు పుట్టారు. లాక్‌డౌన్ కష్టాలను అధిగమించి జన్మనిచ్చినందుకు గుర్తుగా పాపకు కరోనా అని, బాబుకు కొవిడ్ అని పేర్లుపెట్టినట్టు ప్రీతి తెలిపారు. వైరస్ ప్రమాదకారి అయినా.. ప్రజలు పరిశుభ్రత, మంచి అలవాట్లు పాటించేలా చేసిందని, అందుకే పిల్లలకు ఆ పేర్లు పెట్టామని చెప్పారు.

లాక్‌డౌన్‌తో పెరిగిన గృహహింస!

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుంచి గృహహింస కేసులు పెరిగాయని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ తెలిపారు. మార్చి 24 నుంచి ఏప్రిల్ 1 మధ్య తమకు 257 ఫిర్యాదులు రాగా, వాటిలో 69 గృహహింసవేనని చెప్పా రు. కేసులు ఇంకా చాలా ఎక్కువే ఉం టాయని, భర్త ఇంట్లోనే ఉండటంతో మహిళలు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం వెసులుబాటు ఇస్తే మహిళలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉన్నదని హక్కుల కార్యకర్త కవితాకృష్ణన్ పేర్కొన్నారు.

రోజూ 60 లక్షల సిలిండర్ల సరఫరా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ఉన్నా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రోజూ సగటున 60 లక్షలకు పైగా ఎల్పీజీ సిలిండర్లను పంపిణీ చేస్తున్నాయని కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ శుక్రవారం తెలిపారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) కింద 8 కోట్ల మంది పేదలకు మూడు నెలలు సిలిండర్లను ఉచితంగా అందించాలని ఆదేశించారు.

కబళిస్తుందని తెలిసీ.. తెగించి సాయం

- సేవకు కదిలిన 30,100 మంది వైద్యులు
- కొవిడ్-19పై పోరులో స్వచ్ఛందంగా ముందుకు..

న్యూఢిల్లీ: కరోనా రోగి తుమ్మినా, దగ్గినా.. అతడు తాకిన వస్తువులను ముట్టుకున్నా వైరస్ సోకుతుందని తెలిసి కూడా మానవత్వం ప్రదర్శిస్తున్నారు వైద్యులు. ప్రాణాలను ఫణంగా పెట్టి సహనంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా కనిపించని వైరస్ కబళిస్తుందని తెలిసీ తెగించి సాయం చేసేందుకు ముందుకొస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన ఒక్క విజ్ఞప్తికి వైద్యులతో పాటు పదవీ విరమణ పొందిన వైద్యసిబ్బంది, సాయుధ దళాల్లో వైద్యం అందించినవారు, ప్రైవేటు ఫిజిషియన్లు ఇలా మొత్తం 30,100 మంది స్పందించారని, స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకువచ్చారని చేశారని శుక్రవారం ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. కొవిడ్-19పై పోరులో భాగస్వాములం అవుతామని వారు పేర్కొన్నట్లు తెలిపారు. తమవంతు సేవలు అందించేందుకు ఆరోగ్యంగా ఉన్న వైద్యులు స్వచ్ఛందంగా ముందుకురావాలని భారత ప్రభుత్వం తరుపున మార్చి 25న నీతిఅయోగ్ విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

50 మంది వైద్య సిబ్బందికి కరోనా

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 50 మందికి పైగా వైద్యులు, వైద్య సిబ్బందికి పరీక్షల్లో కొవిడ్-19 పాజిటివ్ రావడంపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ దృష్టి సారించింది. రోగుల నుంచి వారికి వైరస్ సోకిందా? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టింది. వారిలో కొందరు విదేశాల నుంచి వచ్చిన వారితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చింది కేంద్ర ఆరోగ్య శాఖ అధికారి ఒకరు చెప్పారు. వ్యక్తిగత రక్షణాత్మక పరికరాల కొరత నేపథ్యంలో కరోనా రోగులకు వైద్యులు, వైద్య సిబ్బంది చికిత్సచేయడం అపాయకరం అని చెబుతున్నారు. ఇటలీలో చికిత్సనందిస్తున్న సమయంలో రోగులను తాకడంతో కరోనా సోకి పలువురు వైద్యులు మరణించారు. భారత్‌లో కరోనా సోకిన వైద్యులు, వైద్య సిబ్బంది సంఖ్య పెరిగితే ఆ రంగాల సిబ్బంది పెను ప్రమాదంలో చిక్కుకున్నట్లే నని ఆందోళన వ్యక్తమవుతున్నది.

మహమ్మారిపై పోరాడుదాం రండి!

- ప్రపంచ దేశాలకు ఐక్యరాజ్యసమితి పిలుపు

జెనీవా: ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారిని తుద ముట్టించేందుకు ప్రపంచ దేశాలన్నీ ఐక్యంగా కలిసి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) పిలుపునిచ్చింది. ఈ మేరకు తొలి తీర్మానాన్ని గురువారం ఏకగ్రీవంగా ఆమోదించింది. 'కరోనా వైరస్‌తో పోరాడేందుకు గ్లోబల్ సంఘీభావం 2019 (కొవిడ్-19)' పేరుతో తీర్మానాన్ని తీసుకొచ్చింది. ఇదే సమయంలో మానవ హక్కులను కాపాడే అవసరాన్ని నొక్కి చెప్పింది. ఈ వైరస్‌పై పోరాటంలో జాతి, మత వివక్షకు చోటివ్వవద్దని, విదేశీయులంటే భయం పెట్టుకోవద్దని స్పష్టంచేసింది. మహమ్మారి కారణంగా జనరల్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనప్పటికీ.. నిశ్శబ్ద విధానంతో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు. కరోనా వైరస్‌పై సవాళ్లను ఎదుర్కొంటున్నప్పుడు ఐక్యరాజ్యసమితికి సంఘీభావం ప్రకటించడం' అనే పేరుతో రెండో ముసాయిదా తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు.

సంకల్పజ్యోతి వెలిగిద్దాం!

మొదటిపేజీ తరువాయి...

ఇంట్లోనే ఉండి, నిర్ణీత దూరం పాటించాలని కోరారు. దేశంలో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన దేశ ప్రజలను ద్దేశించి వీడియో సందేశం ఇచ్చారు.

చీకటి నుంచి వెలుతురువైపు..

లాక్‌డౌన్ నేపథ్యంలో ఇంట్లోనే ఉన్న కారణంగా చాలామంది ఒంటరితనంగా భావించొచ్చని, అయితే 130 కోట్ల మంది సమిష్టి శక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉన్నదన్న విషయాన్ని వారు గుర్తించాలని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఉమ్మడి శక్తి 'గొప్పతనం, మహత్వం, దివ్యత్వాన్ని' దేశ ప్రజలందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రజలందరూ ఒక్కసారిగా లైట్లను ఆర్పివేసి కొవ్వొత్తులు, మొబైల్‌లోని టార్చ్‌లైట్లను వెలిగించినప్పుడు.. 'మనమందరం సమిష్టిగా పోరాడుతున్నామన్న' భావన ఆ దివ్య వెలుగులో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. 'మనం ఒంటరి కాదు, ఎవరూ ఏకాకి కాదు' అని ఆ వెలుగు ద్వారా మనం సంకల్పించుకోవాలని సూచించారు. తీవ్రంగా ప్రభావితమైన పేదలను ఆదుకోవాలని, కరోనా చిమ్మన ఈ చీకట్లతో నిరాశలో మునిగిపోయిన వారిని ఆశ అనే వెలుతురువైపు నడిపించాలని కోరారు. అలాగే ఈ సంక్షోభం మిగిల్చిన చీకటి, అనిశ్చితికి ముగింపు పలికి స్థిరత్వం, వెలుతురువైపు మనం పురోగమించాలని సూచించారు. మన సంకల్ప శక్తికి మించినది ప్రపంచంలో ఏదీ లేదంటూ సంస్కృత శ్లోకాన్ని ఆయన ఉటంకించారు. లాక్‌డౌన్‌కు సందర్భంగా ప్రజలు చూపిన అసాధారణ క్రమశిక్షణ, సేవా దృక్పథానికి ఆయన కృజ్ఞతలు తెలిపారు. జనతా కర్ఫ్యూ సందర్భంగా ప్రజలంతా వైద్యులకు ధన్యవాదాలు తెలిపిన విధానం చాలా దేశాలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు.

ప్రధాన్ షోమ్యాన్: కాంగ్రెస్

ప్రధాని సందేశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. 'ప్రధాన్ షోమ్యాన్' అంటూ ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ ఎద్దేవాచేశారు. 'హిందూయిజంలో నంబర్ 9తో ముడిపడిన పవిత్ర అంశాలను ప్రధాని ప్రస్తావించారు. తిరిగి రామ్‌భరోస్‌వైపు' అని ట్వీట్‌చేశారు. 'డియర్ పీఎం మోదీ, మేం మీ మాట విని ఏప్రిల్ 5న కొవ్వొత్తులు వెలిగిస్తాం. అలాగే మీరు కూడా, మా మాటలు, శాస్త్రజ్ఞులు, ఆర్థిక వేత్తల మాటలు వినండి' అని చిదంబరం ట్వీట్ చేశారు. ప్రధాని సందేశం ప్రజలను నిరాశపరిచిందని ఎన్సీపీ అభిప్రాయపడింది.

చార్లెస్, నెతన్యాహూకు మోదీ ఫోన్

కరోనా నుంచి కోలుకున్న బ్రిటన్ యువరాజు ప్రిన్స్ చార్లెస్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఆయుర్వేద వైద్య చికిత్స పొందుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. క్వారంటైన్‌లో ఉన్న నెతన్యాహూకు సైతం మోదీ ఫోన్ చేసి, ఆరోగ్యం గురించి ఆరాతీశారు.

ప్రధాని పిలుపును పాటిద్దాం

- రాష్ట్ర ప్రజలను కోరిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు ఆదివారం రాత్రి 9 గంటలకు రాష్ట్ర ప్రజలంతా దీపాలు వెలిగించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోరారు. కరోనా వైరస్‌పై పోరుకు సంఘీభావ సంకేతంగా, ప్రజల ఐక్యతను చాటేలా దీపాలు వెలిగించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మానవజాతి తనకు పట్టిన పీడపై చేస్తున్న గొప్ప పోరాటం.. స్ఫూర్తిమంతంగా సాగాలని ముఖ్యమంత్రి అభిలషించారు.

నిధులు అవసరం: సీపీఐ, న్యూడెమోక్రసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాపై పోరాడేందుకు కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలకు అవసరమైన ఆర్థిక భరోసాను కల్పించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కరోనా కట్టడికి కేంద్రం రూ.7.35 లక్షల కోట్లు విడుదలచేసి ఆదుకోవాలని కోరారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన నిధులు, వైద్య పరికరాలు, మందులు పంపిణీచేయాలని న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యుడు కే గోవర్ధన్ డిమాండ్‌చేశారు.

నేడు ఫోల్డ్ అత్యవసర వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 5న దేశ ప్రజలందరూ 9 నిమిషాలపాటు లైట్లు ఆర్పివేస్తే విద్యుత్ గ్రిడ్‌పై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఫోరం ఫర్ లోడ్ డిస్పాచెస్ (ఫోల్డ్) సంస్థ శనివారం ఉదయం 11.30 గంటలకు అత్యవసర వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటుచేసింది. ఇప్పటికే తెలంగాణ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచి అంతర్గతంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

చిట్టి చేతులు.. గట్టి చేతలు

- పీఎం కేర్స్‌కు కిడ్డీ బ్యాంకు డబ్బులు

అహ్మదాబాద్: కిడ్డీ బ్యాంకుల్లో దాస్తున్న డబ్బులు ఏంచేస్తావని అడిగితే.. 'మంచి బొమ్మ కొంటాననో. సైకిల్ తెచ్చుకుంటాననో..' ఠక్కున చెప్పేస్తారు పిల్లలు. కానీ, ఈ చిన్నారులు మాత్రం.. చేతులు చిట్టివైనా చేతలు గట్టివని నిరూపిస్తున్నారు. భరుచ్ జిల్లా అంక్లేశ్వర్‌కు చెందిన పారిస్ వ్యాస్ అనే నాలుగేండ్ల బాలిక తాను కిడ్డీ బ్యాంకులో దాచిన నాణేలు, నోట్లు కలిపి మొత్తంగా వచ్చిన రూ.11,200ను పీఎం కేర్స్‌కు విరాళంగా అందజేసింది. 'కరోనాపై పోరుకు చాలామంది ప్రముఖులు డబ్బు అందిస్తున్నట్టు టీవీలో చూశాను. నేను కూడా పిగ్గీ బ్యాంకులో దాచిన మొత్తాన్ని విరాళంగా అందిస్తున్నా' అని తెలిపింది. అహ్మదాబాద్‌కు చెందిన ముగ్గురు బాలురు.. తాము పొదుపుచేసిన రూ.5,500ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. వలస కార్మికులు, నిరుపేదల ఆకలితీర్చాలని విజ్ఞప్తిచేశారు. ప్రధాని మోదీ మాతృమూర్తి రూ.25 వేలు విరాళంగా అందజేయడంతో.. ఆమె స్ఫూర్తితో గాంధీనగర్‌కు చెందిన 13 ఏండ్ల రుద్రపటేల్ కోరిక మేరకు వారి కుటుంబం రూ.లక్షను పీఎం కేర్స్‌కు విరాళంగా అందజేసింది. ఈ ఏడాది పుట్టినరోజు వేడుకలు జరుపుకోవద్దని నిర్ణయించుకున్నానని, తన విజ్ఞప్తిమేరకు తల్లిదండ్రులు రూ.లక్ష విరాళంగా అందజేశారని రుద్రపటేల్ తెలిపారు.

లాక్‌డౌన్‌పై గూగుల్ నిఘా!

- లొకేషన్ సమాచారం ద్వారా జనం కదలికలపై విశ్లేషణ
- కరోనా కట్టడి చర్యలపై ప్రపంచానికి మార్గదర్శనం

న్యూఢిల్లీ: ప్రపంచ మహమ్మారి కరోనా కట్టడికి ప్రపంచ దేశాలన్నీ లాక్‌డౌన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అయినా ప్రపంచవ్యాప్తంగా వైరస్ కేసులు పది లక్షలు, మరణాలు 50 వేలు దాటడం ఆందోళన కలిగిస్తున్నది. సామాజిక దూరం పాటించాలని, లాక్‌డౌన్ నేపథ్యంలో ఇండ్లలోనే ఉండాలని ప్రభుత్వాలు మొరపెట్టుకుంటున్నా చాలా మంది చెవినెక్కించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గూగుల్ ఓ వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్న తీరుపై విశ్లేషణకు ఓ ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను శుక్రవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. మొబైల్ వినియోగదారుల నుంచి సేకరించిన లొకేషన్ సమాచారం ఆధారంగా 131 దేశాల్లో ప్రజల కదలికలపై రిపోర్ట్‌ను అందులో పొందుపరిచింది. లాక్‌డౌన్ నేపథ్యంలో పలు చోట్లకు జనం కదలికల్లో హెచ్చుతగ్గులను శాతాలవారీగా అందిస్తున్నది. కాగా, ఇది కేవలం ప్రజల కదలికల గురించి శాతాల వారీగా విశ్లేషణ మాత్రమేనని గూగుల్ మ్యాప్స్ అధిపతి, గూగుల్ హెల్త్ చీఫ్ హెల్త్ అధికారి కరెన్ డెసాల్వో తెలిపారు. వ్యక్తుల కదలికలకు సంబంధించిన వాస్తవ సంఖ్య, లేదా వారి వ్యక్తిగత సమాచారాన్ని ఎంతమాత్రం బహిరంగపర్చడం లేదని ఆయన పేర్కొన్నారు. ఏఏ ప్రాంతాల్లో జనరద్దీ ఎలా ఉన్నదన్నది తెలుసుకునేందుకు తమ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. తద్వారా ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకునేందుకు ఇది సహకరిస్తుందని పేర్కొన్నారు. కాగా, గూగుల్ మ్యాప్స్‌లో ఇప్పటికే ఈ విధానం అందుబాటులో ఉన్నది. లొకేషన్ ఫీచర్ ఆధారంగా రద్దీగా ఉండే ట్రాఫిక్ సిగల్స్, మార్గాలు, ప్రాంతాలను మొబైల్ వినియోగదారులకు గూగుల్ సూచిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు వ్యక్తిగత గోప్యత హక్కును గూగుల్ హరిస్తున్నదన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

మార్చి 29 వరకు భారత్‌లో ఇలా..

భారత్‌లో ఫిబ్రవరి 16 నుంచి మార్చి 29 వరకు ప్రజల కదలికలపై విశ్లేషణను గూగుల్ విడుదల చేసింది. రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్ వంటి వినోద ప్రాంతాలను సందర్శించిన వారి సంఖ్య 77 శాతం తగ్గినట్లు పేర్కొంది. అలాగే గ్రోసరీ, మెడికల్ షాప్స్‌లకు 65 శాతం , పార్కులు, తీర ప్రాంతాలకు 57 శాతం మేర కదలికలు తగ్గినట్లు తెలిపింది. బస్టాండ్, రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టు వంటి ప్రయాణ ప్రాంతాలకు ప్రజల కదలికలు 71 శాతం మేర పడిపోయాయని, పని చేసే ప్రాంతాల సందర్శనలో 47 శాతం తగ్గుదల కనిపించిందని పేర్కొంది. మరోవైపు నివాస ప్రాంతాల్లో జనం కదలికలు 22 శాతం పెరిగినట్లు గూగుల్ విశ్లేషించింది.

లాక్‌డౌన్ నేపథ్యంలో గాలి కాలుష్యం గణనీయంగా తగ్గడంతో శుక్రవారం పంజాబ్‌లోని జలంధర్ నుంచి స్పష్టంగా కనిపిస్తున్న హిమాలయ పర్వతాలు



ఎవరూ ఆకలితో ఉండొద్దు

- గవర్నర్లకు రాష్ట్రపతి కోవింద్ ఆదేశం

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ సమయంలో దేశంలోని ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి అన్ని రాష్ట్రాల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైరస్ వ్యాప్తి నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఢిల్లీలోని ఆనంద్‌విహార్‌లో వలస కూలీలు భారీగా గుమికూడటం, నిజాముద్దీన్ మర్కజ్ సమావేశానికి హాజరైనవారికి వైరస్ సోకడంపై రాష్ట్రపతి ఆందోళన వ్యక్తంచేశారు. కొవిడ్-19ను అంతమొందించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలకు ఇవి ఎదురుదెబ్బలని అభిప్రాయపడ్డారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులపై దాడులు జరుగడంపై విచారం వ్యక్తంచేశారు. కాగా.. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్రపతికి వివరించారు. ప్రభుత్వం గతనెల 20 నుంచి పూర్తిస్థాయిలో అప్రమత్తమైందని, రూ.457.75 కోట్లు కేటాయించిందన్నారు. ఇప్పటివరకు 2,400 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 12,500 పడకలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

డైమండ్ ప్రిన్సెస్

జాండామ్

సముద్రంలో మృత్యుఘోష

నౌకలనూ వదలని కరోనా మహమ్మారి

- 19 నౌకల్లో 25 మంది వరకు మృత్యువాత
- వందల మందికి సోకిన కరోనా వైరస్
- సముద్రయానాలపై పలు దేశాలు నిషేధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారి సముద్రజలాల్లోనూ కల్లోలం రేపింది. సరదాగా విహరిద్దామని వెళ్లిన యాత్రికులను పొట్టనపెట్టుకున్నది. డైమండ్ ప్రిన్సెస్, రూబీ ప్రిన్సెస్ నౌకల్లో పదుల సంఖ్యలో యాత్రికులు కరోనా బారినపడి మరణించడంతో సముద్రయానం అంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొన్నది. దీంతో అనేకదేశాలు నౌకాయానంపై నిషేధం విధించాయి. కరోనా వల్ల నౌకల్లో నాలుగువారాల్లోనే 25 మందివరకు మృత్యువాతపడ్డారు.

డైమండ్ ప్రిన్సెస్

జపాన్, తైవాన్, దక్షిణకొరియా దేశాల జలాల్లో విహరించాలని కోరుకునేవారు డైమండ్ ప్రిన్సెస్ నౌకలో ప్రయాణించడాన్ని స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. జపాన్‌లోని యొకొహామా నుంచి ఈ ఏడాది జనవరి 20న 3,711 మంది ప్రయాణికులతో డైమండ్ ప్రిన్సెస్ బయల్దేరింది. అందులో జపాన్, కంబోడియా, హాంకాంగ్, ఈజిప్ట్, ఆస్ట్రేలియా, కాలిఫోర్నియా, బ్రెజిల్, చిలీ, క్యూబా, ఫ్రాన్స్, రోమ్, హాలెండ్ తదితర ప్రాంతాలకు చెందినవారున్నారు. ఒక వ్యక్తి ఫిబ్రవరి ఒకటిన హాంకాంగ్‌లో దిగి దవాఖానకు వెళ్లి పరీక్ష చేయించుకుంటే అతనికి కరోనా పాజిటివ్ అని తేలింది. దీంతో అక్కడి ప్రభుత్వం ఫిబ్రవరి నెల మొత్తం ప్రయాణికులందరినీ నౌకలోనే క్వారంటైన్‌లో ఉంచింది. దీంతో రోజుకు కొందరు చొప్పున కరోనా బారిన పడటం మొదలైంది. ఫిబ్రవరి 7న 61 మందికి, 8న ముగ్గురికి పాజిటివ్ అని తేలింది. తిరిగి 9న ఆరుగురికి, 10న ఏకంగా 60మందికి కరోనా సోకింది. మార్చి ప్రారంభం నాటికి 712 మంది ప్రయాణికులకు కరోనా పాజిటివ్ అని తేలినట్టు అధికారులు వెల్లడించారు. అనగా నౌకలోని 19.2 శాతం మంది కరోనా బారినపడ్డారని తేలింది. వ్యాధికి గురైన వారిలో ఫిబ్రవరి 20 నుంచి 25 మధ్య నలుగురు జపనీయులు మరణించారు. ఫిబ్రవరి 28న ఒక ఆంగ్లేయుడు, ఆ తరువాత వరుసగా ఆస్ట్రేలియా, హాంకాంగ్, కెనడా దేశస్థులు మృత్యువాతపడ్డారు. దీంతో ఒక్కసారిగా కలకలం మొదలైంది. జర్మన్ ప్రభుత్వం తక్షణమే తమ క్రూయిజ్ నౌకల విహారయాత్రలను రద్దుచేసింది. వీకింగ్ సంస్థ కూడా క్రూయిజ్ యాత్రలను నిలిపివేసింది.



ఈ ఏడాది ఫిబ్రవరి 4 నుంచి మార్చి 27 వరకు దాదాపు 19 నౌకల్లో 1581 మందికి కరోనా వ్యాధి సోకగా వారిలో 25మంది మృత్యువాతపడ్డారు.

ఫ్లోరిడాలో లంగరేసిన జాండామ్

బ్యూనస్ ఎయిర్స్ నుంచి 1829 మంది ప్రయాణికులు, సిబ్బందితో బయల్దేరిన హాలెండ్ క్రూయిజ్‌షిప్ జాండామ్ కూడా కరోనా బారిన పడింది. ఆ నౌకను చిలీ తమ నౌకాశ్రయంలోకి అడుగుపెట్టనీయలేదు. దీంతో నౌకను పనామా కెనాల్ మీదుగా దారి మళ్లించారు. మార్గమధ్యలోనే నలుగురు ప్రయాణికులు మరణించారు. హాలెండ్ అధ్యక్షుడి విజ్ఞప్తి మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకోవడంతో ఫ్లోరిడా గవర్నర్ ఆ నౌకను తమ నౌకాశ్రయంలో లంగరేసేందుకు అంగీకరించారు. కెనడా, బ్రిటన్ ప్రభుత్వాలు తమ పౌరులను రక్షించి దవాఖానల్లో చేర్పించాయి. మొత్తంగా ఆ నౌకలో ప్రయాణించిన వారిలో 576మంది కరోనా బారిన పడ్డారు.

- విదేశాల నుంచి వచ్చే నౌకలపై ఆస్ట్రేలియా మార్చి 15 నుంచి నిషేధం విధించింది. అయితే రూబీ ప్రిన్సెస్‌కు మాత్రం మినహాయింపునిచ్చింది. సిడ్నీ నుంచి న్యూజిలాండ్ బయల్దేరిన రూబీలో 3,800 మంది ఉండగా, వారిలో 576 మందికి కరోనా సోకింది. వీరిలో ఐదుగురు మరణించారు.
- కాలిఫోర్నియాకు చెందిన గ్రాండ్ ప్రిన్సెస్ నౌకలో 3,533 మంది ఉండగా, వారిలో 103 మంది కరోనా బారినపడ్డారు. వీరిలో ఇద్దరు మరణించారు.
- ఫ్రాన్స్‌కు చెందిన కాస్టా లుమినాసా నౌకలో 1780 మందితో బయల్దేరింది. వీరిలో ముగ్గురికి కరోనా సోకగా, ఒకరు మరణించారు.

కరోనా క్లాక్
3-4-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు	10.08 లక్షలు
కోలుకున్నవారు	2,27,668
మరణాలు	58,110

దేశం	కేసులు	మరణాలు
అమెరికా	2,65,506	6,786
ఇటలీ	1,19,827	14,681
స్పెయిన్	1,17,710	10,935
జర్మనీ	89,838	1,230
చైనా	81,620	3,322
ఫ్రాన్స్	64,338	6,507
ఇరాన్	53,183	3,294
యూకే	38,168	3,605
టర్కీ	20,921	425
స్విట్జర్లాండ్	19,606	591

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు	2,983
కోలుకున్నవారు	209
మరణాలు	84

దేశంలో కరోనా కేసులు

మహారాష్ట్ర 490	తమిళనాడు 411	ఢిల్లీ 386
కేరళ 295	తెలంగాణ 229	ఉత్తరప్రదేశ్ 174
ఏపీ 164	రాజస్థాన్ 155	మధ్యప్రదేశ్ 154
కర్ణాటక 128	గుజరాత్ 95	కశ్మీర్ 75
ప. బెంగాల్ 53	పంజాబ్ 53	హర్యానా 47

ఏపీలో తొలికరోనామరణం

- 164కి పెరిగిన బాధితుల సంఖ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లో తొలి కరోనా మరణం నమోదైందని వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం తెలిపింది. ఒక్కరోజే 12 కేసులు నమోదయ్యాయని, దీంతో వైరస్ బాధితుల సంఖ్య 164 పెరిగిందని తెలిపింది. ఢిల్లీలో మత ప్రార్థనలకు వెళ్లివచ్చిన వారిలోనే అత్యధిక పాజిటివ్ కేసులు వస్తున్నాయి. కొత్తగా నెల్లూరు జిల్లాలో 8, విశాఖలో 3 కేసులు నమోదయ్యాయి. విజయవాడలో 55 ఏండ్ల వ్యక్తి కరోనా వైరస్‌తో బాధపడుతూ మృతి చెందాడు. కుమారుడి నుంచి తండ్రికి వైరస్ సోకిందని, బాధితుడికి హైపర్‌టెన్షన్, డయాబెటిస్ ఉన్నాయని వైద్యులు తెలిపారు. అతని కుమారుడు ఢిల్లీలో మత పరమైన ప్రార్థనలకు హాజరై మార్చి 17న ఇంటికి వచ్చాడని, మార్చి 30న అతడికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని చెప్పారు. మరోవైపు కరోనాపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కరోనా పాజిటివ్ కేసుల్లో ఎక్కువగా ఢిల్లీలో మతప్రార్థనలకు వెళ్లివచ్చినవారే ఉన్నారని మంత్రి ఆళ్ల నాని తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన 164 కేసుల్లో 140 మంది ఢిల్లీ మతప్రార్థనలతో సంబంధం ఉన్నవారేనన్నారు. కాగా.. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఎస్మా అమలు చేసింది. ఆరు నెలలపాటు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సేవలు, డాక్టర్లు, నర్సులు, ఆరోగ్య సిబ్బందిని దీని పరిధిలోకి తీసుకువచ్చారు.

- రాళ్లతో కొట్టినా తగ్గని స్ఫూర్తి

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కరోనా అనుమానితులను పరీక్షించేందుకు వెళ్లిన వైద్య సిబ్బందిపై స్థానికులు రాళ్లదాడిచేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. అయినా రోగులను కాపాడాలన్న స్ఫూర్తి వారిలో ఇసుమంతైనా తగ్గలేదు. దాడి జరిగిన మరుసటి రోజే వారు మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లారు. 'వాళ్లు దాడిచేశారని మా కర్తవ్యాన్ని ఎలా వదులుకుంటాం?' అని చెప్పారు.

వారంలో 4 రెట్లు

- దేశంలో విజృంభిస్తున్న కరోనా వైరస్
- మూడు వేలకు చేరువలో బాధితులు.. 84 మరణాలు

న్యూఢిల్లీ: దేశంలో గత వారం రోజుల్లోనే కరోనా కేసులు, మరణాలు నాలుగు రెట్లు పెరిగాయి. మార్చి 27 నాటికి కరోనా బాధితుల సంఖ్య 724, మరణాలు 17 ఉండగా.. శుక్రవారం నాటికి 2,983కిపైగా కేసులు, 84 మరణాలు నమోదయ్యాయి. ఢిల్లీలోని తబ్లిగీ జమాత్ మత సమ్మేళనంలో పాల్గొన్న వారి ద్వారా వైరస్ చాపకింద నీరులా వ్యాపించడమే దీనికి కారణంగా తెలుస్తున్నది. గురువారం నుంచి శుక్రవారం వరకు 24 గంటల్లో దేశంలోని పలు రాష్ట్రాల్లో 380 కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. దీంతో వైరస్ సోకిన వారి సంఖ్య 2,983కు, మృతుల సంఖ్య 84కు పెరిగినట్లు పేర్కొన్నారు. మర్కజ్‌లో పాల్గొన్న వారి వల్లే వైరస్ కేసులు ఒక్కసారిగా పెరిగాయన్నారు. కరోనా లక్షణాలున్న వారిని గుర్తించేందుకు మహారాష్ట్ర 9 లక్షల మందిని సర్వే చేశారు.

9వేల మందికి పరీక్షలు

దేశవ్యాప్తంగా కరోనా పరీక్ష ల్యాబ్స్ సంఖ్య 180కి చేరినట్టు ఐసీఎంఆర్ తెలిపింది. గత 24 గంటల్లో దాదాపు తొమ్మిదివేల మందికి పరీక్షలకు నిర్వహించినట్లు వెల్లడించింది. ఢిల్లీ వంటి నగరాల్లో ర్యాపిడ్ యాంటీబాడీ టెస్ట్ నిర్వహించాలని కేంద్రం సూచించింది. దేశంలో ఎలాంటి మందుల కొరత లేదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్ష వర్ధన్ తెలిపారు. పది కోట్ల హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రల సరఫరాకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. ఐదు రోజుల్లో 15.4 టన్నుల వైద్య సామగ్రిని పలు రాష్ట్రాలకు తరలించామన్నారు. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అన్ని రాష్ట్రాలకు కేంద్రం రూ. 17,287 కోట్లు విడుదల చేసింది. మరోవైపు ప్రపంచ బ్యాంకు భారత్‌కు బిలియన్ డాలర్ల(రూ.7.3వేల కోట్లు) సాయాన్ని ప్రకటించింది.

ఢిల్లీలోని ఓ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సేదతీరుతున్న గృహ వసతి లేనివారు

తేదీ	కేసులు	మరణాలు
మార్చి 26	694	16
మార్చి 27	724	17
మార్చి 28	929	20
మార్చి 29	1,024	27
మార్చి 30	1,251	32
మార్చి 31	1,397	35
ఏప్రిల్ 1	1,949	59
ఏప్రిల్ 2	2,507	76
ఏప్రిల్ 3	2,983	84

వైద్యులపై దాడిచేస్తే కేసులు..

కరోనా రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో వైద్య సిబ్బందిపై దాడి చేసిన నలుగురిపై జాతీయ భద్రతా చట్టం కింద కేసులు నమోదు చేయగా, బెంగళూరులో సర్వే చేస్తున్న సిబ్బందిపై దాడి చేసిన ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఢిల్లీలో హోం క్వారంటైన్ నిబంధనలు ఉల్లంఘించిన 33 మందిపై కేసులు నమోదు చేశారు. పుణెలో ఓ వ్యక్తి తన భార్యకు కరోనా సోకిందంటూ ఏప్రిల్ ఫూల్ చేయడానికి ప్రయత్నించగా కేసు నమోదు చేశారు.

14 రాష్ట్రాలకు తబ్లిగీ సంక్షోభం

ఢిల్లీలో మొదలైన నిజాముద్దీన్ తబ్లిగీ సంక్షోభం 14 రాష్ట్రాలకు విస్తరించింది. గత రెండు రోజుల్లో వెలుగుచూసిన 647 కరోనా పాజిటివ్ వ్యక్తులందరూ ఢిల్లీలో జరిగిన తబ్లిగీకి హాజరైన వారేనని కేంద్రం తెలిపింది. ఈ కేసులు 14 రాష్ట్రాల్లో నమోదయ్యాయని చెప్పింది. మొత్తంగా సదస్సుకు హాజరైనవారిలో ఇప్పటివరకు 750 మందికిపైగా వైరస్ సోకిందన్నారు. దేశంలో నమోదైన కేసుల్లో ఇవి 25 శాతానికిపైనేనని వెల్లడించింది. మరోవైపు నిజాముద్దీన్ తబ్లిగీకి నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయన్న విషయమై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయని సమాచారం. గల్ఫ్ దేశాల నుంచే భారీగా నిధులు వస్తున్నాయని తేలింది. తబ్లిగీ అధిపతి మౌలానా సాద్‌ను పోలీసులు ప్రశ్నించారు.

రెండు జిల్లాల్లో 48 గంటలు షట్‌డౌన్

ఒడిశాలోని భువనేశ్వర్, భద్రక్ జిల్లాల్లో శుక్రవారం రాత్రి నుంచి 48 గంటల పాటు కర్ఫ్యూ తరహా షట్‌డౌన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం నిత్యావసరాలు, పాలు, కూరగాయల సరఫరాను సైతం నిలిపివేస్తారు. ఎంపిక చేసిన మెడికల్ షాపులను మాత్రమే తెరిచి ఉంచుతారు.

శ్వాస ద్వారానూ వ్యాప్తి!

వాషింగ్టన్: గాలి ద్వారా కరోనా వ్యాప్తి చెందుతుందా? లేదా? అన్నది స్పష్టంగా తేలకముందే.. 'సాధారణ శ్వాస' ద్వారా కూడా వైరస్ గాలిలోకి చేరుతుందని అమెరికా శాస్త్రవేత్త హెచ్చరించారు. సంక్రమిత వ్యాధులపై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ అధిపతి హార్వే ఫైన్‌బర్గ్ ఈ నెల 1న శ్వేతసౌధానికి రాసిన లేఖలో ఈ అంశాన్ని పేర్కొన్నారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా, వైరస్ బాధితులు తాకిన ఉపరితలాలను ముట్టుకొని, అనంతరం అదే చేతులతో నోరు, ముక్కు, కన్నును తాకడం వల్ల వైరస్ సంక్రమిస్తుందని ఇప్పటివరకు అన్ని సంస్థలు భావిస్తున్నాయి. అయితే ఊపిరి వదిలినప్పుడు వెలువడే అతిసూక్ష్మ కణాల ద్వారా వైరస్ గాల్లోకి చేరుతుందని ఫైన్‌బర్గ్ హెచ్చరించారు. ఇదే జరిగితే వైరస్ నుంచి రక్షణ మరింత కష్టతరంగా మారుతుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వుహాన్‌లో మళ్లీ లాక్‌డౌన్!

- ఇండ్ల నుంచి బయటకు రావొద్దంటూ నోటీసులు

బీజింగ్: వైరస్ పుట్టినిల్లయిన వుహాన్‌లో.. మహమ్మారి మరోసారి విజృంభిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వుహాన్ వాసులు ఇండ్ల నుంచి బయటకు రావొద్దని నగర అధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ఈ నెల 8 నుంచి 100 ప్యాసింజర్ రైళ్ల సర్వీసులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో.. తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకున్నది. వుహాన్‌లో తొమ్మిది వారాల లాక్‌డౌన్‌కు గత నెల 25న స్వస్తి పలుకగా.. కొన్ని రోజుల్లోనే మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. గురువారం 51 కొవిడ్ కేసులను గుర్తించామని స్థానిక ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే తాజా ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తున్నది. కేసుల సంఖ్య పెరిగితే మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారనే వార్తలు వస్తున్నాయి.

యూపీలో నర్సులకు వేధింపులు.. ఆరుగురు కరోనా రోగులపై ఎన్ఎస్ఏ

ఘజియాబాద్: ఢిల్లీ మర్కజ్ సదస్సుతో సంబంధం ఉండి, క్వారంటైన్‌లో ఉన్న ఆరుగురు వ్యక్తులు.. చికిత్స అందిస్తున్న నర్సులను వేధించారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగింది. జిల్లా దవాఖానలోని ఐసోలేషన్‌వార్డులో చికిత్స పొందుతున్న ఆరుగురు రోగులు.. నర్సుల ముందు ప్యాంట్లు విప్పి అసభ్యంగా ప్రవర్తించడం, దుర్భాషలాడటం వంటి చర్యలకు దిగారు. దీంతో వారిపై దవాఖాన చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ చర్యను యూపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వారిపై జాతీయ భద్రతా చట్టం ప్రయోగించాలని నిర్ణయించింది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వారిని 'మానవత్వానికి శత్రువులు'గా అభివర్ణించారు. 'వారు చట్టాన్నైనా అంగీకరించాలి. లేదా ఏర్పాట్లైనా అనుసరించాలి' అని స్పష్టంచేశారు. ప్రస్తుతం వారిని వేరే ప్రాంతానికి తరలించారు.

ఇంటి నుంచే టోఫెల్, జీఆర్ఈ పరీక్షలు

- చైనా, ఇరాన్ విద్యార్థులకు మినహాయింపు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు ఉన్నత యూనివర్శిటీల్లో ప్రవేశాలకు కీలకమైన ఇంగ్లీష్, విదేశీ భాషా పరీక్ష (టోఫెల్), గ్రాడ్యుయేట్ రికార్డు ఎగ్జామినేషన్స్(జీఆర్ఈ)లను విద్యార్థులు ఇంటి నుంచే రాయొచ్చు. కరోనా నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) తెలిపింది. చైనా, ఇరాన్ మినహా ప్రపంచవ్యాప్తంగా విదార్థులకు ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొంది. పరిస్థితులు అనుకూలించేంత వరకు నిర్దేశిత పరీక్షా కేంద్రాలకు బదులుగా విద్యార్థులకు ఇండ్ల నుంచే ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు టోఫెల్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకాంత్ గోపాల్ తెలిపారు. పరీక్షా కేంద్రాల మాదిరిగానే విద్యార్థులు ఇంటి వద్ద నుంచి తమ అనుకూల సమయంలో ఈ ఆన్‌లైన్ పరీక్షలను రాయొచ్చన్నారు. జూన్ నెలలో నిర్వహించే పరీక్షలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు.

చైనావి కచ్చితమైన లెక్కలు కావు

- పరువు కాపాడుకొనే ప్రయత్నం: నిక్కీ హేలీ

వాషింగ్టన్: చైనా ప్రకటించిన కరోనా వైరస్ మృతుల సంఖ్య కచ్చితమైనది కాదని ఇండో-అమెరికన్ రాజకీయవేత్త, ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ సందేహం వ్యక్తంచేశారు. పేరు, ప్రఖ్యాతులను కాపాడుకొనేందుకే చైనా ప్రాధాన్యం ఇస్తున్నదని మండిపడ్డారు. బీజింగ్ నుంచి వచ్చే డాటాను విశ్వసించవద్దని అన్నారు. 150 కోట్ల జనాభా ఉన్న దేశంలో కేవలం 82 వేల కొవిడ్-19 కేసులు నమోదయ్యాయని, 3,300 మాత్రమే చనిపోయారని చైనా చెప్పడం శుద్ధ అబద్ధమని గురువారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. తమ దేశంలో మొదలైన వైరస్‌ను తుదముట్టించేందుకు మిగతా ప్రపంచానికి సాయం చేయడం కన్నా.. తమ పరువే ముఖ్యమని వైరస్‌పై చైనా గోప్యత పాటించిందని నిక్కీ హేలీ ఆరోపించారు. మరోవైపు చైనా నుంచి వచ్చే సంఖ్యను నమ్మరాదని అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) ఇప్పటికే వైట్ హౌస్‌కు సూచించింది.

స్పెయిన్‌లో 10వేల మరణాలు

స్పెయిన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక దవాఖానలో కరోనా అనుమానితులకు చికిత్స

- ఒక్కరోజే కరోనాతో 950 మంది మృతి
- ప్రపంచవ్యాప్తంగా 10 లక్షలు దాటిన కేసులు

వాషింగ్టన్/బీజింగ్/పారిస్/సింగపూర్, ఏప్రిల్ 3: కరోనా కరాళనృత్యం కొనసాగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మందికి వైరస్ సోకగా.. మరణాల సంఖ్య 50వేలు దాటింది. దాదాపు సగానికిపైగా జనాభా ఇండ్లకే పరిమితమయ్యారు. స్పెయిన్‌లో 24 గంటల వ్యవధిలో 950 మంది మరణించారు. దీంతో ఆ దేశంలో మరణాల సంఖ్య 10వేలు దాటింది. అయితే కరోనా వల్ల హాహాకారాలు చేసిన ఇటలీ, స్పెయిన్ దేశాల్లో ప్రస్తుతం కొత్త కేసులు తగ్గుముఖం పడుతుండటం కాస్త ఊరటనిచ్చే అంశం. బ్రిటన్‌లో ఒక్కరోజే 569 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో వారంపాటు రోజూ లక్ష మందికి పరీక్షలు నిర్వహించాలని ప్రధాని బోరిస్ జాన్సన్ ఆదేశించారు. వైరస్ వల్ల గురువారం ఫ్రాన్స్‌లో 471 మంది మరణించారు. థాయ్‌లాండ్‌లో శుక్రవారం నుంచి కర్ఫ్యూ విధించారు. నైజీరియాలాంటి వంటి పేద దేశాల్లో కరోనా విజృంభిస్తే కార్చిచ్చులా మారుతుందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ అధికారి ఆందోళన వ్యక్తంచేశారు. కరోనా వృద్ధులకే తొందరగా సోకుతుందన్నది తప్పు అని, యుక్తవయస్సులో ఉన్న ఎంతో మంది కూడా వైరస్ బారిన పడి మరణించారని గుర్తుచేశారు. కాగా, కరోనా వైరస్ వల్ల మరణించిన వారి కోసం ఈ నెల 4న జాతీయ సంతాప దినాన్ని పాటించనున్నట్లు చైనా ప్రకటించింది.

'వుహాన్' పేరుతో చైనా ఉపగ్రహం

బీజింగ్: చైనా చేపట్టిన అంతరిక్ష ఆధారిత 'ఇంటర్నెట్-ఆఫ్ థింగ్స్' ప్రాజెక్టులో భాగంగా తొలి రెండు సమాచార ఉపగ్రహాలను ఈ నెలలో ప్రయోగించనున్నది. ఇందులో ఒక ఉపగ్రహానికి కరోనా వైరస్ పుట్టినిల్లయిన 'వుహాన్' పేరును పెట్టినట్టు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఉపగ్రహాలను పంపే రాకెట్ కువైషోవ్-1ఏను వుహాన్‌కు చెందిన సంజియాంగ్ సంస్థ అభివృద్ధి చేసింది. మహమ్మారికి వుహాన్ కేంద్ర బిందువుగా ఉన్నా.. సంస్థ సిబ్బంది మిషన్ విజయవంతానికి తీవ్రంగా కృషిచేశారని అభినందించారు.

మన యాది - 1768

తొలి ఉర్దూ కవయిత్రి మాహలఖాబాయి (చందా) జయంతి. రెండు 'గజల్' సంపుటాలను వెలువరించారు. నేటి ఓయూ, ఇప్పూ, ఎన్ఐఎన్ ఆమె జాగీరులోనే ఉన్నాయి.

వేదిక

కరోనాను ఎదుర్కొనడానికి మ్యాజిక్ బుల్లెట్, మ్యాజిక్ వ్యాక్సిన్ అంటూ ఏవీ లేవు. మన ప్రవర్తన ద్వారా మాత్రమే ఎదుర్కొనగలం.
– డాక్టర్ డెబోరా బిర్క్స్, అమెరికా అధ్యక్ష భవన కరోనా కట్టడి సమన్వయకర్త

నమస్తే తెలంగాణ

వైద్యుడిని కాపాడుకుందాం!

కరోనాపై పోరాటం మొదలైన ప్రారంభ దశలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యుల ప్రాధాన్యాన్ని గుర్తించారు. మన వైద్యులను కాపాడుకోవాలని, వారు లేకపోతే సమాజానికి భద్రత ఉండదని జనతా కర్ఫ్యూ కన్నా ముందే ప్రజలకు చెప్పారు. ముఖ్యమంత్రి ఇంతగా వివరించి చెప్పినా కూడా వైద్యులపై దాడులు జరగడం బాధాకరం. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఈ దాడి జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి దోషులపై చర్య తీసుకుంటామని ప్రకటించడం వల్ల వైద్యులకు భరోసా లభించింది. సాధారణ పరిస్థితులలోనైతే వైద్యులు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపేవారే. కానీ ప్రస్తుత విషమ పరిస్థితులను గుర్తించి సంయమనంతో వ్యవహరించడం వారి విజ్ఞతకు నిదర్శనం. 'దేశంలో నెలకొన్న ఆరోగ్య అత్యవసర పరిస్థితి దృష్ట్యా మేం తీవ్ర చర్యలకు పాల్పడటం లేదు. పరిస్థితి చేయి దాటక ముందే ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం' అంటూ వైద్య సంఘం పేర్కొన్నది. ప్రాణాలను కాపాడే వైద్యులను దేవుడితో సమానంగా భావించే సమాజం మనది. ఇప్పుడు వైద్యులు తమ ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు చికిత్స చేస్తున్నారనేది గుర్తించాలి.

కోవిడ్– 19 రోగులకు ఆస్పత్రులలో చికిత్స ఇవ్వడమే కాకుండా, సమాజంలో ఎవరెవరికి వ్యాపించిందో గుర్తించడానికి ఇంటింటికీ వెళ్ళి పరీక్షలు చేయవలసిన విపత్కర పరిస్థితి ఏర్పడ్డది. విదేశాల నుంచి వచ్చేవారి వల్లే కాకుండా, మన దేశంలోనే ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారి ద్వారా కూడా కరోనా వైరస్ ప్రబలుతున్నది. వ్యాధి సోకిన వారికి చికిత్స చేయడమే కాకుండా, వారి కుటుంబాలను నిరంతర పర్యవేక్షణలో పెట్టవలసి వస్తున్నది. ఈ నేపథ్యంలో మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌లో వైద్య సిబ్బందిపై జరిగిన దాడి అత్యంత దారుణమైంది. ఇండోర్‌లోని ఒక ప్రాంతంలో ఇద్దరికి కోవిడ్ –19 సోకింది. 54 కుటుంబాలను ఏకాంతంలో పెట్టవలసి వచ్చింది. ఈ ప్రాంతానికి వెళ్ళి ఒక వ్యక్తి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీస్తున్నప్పుడు స్థానికులు వైద్య బృందంపై రాళ్ళు రువ్వి గాయపరచడం, వెంటబడి తరమడం దిగ్భ్రాంతికరం. సమీపంలో ఉన్న పోలీసులు వారిని కాపాడకపోతే వారి పరిస్థితి ప్రమాదకరంగా ఉండేది. ప్రజల ప్రాణ రక్షణ కోసం సాగించే వైద్య పరీక్షలకు కూడా పోలీసుల భద్రత అవసరమా? ఇది ఆయా సామాజికవర్గాల కోణంలో ఆలోచించవలసిన విషయం కాదు. ఇటువంటి సమస్యలను అధికారయంత్రాంగం, రాజకీయ నాయకత్వం ముందుకు వచ్చి పరిష్కరించవలసి ఉంటుంది.

బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశంలోనే వైద్యులు తగిన రక్షణ దుస్తులు లేక ఇబ్బంది పడుతున్నారు. అయినా ఈ కారణం చూపి విధులు మానుకోవడం లేదు. మన దేశంలోనూ అదే పరిస్థితి. యుద్ధ ప్రాతిపదికన వైద్యులకు భద్రతకు అవసరమయ్యే వస్తువులను తయారు చేయడానికి ప్రభుత్వపరమైన ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రస్తుతానికి తగినన్ని వ్యక్తిగత రక్షణ దుస్తులు లేకున్నా వైద్యులు చికిత్స సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇల్లు ఖాళీ చేయాలంటూ వైద్యులపై ఇరుగుపొరుగు వారు ఒత్తిడి తెస్తున్నారు. ఇటువంటి వృత్తిపర ఇబ్బందులు, సామాజిక ఒత్తిడుల మధ్య వైద్యులు విధిని నిర్వర్తించవలసి వస్తున్నది. వారి సేవలకు ప్రజలు తగిన గుర్తింపు ఇవ్వాలే కానీ ఇబ్బందులు పెట్టడం తగదు. ప్రభుత్వం భద్రత కల్పించవలసిన పరిస్థితి తలెత్తనే కూడదు. వైద్యులను గౌరవించడం, కాపాడుకోవడం సమాజ బాధ్యత.

ప్రేమ కన్నా బాధ్యత గొప్పది

సామాజికం

దాయి శ్రీశైలం

ప్రపంచం దృష్టిలో తెలంగాణ ఒక చైతన్య నేల. పోరాట చరిత్ర ఉన్న రాష్ట్రం. మనకు సోయి ఎక్కువ అనుకుంటారు అందరూ. నిజమే దీనినెవరూ కాదనలేరు. రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయడమే కాదు.. ఇంట్లో నుంచి కదలకుండా యుద్ధం చేస్తామని నిరూపించుకోవాల్సిన సమయమిది. ఇప్పుడు మన చౌరస్తాల్లో కరోనా వచ్చి కాచుకొని కూర్చున్నది. ఎంత బాధ్యతగా దానికి దూరంగా ఉంటే అంత మంచిది.

బాధ్యత గురించి ఎందుకు చెప్పుకోవాల్సి వస్తుందో అర్థం చేసుకోవాలి. సృష్టిలో ప్రతి జీవికీ బాధ్యత ఉన్నట్లే.. ప్రతి పౌరుడికీ తనదైన బాధ్యత ఉంటుంది. బాధ్యత అనేది కనీస మనిషి లక్షణం.

ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి కాబట్టి ఒక్క కాగితం ముక్క కూడా లేకుండా ఊడ్చేసి ఆ చెత్తను పక్కింటి గోడ ఆవతల పడేస్తే అది బాధ్యత అవుతుందా? సమాజానికి ఇది ఏం నష్టం చేయదా? సమాజం బాధ్యతేమోగానీ ఇంటి బాధ్యత కూడా మర్చిపోతున్నారు జనాలు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలో జరిగిన ఓ దారుణమే దీనికి నిదర్శనం. కరోనా సోకి ఉండొచ్చనే అనుమానంతో ఓ సెక్యూరిటీ గార్డ్‌ను కట్టుకున్న భార్య.. కన్న కొడుకు ఇంటి నుంచి వెలేశారు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో అతడు బిక్కుబిక్కుమంటూ పోలీసులను ఆశ్రయించాడు. వాస్తవానికి అతనికి ఏ కరోనా వైరసూ సోకలేదు. సరే.. వాళ్లనుకున్నట్లే సోకిందే అనుకుందాం. అయినంత మాత్రాన ఇంట్లో నుంచి తరిమేస్తారా? కట్టుకున్నందుకు భార్య, కన్నందుకు కొడుకు ఇచ్చే సత్కారమిదేనా?

నిజంగా వారికి బాధ్యతనేదే ఉంటే ఇలా చేసేవాళ్లా? పోలీసులకో.. ఇతర అధికారులకో సమాచారం అందించేవాళ్లు. అనారోగ్యానికి గురైన తమకుటుంబ సభ్యుడి ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రయత్నించేవాళ్లు. కానీ అలా జరగలేదు. వాళ్ల అనుమానమే నిజమై అతడికి వైరస్ సోకి ఉంటే ఆయన పరిస్థితి ఏంటి? బయటవాళ్ల పరిస్థితి ఏంటి? కరోనా విషయంలో ఇలా బాధ్యతారహితంగా ఉండటం వల్లే పరిస్థితి ఆందోళనకరంగా మారిపోతున్నది.

వైరస్ రోజురోజుకూ తీవ్రమవుతుంది. లాక్‌డౌన్‌ను పాటించి ఎవరూ ఇండ్లలోంచి బయటకు రావద్దని ప్రభుత్వం ఎంతగా చెబుతున్నా కొందరు పెడచెవిన పెడుతున్నారు. అది ఎవరికి నష్టం? వాళ్లొక్కరికే నష్టమైతే ఎవరి ఖర్మ వారు అనుభవిస్తారు అనుకుంటాం. కానీ దానివల్ల అందరికీ నష్టమే. విచిత్రంగా ఒకతను మొన్నొకనాడు.. ఆశీర్వాద్ ఆటా కోసం శ్రీనగర్ కాలనీ నుంచి చింతల్‌బస్తీ వచ్చాడు! ఇదెంత బాధ్యతారాహిత్యం? 'అయ్యా.. నువ్వు ఇంట్లో నుంచి బయటకు రాకు. కడుపు నింపుకోవడానికి ఆశీర్వాద్ ఆటా అయితే ఏముంది? ఇంకోటి అయితే ఏముంది?' అని ఇంకొకరు మొట్టికాయలేసి చెప్పాలా?

ఇంకా మన వాళ్లు లాక్ డౌన్ నిబంధనలను ఉల్లంఘించి రోడ్డుమీదికి వచ్చి.., అలా రావటానికి చెబుతున్న కారణాలు బేతాళ కథలను మరిపిస్తున్నాయి. పొద్దుగాల కూరగాయలు అన్నీ కొన్నాను కానీ, కొత్తి మీర కొన లేదు కాబట్టి కొత్తి మీర కోసం పోతున్నా అని ఓ పిట్ట కథ ఒకటి చెప్పుకొచ్చాడు. ఇది.. 'తాటి చెట్టు ఎందుకు ఎక్కినవ్ అంటే దూడ గడ్డికో సమన్నట్లు' లేదూ...!

ఇదే కాదు.. 'హెల్మెట్ పెట్టుకో' అని వేరే వాళ్లే చెప్పాలి. 'తాగి వాహనం నడపకు' అని వేరేవాళ్లే చెప్పాలి. ఆఖరికి మన చేతులు కడుక్కోమని కూడా వేరేవాళ్లే చెప్పాలి. హెల్మెట్ పెట్టుకోకపోతే తలకాయ పగిలేది మనదా? పోలీస్‌దా? తాగి బండి నడిపితే నష్టం జరిగేది మన కుటుంబానికా? పోలీసాఫీసర్ కుటుంబానికా? విచక్షణ కోల్పోయి, బాధ్యత మరిచి

అంతా షట్‌డౌన్‌లోనే ఉన్నాయని తెలిసినా బయటకు వస్తున్నారు. గుంపులుగా పోగవుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి వచ్చినవాళ్లు స్వచ్ఛందంగా అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పినా పట్టించుకోవడం లేదు. పరీక్షలు చేయించుకోమన్నా వినిపించుకోవడం లేదు. డాక్టర్లపై దాడి చేయడం.. పోలీసులపై ఉమ్మివేయడం.. కావాలని దగ్గడం.. తుమ్మడం.. ఇదేనా కరోనాను తరిమికొట్టే తరీఖా?

ఆషామాషీ వైరస్ కాదని తెలిసి కూడా ఇలా వ్యవహరించడం బాధ్యత అనిపించుకోదు. ఇక్కడ మతాలు, కులాలు కాదు. ప్రాణాలు ముఖ్యం. మన ఒక్కరి ప్రాణాలే కాదు, సమాజం మొత్తం ప్రాణాలు ముఖ్యం. మనం పోరాడుతున్నది మతంతో కులంతో కాదు, వైరస్ తో. హిందు, ముస్లిం, క్రిష్టియన్ ఎవరైనా వైరస్‌కు ఒక్కటే. మనల్ని నిర్వీర్యం చేయడం. మన ద్వారా వేలాది మందికి వ్యాపించడమే దాని పని.

ఎవర్నో కలవాలనే ఆశ.. ఇంకెవర్నో చూడాలనే ప్రేమ. ఇష్టమైనది తినాలనే కోరిక. ఏదో సందేశమివ్వాలనే ఆలోచన చాలా ఉండొచ్చు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో దేవుడిపై వస్తువు మొదటికి వచ్చింది. దానికి తోడు వారు వైద్యులకు,పోలీసులకు సహకరించకపోవడం మరింత ఆందోళన కలిగించే విషయం. బాధ్యతగా ఉండాల్సిన సమయంలో ఇలా బాధ్యతారహితంగా వ్యవహరిస్తే మనం కరోనాతో జరుగుతున్న యుద్ధంలో ఎలా గెలుస్తామో ఆలోచించుకోవాలి. ఆత్మ విమర్శ చేసుకోవాలి.

కరోనా గండం నుంచి బయటపడటానికి మనకు ఉన్న పెద్ద సానుకూలత ఏందంటే.. మనం సమస్యను ముందుగానే పసిగట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పౌర సహకారం ఉంటే కచ్చితంగా కరోనాను తరిమేయొచ్చు. కరోనానే కాదు, ఇంకేదైనా దరిచేరొద్దు అంటే ఇల్లు, ఇల్లుతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. వీటిని మనం ముందస్తుగానే చేసుకున్నాం. తెలంగాణలో ఎక్కడైనా చూడండీ.. మురుగు, మరుగు పెద్దగా కనిపించవు. ఎందుకంటే మనం 'పల్లె ప్రగతి', 'పట్టణ ప్రగతి' చేపట్టి పారిశుద్ధ్యాన్ని సాధించాం. ముందు చూపు అంటే ఇదే కదా? తెలంగాణ సమాజానికి సోయి ఎక్కువ అనడానికి ఈ ప్రగతి కార్యక్రమాలే ఒక ఉదాహరణ. అంతేకాదు మనకు ఇగురం కూడా ఎక్కువే. ఎందుకంటున్నారా? కరోనా లాక్‌డౌన్ వల్ల ఇప్పుడు రోడ్లన్నీ ఖాళీగా ఉంటున్నాయి కదా? ఇదే సరైన సమయం అనుకొని రోడ్లు కూడా మరమ్మతు చేసుకుంటున్న ఇగురం గల్ల సమాజం మనది.

మనకు ఇన్ని అనుకూలతలున్నాయి కాబట్టి బాధ్యత అనే మరో అనుకూలతను జోడిస్తే కరోనాను కంట్రోల్ చేయొచ్చు. వైరస్ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రెండు వారాలు సీరియస్‌గా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ గుంపులుగా పోగవ్వద్దు.అత్యవసరం కాకపోతే బయటికే రావద్దు. ప్రార్థనలు, పూజల పేరిట ప్రజలను పోగేసి వైరస్ పాలుచేయొద్దు.మసీదులు.. ఆలయాలు.. చర్చిల దగ్గర వినిపించే భక్తి సందేశాలకు బదులు 'కరోనా సందేశాలు' వినిపిస్తే ఎంతో మేలు. మరచిన బాధ్యతను గుర్తు చేసి సామాజిక దూరానికి దగ్గర చేయాలి. ఇదే కరోనాను కట్టడి చేసే తారక మంత్రం. ■

> కరోనా గండం నుంచి బయటపడటానికి మనకు ఉన్న పెద్ద సానుకూలత ఏందంటే.. మనం సమస్యను ముందుగానే పసిగట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పౌర సహకారం ఉంటే కచ్చితంగా కరోనాను తరిమేయొచ్చు. కరోనానే కాదు, ఇంకేదైనా దరిచేరొద్దు అంటే ఇల్లు, ఇల్లుతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. వీటిని మనం ముందస్తుగానే చేసుకున్నాం.

ధైర్యమే పరమౌషధం

> All war is a symptom of mans failure as a thinking animal. అంటే.. 'యుద్ధం ఏదైనా కావచ్చు, అది బుద్ధిజీవిగా మనిషి వైఫల్యానికి నిదర్శనం..' అని జాన్ స్టీన్ బెక్ అనే సుప్రసిద్ధ అమెరికన్ రచయిత అన్నాడు. చర్చలతో సమస్యను పరిష్కరించుకోగలిగే సామర్థ్యం వున్న బుద్ధిజీవి అయిన మనిషి యుద్ధం దాకా తెచ్చుకోవడం అంటే.. తన బుద్ధిని ఉపయోగించడంలో విఫలం చెందినట్లే కదా.. అనేది ఆయన మాటల సారం.

దేశాలు, మనుషుల నడుమ యుద్ధం గురించే ఆయన ఆ మాటలు అనవచ్చు. కానీ, కనిపించని శత్రువు 'కరోనా'కు బెంబేలెత్తి చీకటి యుద్ధం చేస్తున్న మానవజాతి వైఫల్యానికి.. ఆ మాటను అన్వయిస్తే సరిగ్గా సరిపోతుంది.

అన్నిజంతువుల్లాగా కాకుండా మనిషిగా మనం ప్రకృతిని అనుసరించి బతకడంలో వైఫల్యం చెందిన ఫలితమే.. కరోనా, దాని పర్యవసానాలు. భూమ్మీది ఏ జీవరాశికీ లేని విజ్ఞత అనే ప్రత్యేకత మనిషికి వుండటం వరమే. అయితే ప్రకృతిని నాశనం చేయడంలో మనిషి తన విజ్ఞత కోల్పోతుండటం శాపంగా మారింది. అన్ని జీవరాసులు తమ బతుకుకోసం ఒకే పోరాటం చేస్తే, మనిషికి తెలివి ఉంది కాబట్టి, భౌతిక, నైతిక, సామాజిక.. అనే మూడు రకాల యుద్ధాలు చేయాల్సివుంటది. మొదటిది– తాను సంపూర్ణ ఆయుష్షును కాపాడుకునేందుకు తన శరీరంతో యుద్ధం. రెండోది– సంఘజీవిగా తనను తాను కంట్రోల్‌లో పెట్టుకునేందుకు తన మనసు మీద తాను నిత్యం చేయాల్సిన యుద్ధం. మూడోది– సమాజంలో ఒకరిగా ఉంటూనే అనివార్యంగా చేయాల్సిన బతుకు యుద్ధం. కానీ మనిషి మూడింటిలో ఓడిపోయి చేతులెత్తేస్తున్నపరిస్థితి దాపురించింది. అది 'కరోనా' సందర్భం లో మరోసారి బయటపడ్డది.

అభద్రతాభావ పరిస్థితుల్లో నిత్య భయంతో జీవిస్తున్న మానవునికి కరోనా ఓ యుద్ధభయాన్ని సృష్టిస్తున్నది. రోగం కంటే భయాన్నే ఎక్కువగా కరోనా సృష్టిస్తున్నదని సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలను మనం ఈ కోణంలోంచే అర్థం చేసుకోవాలె.

'యుద్ధాన్నిగెలవాలంటే ముందు యుద్ధ భయాన్ని సృష్టించాలె' అనేది యుద్ధనీతి. ఆ నీతిని కరోనా వైరస్ విషయంలో కనిపిస్తు న్నది.కానీ కరోనా యుద్ధనీతిని తెలంగాణ సీఎం కేసీఆర్ తిప్పికొడుతున్నరు. కరోనా వైరస్‌ను ఓడించి,దానిపై మనిషి గెలవాలంటే.. అది మోసుకొచ్చే రోగం కన్నా ముందు అది సృష్టిస్తున్న భయాన్ని ముందు గెలవాలె అనే తాత్విక విధానాన్ని కేసీఆర్ ముందుకు తీసుకుపోతున్నరు. ముందు యుద్ధ భయాన్ని గెలిస్తే సగం విజ యం వరించినట్టేనని నిరూపిస్తున్నరు. అదే సమయంలో ధైర్యం నింపడం ద్వారా సగం రోగం నయం చేయవచ్చని కూడా నిరూపిస్తున్నరు.

'తెలంగాణకు కరోనా వస్తే ఎట్ల మరి..' అని ఓ పెద్దమనిషిని ఓ రిపోర్టర్ అడుగుతే..'**కేసీఆర్ వుండుగా.. అన్నాయినె సూసుకుంటడు.. ఒక వేల వచ్చినా ఎన్నికోట్లు ఖర్చు పెట్టయినా దాన్ని అడ్డుకుంటడు..**' అనే వీడియో ఒకటి కరోనా ఇంకా రాష్ట్రానికి రాక ముందు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ పెద్ద మనిషి విశ్వసించినట్టే.. నేడు తెలంగాణ ధైర్యానికి, భరోసాకు పర్యాయ పదంగా కేసీఆర్ మారారు. ఆ పెద్ద మనిషి వ్యక్తపరిచిన భరోసానే నేడు యావత్ తెలంగాణ సమాజం కనబరుస్తున్నది.

తెలంగాణం

-రమేశ్ హజారి

విపత్కర పరిస్థితుల్లో.. తన ప్రజలను కాపాడటానికి ఓ నాయకుడిగా తాను చేసే ప్రయత్నాలన్నీ ఒక దిక్కున చేసుకుంటూనే, తనను నమ్ముకున్నవారు ఒక్కరుకూడా నష్టపోవద్దని తపన పడే మహానాయకుడు దృశ్యమానమైన సందర్భమిది.

నాడు గోవర్ధనగిరినెత్తి రేపల్లె వాసుల్లో శ్రీకృష్ణుడు నింపిన భరోసా కావచ్చు, నేడు కరోనాను పారదోలడానికి ప్రజల్లో సీఎం కేసీఆర్ నింపిన భరోసా కావచ్చు.. ఈ రెండిట్లో కనిపిం చే సారూప్యం వున్నది. అది.. నాయకుడు పనిచేయడమే కాదు, ఆ పనిని తన ప్రజలకు పూసగుచ్చినట్టు విడమర్చి చెప్పడం.., తద్వారా ప్రజ ల్లో భరోసా పెంచి సమాయత్త పరిచి వారిని కరోనాతో యుద్ధంలో స్వచ్ఛందంగా పాల్గొనేలా చేయడం అత్యవసరం. కష్టకాలాన్ని దాటిందాకా ఓర్పు వహిస్తూ, పోరాట స్ఫూర్తిని ప్రదర్శించి విజయాన్ని సాధించే దిశగా ప్రజారాసులను నడిపించడమే.. అసలు సిసలు నాయకత్వ లక్షణం. కరోనాను పారదోలేందుకు కేసీఆర్ అదే లక్ష్యంతో ముందుకు పోతున్నరు.

ఆపత్కాలంలో గత్తరబిత్తరై భయపడితే..మన శరీరంలోని రోగ నిరోధక శక్తి నశించి కరోనా వంటి వైరస్‌కు లొంగిపోయే ప్రమాదమున్నదట. భయం స్థానంలో ఒక ఉత్సాహం భరోసా నింపడం ద్వారా మన శరీరంలోని రోగ నిరోధక శక్తి పెంచుతుందట. అది మందులాగా మారి, కరోనా వంటి ప్రాణాంతక వైరస్ లను తరిమికొడుతుందనే విషయం ఇప్పటికే శాస్త్రీయ అధ్యయనాలు నిరూపించిన సత్యం. కరోనాకు మందు లేదు కానీ.. ధైర్యానికి మందు మన ముఖ్యమంత్రి కేసీఆర్ కాదున్నది.

తెలంగాణకు మందులిచ్చే డాక్టర్లే కాదు ధైర్యాన్నిచ్చే డాక్టర్ సీఎం కెసీఆర్ వున్నడు. అయితే మన డాక్టర్లు చెప్పినట్టు విందాం. కరోనాను తరిమి కొడుదాం. ■

ఈ సమయం

ఈ సమయంగాని సమయంలో
ఇక్కడెవరుంటారు?
బస్.. సాహిర్ లూధియాన్వీ..,
నేనూ ---
ఏకాంతంలో మిగిలిపోయాం!
అద్దంమీది పొగలమధ్యన
తొంగిచూస్తోన్న జీవితం!

దీపంచుట్టూ రెక్కలాడిస్తున్న
మహమ్మారి 'కరోనా' నృత్యం!

దూరందాకా
భయం విస్తరించిన నిశ్శబ్దం!

బయట గస్తీ తిరుగుతోన్న
మనుషుల్లాంటి వైద్యులు!

ఈ 'లాక్ డౌన్ ' సమయంలో
బస్.. ఇంట్లో నేనూ..,
'మాస్క్'లు తయారుచేయడం
నేర్పుతున్న..,
సాహిర్ లూధియాన్వీ
మాత్రమే వున్నాం!
... బస్ ! అంతే !!

ఆశారాజు
9392302245

లోకాన్ని బతికిద్దాం..

ఇప్పుడొక ఏకాంత యుద్ధం చేయాలి
నిన్ను నువ్వే ఆయుధం చేసుకొని
నీ యుద్ధం నువ్వే గెలవాలి..!

సామాజిక మానసిక దూరం లేని
సమీప దూరాల సందర్భాలను
సంతోషంగా స్వీకరించాలి

నువ్వూ నేను గీసుకున్న మత దూరాలు
కుళ్ళుకంపు కుల కళేబరాలను మోసుకుంటూనే కదా
ఈ దారిగుండా పయనమై వచ్చింది..!

ఇన్నాళ్ళు అబద్ధ సమూహాల సంఘర్షణల్లోనే కదా
హృదయాలను దాచేసుకొని ఒకరికొకరం ఎదురు పడింది..!

ఈ మాత్రం ఎడం పాటిస్తే తప్ప బోధపడలేదు
మనలను ఒకే దారానికి అల్లేది మృత్యువు మాత్రమేనని..!

నీ దైవాలు నా దైవాలు పారిపోగా మిగిలిన
మన దైన్యపు మొఖాలకు ఫ్రేము కట్టి
గోడకు తగిలించుకుందాం..

కంటికి కనిపించని వైరస్
కబళిస్తె తప్ప తెలియలేదు
కాలం రేఖల మీద
నువ్వూ నేను మాత్రమే సత్యమని..!

మనం బతుకుదాం భయాలు లేని
ఒంటరి నిర్బంధాల్లోంచైనా సరే
ఈ లోకాన్నీ బతికిద్దాం..
పరస్పర అనుమానాల్లేని
ఎడంగానైనా సరే..!

చెమన్
9440385563

త్రిశక్తి స్వరూపిణి!

నమస్తే.. నమస్తే.. నమః

వేముగంటి శుక్తిమతి

'నారాయణం నమస్కృత్యం నరంచైవ నరోత్తమం/ దేవి సరస్వతీ వ్యాసం తతో జయ ముదీరయేత్/ సచ్చిదానంద రూపాం తాం గాయత్రీ ప్రతిపాదితాం/ నమామి హ్రీమ్మయీం దేవీంధియోనః ప్రచోదయాత్'– శ్రీమద్దేవీ భాగవతం పరమపావన గ్రంథం. మహాపురాణం. వ్యాసుడి కంఠం నుండి, ఘంటం నుండీ జాలువారిన దేవీభక్తి రసామృతం. అష్టాదశ పురాణాల్లో దేవీభాగవతం ఉత్తమోత్తమం. భక్తి ముక్తిప్రదం. దీనిని స్వయంగా వ్యాసుడే జనమేజయునికి వినిపించాడు.

ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలను సులభంగా ప్రసాదించేదే దేవీభాగవతం. 'దేవీ' అంటే 'క్రీడించేది', 'ప్రకాశించేది' అని రెండర్థాలు. ఈ చరాచర జగత్తంతా ఆ దేవికి ఒక క్రీడావిలాసం. జగత్తును సృష్టించే వేళ ఆమె సృజన స్వరూప. రక్షణ వేళ పాలన స్వరూప. సంహార వేళ రౌద్ర స్వరూప. ఆ జగన్మాత గాథను భక్తితో ఒక రోజు విన్నా, ఒక పూట విన్నా, ఒక ముహూర్తం సేపు విన్నా.. అలాంటి వారికి ఏ దుర్గతీ దరిదాపుల్లోకైనా రాదు. కలియుగంలో పురాణశ్రవణ మొక్కటే ధర్మం, మోక్షం. చెవులు లేని పాములు శబ్దాల్ని గ్రహిస్తాయి. కానీ, మానవులలో కొందరు చెవులుండి కూడా పురాణాలను వినడం లేదు. సర్వయజ్ఞ, సర్వతీర్థ, సర్వదాన ఫలాలు కేవలం ఈ పురాణ శ్రవణంతోనే పొందుతాం.

'దేవీభాగవతం'లో 18,000 శ్లోకాలు, 12 స్కంధాలు, 318 అధ్యాయాలున్నాయి. ఇందులో సర్గ, ప్రతి సర్గ, వంశం, మన్వంతర, వంశానుచరిత్రలు ఉన్నాయి. పరదేవత నిత్య, నిర్గుణ శివస్వరూపిణీ, విశ్వాధార, యోగ గమ్య. ఆమెయే పరబ్రహ్మ స్వరూపిణి. ఆమె రూపాంతరాలే మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి. ఆ రూపాలను దాల్చే లక్షణాన్నే 'సర్గ' అంటారు. ఈ మూడు శక్తులవల్లనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఉద్భవించారు. వీరు సృష్టి, స్థితి, లయ కారులు. మూడు మూర్తుల వృత్తాంతాన్ని 'ప్రతి సర్గ' అంటారు.

సూర్య చంద్ర వంశరాజుల చరిత్రను తెల్పటమే 'వంశ'. స్వయంభువాది మనువుల వంశ, జీవిత కాలపరిమాణాలు వర్ణించే దే మన్వంతరం. ఆ మనువుల వంశ కథలను తెలిపేది వంశానుచరితం. ఈ అయిదూ.. పురాణాలకు ఉండవలసిన లక్షణాలు.

కలియుగంలోని ప్రజలు ధర్మాచార విహీనులవుతారని, అల్పాయుష్కులని వ్యాసభగవానుడు గ్రహించాడు. అందుకే, లోకుల హితం కోరి ఈ పురాణ సుధారసాన్ని అందించాడు. నిత్యమూ దీనిని కనీసం ఒక శ్లోకమైనా భక్తితో పఠించగలిగితే అమ్మవారి అనుగ్రహానికి పాత్రులవుతారు. మహమ్మారి విజృంభణలు, ప్రాణభయాలు తొలగిపోతాయి. దేవీ భాగవతం పేరు చెబితే భూతప్రేత పీడలు, అంటువ్యాధులు దిగ్దిగంతాలకు పారిపోతాయి. ప్రపంచ చరిత్రలో ఎన్నడూ ఎరుగని వేరొక బాటలోకి అడుగుపెట్టవలసిన చోట మనం నివసిస్తున్నాం.

ఇప్పటి అంధకారదశ ఇంతకు పూర్వం మానవజాతి ఎన్నడూ పయనించలేదు. అదే విధంగా ఇప్పటి మనుషుల హృదయాలలో మొగ్గ తొడుగుతున్న సంఘీభావం, సహృదయం, కరిగిపోయిన పరస్పర కలహాలు, అంతరించిన ఈర్ష్యాద్వేషాలూ, సింహాసనం అధిష్ఠించబోయే తరుణం ఆసన్నమైంది. అందరం వ్యక్తిగా, కుటుంబంగా, సమాజంగా, దేశంగా కాక సర్వప్రపంచం మానవాళి క్షేమాన్ని ఆకాక్షిస్తున్నాం.

తమకు, తమ కుటుంబాలకు, తమ దేశాలకు కాకుండా సకలదేశాలలోని సమస్త మానవజాతి రూపంలో ఆవిష్కృతమై వున్న భగవంతునికి మాత్రమే చెందిన వారంతా మానవజాతికోసం, ప్రభాత సమయస్ఫూర్తి కోసం లేచి బద్ధకంకణులై పని చేయడం మొదలైంది. ఇంత ప్రముఖమైన, అనంతమైన, బహుముఖమైన పనిలో స్త్రీజాతి ఘనమైన పాత్ర వహిస్తున్నది.

'జననీ దుర్గా, హే కాళీ, దిగంబరీ, కపాల మాలాలంకారిణీ, ఖడ్గపాణీ, అసుర సంహారిణీ.. మేం నిష్కల్మషులం, నిర్మలులం. నీ శక్తి ప్రభావంతో మానవ కల్యాణం గావించు తల్లీ..' అని పరదేవతామూర్తి అయిన ప్రకృతి స్వరూపాన్ని ఆనందంతో, భక్తితో ఆరాధిద్దాం. స్వస్తి..

లాక్‌డౌన్-డే 12

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మక్కజొన్న కొనుగోళ్లు మొదలయ్యాయి. శనివారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. వనపర్తి జిల్లాలో మొబైల్ రైతుబజార్లు ఏర్పాటు చేశాం.
– మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు	పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు	1967	హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్	100 24/7	సైబరాబాద్ కమిషనరేట్	రాచకొండ కమిషనరేట్	కొవిడ్-19 కాల్‌సెంటర్
					9490617440	9490617234	040-23434343



శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేక ఘట్టం

కన్నులపండువగా రామయ్య పట్టాభిషేకం

భద్రాచలం, నమస్తేతెలంగాణ: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో రామయ్య పట్టాభిషేకాన్ని కన్నులపండువగా నిర్వహించారు. తొలుత స్వామివారి కల్యాణ మూర్తులను దేవాలయం నుంచి బేడా మండపం వద్దకు తీసుకొచ్చి వేంచేయింపచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ వేడుకకు హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఆరాధన, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. స్వామివారి పాదుకలు, రాజముద్రిక, స్వర్ణకిరీటం, స్వర్ణచక్రాలను శ్రీరాముడికి సమర్పించారు. ముత్యాలహారం తొడిగారు. రామదాసు చేయించిన బంగారు ఆభరణాలతోపాటు చినజీయర్‌స్వామి అందజేసిన రాజకిరీటం కూడా స్వామివారికి అలంకరించారు. రాజఖడ్గం, ఛత్రాలను ధరింపజేశారు. ఈ వేడుకలో ఆలయ ఈవో జీ నరసింహులు, భద్రాచలం తాసిల్దార్ శేషగిరిరావు, దేవస్థానం ప్రధాన అర్చకులు విజయరాఘవన్, సీతారామానుజాచార్యులు, స్థానాచార్యులు స్థలసాయి, వేద పండితుడు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

- **ఊరంతా బాగుండాలని..**

ప్రతి గ్రామంలో సర్పంచ్‌లే కథానాయకులు కావాలన్న సీఎం కేసీఆర్ పిలుపుమేరకు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం గోపతండా సర్పంచ్ అజ్మీరా లక్ష్మి నడుం బిగించారు. శుక్రవారం పంపును భుజానికేసుకొని తండాలో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్వయంగా పిచికాలీ చేశారు. నిత్యం బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. సర్పంచ్ చొరవను తండావాసులు అభినందిస్తున్నారు. – నర్సింహులపేట

కరోనాపై సాంకేతిక సమరం

వనపర్తి జిల్లా కేంద్రంలో సంచార కూరగాయల వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

నేటినుంచి ధాన్యం కొనుగోళ్లు

వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రణాళికాయుతంగా యాసంగి పంటల కొనుగోళ్లు జరుపుతున్నామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వనపర్తిలో మొబైల్ కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా 285 వాహనాలతో 520 ప్రాంతాల్లో మొబైల్ రైతుబజార్లు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించామని, శనివారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఇంట్లో ఉండటమే మేలు

- ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారి నియంత్రణకు ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండి సహకరించాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాల్లో కరోనా నివారణ చర్యలను పూర్తిస్థాయిలో చేపడుతున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రెమారాజేశ్వరి పాల్గొన్నారు.

వరికోత యంత్రాన్ని నడుపుతున్న మంత్రి పువ్వాడ

అందుబాటులో వరికోత యంత్రాలు

రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

పెనుబల్లి/కల్లూరు: వరి కోతలు చేపట్టేందుకు వరికోత యంత్రాలు అందుబాటులో ఉన్నాయని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రైతులకు భరోసానిచ్చారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కల్లూరు, పెనుబల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతుల నుంచి ప్రతి గింజను నేరుగా కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి పంపుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కుప్పెనకుంట్లలో హార్వెస్టర్ నడిపి వరి కోత పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు నగదు అందజేస్తున్న బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

కరోనాపై పోరులో ఎమ్మెల్యే ఆదర్శం

- పోలీసులకు రూ.లక్ష విరాళం
- వలస కూలీలు, పేదలకు నిత్యాన్నదానం

బోధన్, నమస్తే తెలంగాణ: కరోనాపై పోరులో బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్ ఆదర్శంగా నిలుస్తున్నారు. పోలీసుల సంక్షేమానికి సొంత డబ్బు రూ.లక్ష విరాళం ప్రకటించి.. ఆ మొత్తాన్ని శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో బోధన్ టౌన్ సీఐ రాకేశ్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ తయారుచేయించిన మాస్కులు, శానిటైజర్లను పోలీసులకు ఎమ్మెల్యే పంపిణీచేశారు. బోధన్ పట్టణంలోని పేదలు, వలస కార్మికులు, అనాథలకు లాక్‌డౌన్ ఉన్నంతకాలం సొంత డబ్బుతో నిత్యాన్నదానాన్ని కొనసాగిస్తానని షకీల్ తెలిపారు.

వైరస్ నియంత్రణకు డ్రోన్ల వినియోగం

- కరీంనగర్‌లో విజయవంతం
- పైలట్‌గా వరంగల్, కామారెడ్డిలో..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ నివారణకు తెలంగాణలోనూ డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. మారుట్ డ్రోన్‌టెక్ సంస్థతో కలిసి అధికారులు పనిచేస్తున్నారు. వీటిద్వారా క్రిమిసంహారక మందులను స్ప్రే చేయడం, ప్రజలు గుమికూడటాన్ని పర్యవేక్షించడం, మందులు సరఫరా వంటివి చేపడుతున్నారు. వైరస్ వేగంగా విస్తరిస్తుండటంతో.. సంప్రదాయ పద్ధతుల కంటే డ్రోన్ల ద్వారా 50 రెట్లు అధిక విస్తీర్ణంలో క్రిమిసంహారక మందులు చల్లేందుకు వీలుంటుంది. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వీటి సహాయంతో క్రిమిసంహారక మందులను స్ప్రే చేశారు. మారుట్ డ్రోన్స్ ఇప్పటికే జీహెచ్‌ఎంసీతో కలిసి దోమల లార్వాలను నిర్మూలించేందుకు నగరంలోని చెరువులు, సరస్సుల్లో క్రిమిసంహారక మందులు చల్లే కార్యక్రమాన్ని చేపట్టింది.

శుక్రవారం కామారెడ్డిలో పిచికాలీ చేసేందుకు ఎగురుతున్న డ్రోన్.. చిత్రంలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తదితరులు

రద్దీపై పర్యవేక్షణ.. ప్రజారోగ్యంపై హెచ్చరికలు

లాక్‌డౌన్ ప్రకటించినప్పటికీ ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వస్తుండటంతో మారుట్ సంస్థ అభివృద్ధి చేసిన కెమెరా, స్పీకర్లు అమర్చిన డ్రోన్ల సాయంతో అలాంటి రద్దీని పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుంది. కరోనా ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికలు చేసేందుకు వీలుకలుగుతుంది. పెట్రోలింగ్ కంటే ఎంతో వేగంగా, సమర్థవంతంగా సమాచారాన్ని వ్యాప్తిచేయవచ్చు. స్పెయిన్, ఫ్రాన్స్‌వంటి దేశాల్లో ఈ విధమైన డ్రోన్లను వినియోగిస్తున్నారు.

ఉష్ణోగ్రత పరీక్ష.. థర్మల్ ఇమేజింగ్

కరోనా వ్యాప్తి నేపథ్యంలో అతిథులు, సందర్శకులు ఎవరైనా అపార్ట్‌మెంట్లోకి వచ్చేముందు శరీర ఉష్ణోగ్రత పరీక్ష చేస్తున్నారు. డ్రోన్లలో అమర్చిన ఇన్‌ఫ్రారెడ్ థర్మోమీటర్ ద్వారా కచ్చితమైన పరీక్షలు చేయవచ్చు. వైరస్ సోకిన వ్యక్తులను ప్రారంభ దశలోనే కనుగొనవచ్చు.

డ్రోన్‌తో మందుల సరఫరా..

అవసరమైనవారికి సమయానికి రక్తం, మందులను చేరవేయడం దేశంలో సవాల్‌గా మారింది. కరోనా నేపథ్యంలో ఈ పరిస్థితి తీవ్రంగా మారింది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రవాణా, డెలివరీ సిస్టమ్ ఆవిష్కరించాల్సిన అవసరం ఉన్నది. దీనిని అధిగమించేందుకు డ్రోన్లు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాయి. డ్రోన్ల ద్వారా ఎనిమిది నిమిషాల్లో 12 కిలోమీటర్ల దూరాన్ని చేరుకోవచ్చు. వైరస్ వ్యాప్తినీ అరికట్టవచ్చు. 68 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉన్నది. కానీ బ్లడ్ బ్యాంకులు, పరీక్ష సదుపాయాలన్నీ పట్టణాల్లోనే ఉన్నాయి. గ్రామాల నుంచి సరైన రవాణా సదుపాయం లేకపోవడంతో ఇన్‌ఫెక్షన్ కారణంగా రక్తం 10 నుంచి 11 శాతం వ్యర్థమవుతుంది. కరోనా వ్యాప్తి పరిస్థితుల్లో కూడా దానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ఇవి ఎంతో కీలకమవుతాయి.

డ్రోన్ ప్రత్యేకతలు..

- ఒక డ్రోన్ 25 కిలోల బరువు ఉంటుంది. రసాయనాలు స్ప్రే చేసే డ్రోన్‌లో 10 కిలోల ట్యాంక్ ఉంటుంది. దీన్ని నియంత్రించటానికి పైలట్, కోపైలట్ ఉంటారు.
- 10 కిలోల బరువున్న మందులు, ఇతర అత్యవసర సామగ్రిని చేరవేయగలుగుతాయి.
- శరీర ఉష్ణోగ్రతలను కనిపెట్టే డ్రోన్‌లో థర్మల్ స్కానర్లు ఉంటాయి. ఇవి కి.మీ. దూరంలో ఉన్న సమూహాల్లోని ప్రజల శరీర ఉష్ణోగ్రతలను చెప్తాయి.

అన్ని జిల్లాల నుంచి విజ్ఞప్తులు

కరీంనగర్‌లో ఈ డ్రోన్లను ఇప్పటికే విజయవంతంగా ఉపయోగించాం. వరంగల్, కామారెడ్డి జిల్లాల్లోనూ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాం. తమ జిల్లాల్లోనూ చేపట్టాలని పలువురు కలెక్టర్లు కోరుతున్నారు. సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా చేయనున్నాం. కార్పొరేట్ సంస్థల నుంచి సహకారం లభిస్తే ఇంకా డ్రోన్ల సంఖ్య, మ్యాన్ పవర్ పెంచేందుకు వీలుంటుంది. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.
– ప్రేమ్‌కుమార్, మారుట్ డ్రోన్‌టెక్ వ్యవస్థాపకుడు

శుద్ధిచేసే చాంబర్

- రూపొందించిన ఓ మెకానిక్
- అభినందించిన మంత్రి గంగుల

కరోనా ప్రివెన్షన్ చాంబర్.. పనితీరును పరిశీలిస్తున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, నమస్తేతెలంగాణ: కరోనా వైరస్ నివారణకు ఓ మెకానిక్ శానిటైజర్ చాంబర్‌కు రూపకల్పన చేశాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన అల్లాడి ప్రభాకర్ కరోనా ప్రివెన్షన్ చాంబర్ తయారుచేశారు. 8 ఫీట్ల పొడవుండే ఈ క్యాబిన్‌లోకి మనిషి వెళ్లగానే స్కానర్లు పనిచేయడం మొదలుపెట్టి పైనుంచి కిందివరకు శుద్ధి చేస్తాయి. చాంబర్‌లోని రెండోభాగంలోని హీటర్లు డ్రై చేస్తాయి. దీంతో ఈ యంత్రంలోకి వెళ్లిన వారు పూర్తిగా శానిటైజ్ అయి బయటకు రావచ్చు. రూ.25 వేలతో ఈ చాంబర్‌ను సిద్ధం చేసినట్టు ప్రభాకర్ చెప్పారు. శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్ ఈ చాంబర్‌ను పరిశీలించి ప్రభాకర్‌ను అభినందించారు.

ఆర్థికం ఆగమాగం

మొదటిపేజీ తరువాయి...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 30 ఏండ్ల కనిష్ఠస్థాయికి పతనమయ్యే అవకాశాలున్నాయని ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఫిచ్' అభిప్రాయపడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 5.1 శాతంగా ఉండవచ్చని గతంలో అంచనా వేసిన 'ఫిచ్'.. ప్రస్తుతం దేశంలో లాక్‌డౌన్ విధించడం వల్ల నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తన అంచనాను 2 శాతానికి కుదిస్తున్నట్టు ప్రకటించింది. 'కరోనా వైరస్ వ్యాప్తితో ఇటీవల చైనాలో పలు పరిశ్రమలు మూతపడటంతో భారత్‌లోని వివిధ పరిశ్రమలకు ముడిసరుకులు, విడిభాగాల సరఫరాలు ఆగిపోయాయి. ప్రస్తుతం చైనాలోని వివిధ పరిశ్రమల్లో మళ్లీ పనులు ప్రారంభమైనప్పటికీ కరోనా వైరస్ వ్యాప్తి ఉద్ధృతమవడంతో ఆ ప్రభావం భారత్ ఎగుమతులను, కొనుగోలు శక్తిని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటుపై మా అంచనాను 5.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం. ఇది గత 30 ఏండ్లలోనే అతితక్కువ వృద్ధిరేటు' అని 'ఫిచ్' శుక్రవారం ఓ ప్రకటనలో వివరించింది. అయితే ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా మరోలా ఉన్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 4 శాతానికి పరిమితమవుతుందని, భారత ఆర్థిక పునాదులు బలంగా ఉన్నందున వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22)లో దేశ వృద్ధిరేటు పుంజుకొంటుందని ఏడీబీ పేర్కొన్నది. వ్యక్తిగత, కార్పొరేట్ పన్నులకు సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న సంస్కరణలు, వ్యవసాయరంగంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థపై వత్తిడిని తగ్గించేందుకు చేపడుతున్న చర్యలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత్ వేగవంతంగా పుంజుకొనేందుకు దోహదం చేస్తాయని ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త యసుయుకీ సవాడ అభిప్రాయపడ్డారు.

స్టాక్ మార్కెట్లలో ఆగని పతనం

కరోనా ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లను రోజురోజుకూ కుంగదీస్తున్నది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు 45 శాతం మేరకు పతనమైన సెన్సెక్స్.. మరో 670 పాయింట్లు క్షీణించి 28 వేల దిగువకు పడిపోయింది. అలాగే జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 170 పాయింట్లు (2.06 శాతం) క్షీణించి 8,083.80 వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠస్థాయికి దిగజారడం మార్కెట్ల పతనానికి ఆజ్యంపోశాయి. ఫలితంగా ఓ దశలో 27,500 పాయింట్ల కనిష్ఠస్థాయికి పడిపోయిన సెన్సెక్స్.. చివరకు 674.36 పాయింట్ల నష్టంతో 27,590.95 వద్ద ముగిసింది. దీంతో గత రెండ్రోజుల్లో రూ.4,82,034.63 కోట్ల సంపదను కోల్పోయారు.

మరింత బక్కచిక్కిన రూపాయి

రూపాయి మారకం విలువ రోజురోజుకూ దిగజారుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే ఆల్‌టైమ్ కనిష్ఠస్థాయికి చేరిన రూపాయి విలువ.. డాలర్‌తో పోలిస్తే మరో 53 పైసలు క్షీణించింది. దీంతో డాలర్ విలువ రూ.76.13కు పెరిగింది.

43 నెలల గరిష్ఠానికి నిరుద్యోగరేటు

మరోవైపు దేశంలో నిరుద్యోగ రేటు గణనీయంగా పెరిగి దాదాపు 9 శాతానికి చేరింది. గత 43 నెలల్లో ఇదే అత్యధికమని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) వెల్లడించింది. దేశ నిరుద్యోగరేటు గత నెలలో 8.74 శాతానికి చేరిందని, డీమానిటైజేషన్ తర్వాత ఇదే అత్యధికమని తెలిపింది. రాష్ట్రాలవారీగా చూస్తే ఈ ఏడాది మార్చిలో నిరుద్యోగరేటు త్రిపురలో అత్యధికం (29.9 శాతం)గా, పుదుచ్చేరిలో అత్యల్పం (1.2 శాతం)గా ఉన్నట్టు సీఎంఐఈ వెల్లడించింది.

సేవలరంగానికి దెబ్బ

ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో కరోనా తీవ్రత అంతగా లేకపోవడం కాస్త ఊరటనిస్తున్నది. దీన్ని ఇంతటితోనే కట్టడిచేయగలిగితే ఆర్థిక సంక్షోభం నుంచి మనం కొంతవరకు బయటపడినట్టే. కానీ సేవలరంగంతోపాటు ఐటీ, ఆతిథ్య, పర్యాటక రంగాలు దెబ్బతినే అవకాశమున్నది. దేశీయ ఉత్పత్తుల క్రయవిక్రయాలను దేశంలోనే జరుపుకోవడం ద్వారా మనం గట్టెక్కవచ్చు. కరోనాను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నట్టు కనిపిస్తున్నది. దీంతో మన దేశానికి ఆర్థికంగా మిగతా దేశాలంత గడ్డు పరిస్థితి ఉండకపోవచ్చు.
– నర్సింహమూర్తి, ప్రముఖ ఆర్థికవేత్త

యుద్ధప్రాతిపదికన విధాన నిర్ణయాలు తీసుకోవాలి..

సామాజిక, ఆర్థిక కోణంలో గమనిస్తే కోవిడ్-19 భారత చరిత్రలో అతిపెద్ద సంక్షోభం. దీనిపై జరుపుతున్న పోరాటంలో విజయం సాధించాలంటే యుద్ధప్రాతిపదికన విధాన నిర్ణయాలను తీసుకోవాలి. ఈ యుద్ధం ముగిశాక ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకు సముచిత నిర్ణయాలు తీసుకోవాలి. కరోనా కాటుతో నష్టపోయిన పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని అందించాలి. ఆర్థిక విధ్వంసాన్ని నిరోధించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి. వ్యాపార, పారిశ్రామిక రంగాలకు తక్కువ వడ్డీరేట్లతో దీర్ఘకాలిక రుణాలను మంజూరుచేస్తే ఆర్థిక వ్యవస్థ మళ్లీ పరుగు పెడుతుంది.
– ఎస్పీ రెడ్డి, సీఎండీ, టెర్మినస్ వెంచర్స్

తెలంగాణకూ నష్టం తప్పదు..

కరోనా దుష్ప్రభావం నుంచి తెలంగాణకూ మినహాయింపు ఉండదు. దీనివల్ల రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అంచనా వేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆర్థిక వ్యవస్థకు జరగకూడని నష్టం జరిగింది. కానీ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈసారి వ్యవసాయరంగంలో అభివృద్ధి నిలకడగానే ఉండవచ్చు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 11 శాతంగా ఉన్న రాష్ట్ర వ్యవసాయాధివృద్ధి రేటు.. 2019-20లో 19.3 శాతానికి పెరిగింది. పంటలకు కనీస మద్దతు ధరను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఈ సంక్షోభ సమయంలో చాలావరకు సానూకూల ఫలితాలను ఇవ్వవచ్చు. – డాక్టర్ కే సుహాసిని, వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త

ఆన్‌లైన్‌లో మద్యం.. 50వేలకు టోకరా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : ఆన్‌లైన్‌లో మద్యం విక్రయిస్తున్నామంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి సైబర్‌నేరగాళ్లు రూ.50 వేలు టోకరా వేశారు. మందుబాబు ఒకరు మద్యం కోసం ఇంటర్నెట్‌లో వెతికి సైబర్ నేరగాళ్ల వలలో పడ్డాడు. మద్యం ఆర్డర్ చేసిన ఆ వ్యక్తి, ఆన్‌లైన్‌లోనే డబ్బు చెల్లించేందుకు తన బ్యాంకు ఖాతా వివరాలను అందించాడు. తన ఖాతా నుంచి రూ.50వేలు మాయం కావడంతో పోలీసులను ఆశ్రయించాడు. మరో కేసులో బగ్గాఫైన్స్ నిర్వాహకులు తమ పేరిట కొందరు ఆన్‌లైన్‌లో మద్యం విక్రయిస్తామంటూ మోసం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు పంపే లింక్‌లను నమ్మవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పీఆర్ ఉద్యోగులకు పూర్తివేతనం ఇవ్వాలి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: కరోనా నియంత్రణలో పాల్గొంటున్న పంచాయతీరాజ్ ఉద్యోగులకు మార్చి నెల పూర్తిస్థాయి వేతనం ఇవ్వాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కరోనాపై పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రజలను మరింత చైతన్యం చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల నందకుమార్ పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి తోచిన విధంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆర్థికసాయం చేయాలని కోరారు.

epaper.ntnews.com

భర్తలకు దిమ్మదిరిగే చాలెంజ్..

భార్యాభర్తలన్నాక కాసింత కళాపోషణ ఉండాలంటున్నది నటి శ్రియ. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు.. తాజాగా ఓ సరికొత్త చాలెంజ్‌తో ముందుకొచ్చింది. అదేంటంటే..? భర్తలు భార్యలకు సహాయంగా వంటింటి పని చేయడం. కిచెన్‌లో చాలా పనులే ఉంటాయనుకోండి. వాటిలో ముఖ్యమైంది... గిన్నెలను తోమడం. అందుకే శ్రియ #bartansaafkaro అనే చాలెంజ్‌ను సోషల్ మీడియా వేదికగా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా తన భర్త ఆండ్రీతో గిన్నెలు తోమించింది. ఈ చాలెంజ్‌ను స్వీకరించాల్సిందిగా తన మిత్రులకూ పిలుపునిచ్చింది. వీరిలో నటులు అల్లు అర్జున్, ఆర్య, ఆశిష్ చౌదరి, 'జయం' రవి కూడా ఉన్నారు. 'ఈ క్లిష్ట పరిస్థితిలో పెళ్లయిన మగవాళ్లు భార్యలకు ఎలా సాయం చేయగలరో నిరూపించడానికే చాలెంజ్ విసురుతున్నాను' అని శ్రియ తెలిపింది.

హెల్ప్‌లైన్లు!

అత్యవసర సమయంలో ఆదుకున్నవాళ్లే దేవుళ్లు. ఇప్పుడున్న విపత్కర పరిస్థితుల్లో దేవుడి ప్రతిరూపాలుగా నిలుస్తున్నది ఇద్దరే... వైద్య సిబ్బంది, పోలీసులు. ఇద్దర్లోనూ పోలీసుల పరిధి మరింత విస్తృతం. కష్టాల్లో చిక్కుకున్నామంటూ సమాచారం అందించిన మరుక్షణమే బాధితుల దగ్గరికి చేరుకుంటున్నారు. అవసరమైతే పోలీసు వాహనాల్లోనే దవాఖానలకు తరలిస్తూ అభినందనలు అందుకుంటున్నారు. 100 వంటి హెల్ప్‌లైన్లూ, స్థానిక పోలీసు అధికారుల వాట్సప్ నంబర్లూ కష్టకాలంలో అండగా నిలుస్తున్నాయి.

తెల్లవారు జాము.
2 గంటల సమయం.
కాలీఖబర్ ప్రాంతానికి చెందిన ఓ గర్భిణి హఠాత్తుగా తీవ్ర అనారోగ్యం పాలైంది. బంధువులు అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. ఎంతకీ రాలేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో విషయాన్ని ఫోన్ ద్వారా మీర్‌చౌక్ పోలీసుల దృష్టికి తెచ్చారు. వెంటనే అప్రమత్తమైన పెట్రోకార్-2 సిబ్బంది ఆమెను సకాలంలో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆమె తమ్ముడు శశి మాట్లాడుతూ... 'సార్, అత్యవసర పరిస్థితి... అందులోనూ అర్ధరాత్రి. ఏం చేయాలో అర్థం కాలేదు. పోలీసులు దేవుళ్లలా వచ్చి ఆదుకున్నారు. ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం పాప పుట్టింది. అక్క, పాప ఆరోగ్యంగా ఉన్నారు. చాలా సంతోషంగా ఉంది..మనకోసం ఇంత చేస్తున్న పోలీసులకు మన వంతుగా సహకరించాలి' అంటూ సంతోషాన్ని పంచుకున్నాడు.

* * *

రేఖ ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగి. హబ్సిగూడలో ఉంటారు. ఆమె భర్త అనారోగ్యంతో బాధపడుతున్నారు. డయాలసిస్ అవసరం. ప్రాణావసర మందులు వాడుతున్నారు. దగ్గరలో ఉన్న మెడికల్ షాపుల్లో ఆ ఔషధాలు దొరకలేదు. పెద్ద దుకాణాలు ఇంటికి చాలాదూరం. రవాణా సౌకర్యం కూడా లేదు. ఆటోలూ క్యాబ్‌లూ బంద్. ఏం చేయాలో తోచలేదు రేఖకు. మెసేజీ రూపంలో తన సమస్యను రాచకొండ సీపీ మహేశ్ భగవత్ దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే స్పందించిన ఆ ఉన్నతాధికారి ... రాచకొండ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మనోహర్‌ను అప్రమత్తం చేశారు. ఆయన సూచన మేరకు ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు పదిహేను నిమిషాల్లోనే రేఖ ఇంటికి చేరుకున్నారు. పోలీస్ వాహనంలో రేఖను తీసుకెళ్లి, అవసరం అయిన మందులు ఇప్పించి, సురక్షితంగా తిరిగి ఇంటి వద్ద వదిలిపెట్టారు. 'నా భర్తకు రోజూ డయాలసిస్ చేయాలి. లేదంటే ప్రాణానికే ప్రమాదం. ప్రతి నెలా అవసరమైన మందులను సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కొక్క బాక్స్ 15 కిలోలు ఉంటుంది. ఇలా... 20 డబ్బాలు తెచ్చుకోవాలి. సాధారణంగా అయితే క్యాబ్‌లో వెళ్లి తెచ్చుకుంటాను. లాక్‌డౌన్ ఉండటంతో క్యాబ్‌లు లేవు.. తెలిసిన వాళ్ల సాయం అడిగినా, ఎవరూ ముందుకు రాలేదు. ఏదో ఓ అబద్ధం చెప్పి తప్పించుకున్నారు. పోలీసులు వాహనాన్ని సీజ్ చేస్తారన్న భయం. నిజమే, ఎవరి ఆలోచనలు వారివి. కానీ నన్నెవరు ఆదుకుంటారు? ఆపత్కాలంలో పోలీసులు సాయం చేశారు. తెలంగాణ పోలీసు శాఖకు ఎంతో రుణపడి ఉంటాను..' అంటూ కన్నీళ్లు తుడుచుకున్నారు రేఖ.

'నా పేరు జయరాజ్. బేగంపేటలోని శ్యామ్‌లాల్ ప్రాంతంలో ఉంటాను. ప్రైవేటు ఉద్యోగిని. అకస్మాత్తుగా చాతీలో విపరీతమైన నొప్పి వచ్చింది. ఏం చేయాలో తోచలేదు. స్నేహితులు అంబులెన్స్‌కు కాల్ చేశారు. వాహనాలు అందుబాటులో లేవనీ, రావడానికి కనీసం అరగంట పడుతుందని చెప్పారు. వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. ఐదు నిమిషాల్లోనే పోలీసు జీపు మా ఇంటి ముందు ఆగింది. వాళ్లే నన్ను పసిబిడ్డలా చేతుల్లో ఎత్తుకుని కారు వరకు తీసుకెళ్లారు. కిమ్స్‌లో చేర్పించారు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లడంతో కోలుకోగలిగాను. కష్టకాలంలో నన్ను బతికించిన తెలంగాణ పోలీసులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను'... అని చెబుతున్నప్పుడు జయరాజ్ కళ్లలో ఎనలేని కృతజ్ఞతా భావం.

మందులేని మాయరోగం... ఎయిడ్సో, క్యాన్సరో కాదు. ఆకలి. దరిద్రుడి ఆకలి! అందులోనూ... దుకాణాలూ కార్ఖానాలూ మూసుకుపోయిన పరిస్థితుల్లో కష్టాన్నే నమ్ముకుని బతికే పేదలకు పిడికెడు మెతుకులు దొరకడం కూడా గగనమైపోయింది. ఈ పరిస్థితుల్లో కొందరు దాతలు మేమున్నామంటూ ముందుకొస్తున్నా... అన్నార్తుల సమాచారం తెలుసుకోవడం కష్టం అవుతున్నది. దీంతో వండిన అన్నమంతా వృథాగా పోతున్నది. అవసరమైన వాళ్లకు అందడం లేదు. కర్ఫ్యూ వాతావరణంలో ఆహార పదార్థాల రవాణా కూడా పెద్ద సమస్యే. ఈ ఇబ్బందుల్ని తొలగించడానికి డీజీపీ ఆఫీసులో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 9490617523 నంబరుతో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశారు. అన్న దాతలకూ అన్నార్తులకూ ఇదో వేదిక. దీనివల్ల ఆకలితో ఉన్నవారికి కడుపు నిండుతుంది. సాయం చేసినవారికి సంతృప్తి దక్కుతుంది.

'సార్! మా కాలనీలో ఒకరు ఈమధ్యే ఢిల్లీకి వెళ్లొచ్చారు' 'ఫారిన్ నుంచి వచ్చినా తప్పించుకుని తిరుగుతున్నాడు మా బంధువుల పిల్లగాడు. మాకు భయంగా ఉంది' 'మా కాలనీ నిండా చెత్త. అసలే వాతావరణం బాగాలేదు' ... ఒకటి కాదు, రెండు కాదు, రోజూ వేలకొద్దీ ఫోన్‌కాల్స్. సలహాలూ సూచనలూ ఫిర్యాదులూ, కీలక సమాచారాలూ... ప్రతిదాన్నీ అతిముఖ్యమైన కాల్‌గానే భావిస్తారు హెల్ప్‌లైన్ సిబ్బంది. 100కు మూడు రోజుల్లోనే ఆరున్నర లక్షల కాల్స్ వెల్లువెత్తినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి ఈ మధ్య ప్రకటించారు. పోలీసు వ్యవస్థ మీదా, ప్రభుత్వం మీదా ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇదో నిదర్శనం. ఆ మూడు అంకెలు... సామాన్యుడికి నాలుగు దిక్కులు అవుతున్నాయి. ఒక్కఫోన్‌కాల్ నిండు జీవితానికి భరోసా ఇస్తున్నది.హెల్ప్‌లైన్.. లైఫ్‌లైన్‌గా మారుతున్నది.

...✍ నాగోజు సత్యనారాయణ

దేశానికి అన్నం పెట్టేవాడు

'దేశానికి అన్నం పెట్టేది రైతే. దేశమిప్పుడు ఆకలితో ఉంది, సంక్షోభంలో ఉంది. మరి నేనెందుకు ఈ పంటను గోదాములో నిల్వ చేసుకోవాలి. లేదు. నా దేశ ప్రజల ఆకలి తీర్చేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను'.. ఆ యువరైతు ఆవేశంగా అన్నమాటలివి. ఆలోచించీ అన్నమాటలివి.

కేరళకు చెందిన 25 ఏండ్ల యువకుడు యాదు ఎస్ బాబు. ఒకటిన్నర ఎకరాల్లో వారానికి వంద కిలోల వరకూ కూరగాయలు పండిస్తున్నాడు. అవన్నీ ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసినవే. దీంతో పాటు అతనికి ఓ స్వచ్ఛంద సంస్థ ఉంది. ఇది పన్నెండు ఏండ్లుగా ఆకలితో ఉన్నవారికి అన్నం పెడుతున్నది. లాక్‌డౌన్ అమలవుతున్న నేపథ్యంలో కేరళలోని వలస కార్మికులు, యాచకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి వచ్చింది. 'ఇప్పుడు రైతుగా నేను చేయాల్సింది పంటను అమ్ముకోవడం కాదు.. గోదాములో దాచుకోవడమూ కాదు. పేదల ఆకలి తీర్చాలి' అనుకున్నాడు యాదు. అందుకే తన పంటను కేరళలోని కూలీలకు అంకితం చేశాడు. దాంతో ఆహారాన్ని వండి ఆకలి తీర్చాలనుకున్నాడు. అట్లాగే తమ సంస్థ ఆధ్వర్యంలో సుమారు వంద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందిస్తున్నామని చెప్పాడు యాదు.



DIAL 100

కామిక్ కరోనా

'కరోనా' వైరస్ కంటే వేగంగా ఫేక్ న్యూస్ వ్యాపిస్తున్నది. దీనికి అడ్డుకట్ట వేసే విషయంలో ఢిల్లీకి చెందిన 'రాజ్ కామిక్స్' సంస్థ వినూత్నంగా ఆలోచించింది. 'కరోనామ్యాన్' పేరుతో ఇటీవలే ఓ కామిక్‌ను విడుదల చేసింది. ఇందులో కరోనామ్యాన్ పేరు నాగరాజు. సిటీలో కరోనాను వ్యాప్తి చేస్తున్న వ్యక్తులను గుర్తించి, వారి మీద దాడి చేయాలని అనుకుంటాడు. అయితే కరోనా వ్యాప్తిని అడ్డుకొనేందుకు ఇలా చేయాల్సిన అవసరం లేదనీ, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తే చాలనీ తెలుసుకుంటాడు. ఇక నుంచి ఆ నిబంధనలను, సందేశాలను ప్రజలకు చేరవేయడమే పనిగా పెట్టుకుంటాడు కరోనా మ్యాన్. ప్రజల్లో భయాందోళనలను పోగొట్టడానికి ఈ కామిక్ ఉపయోగపడుతుందని రూపకర్తలు మనోజ్ గుప్త, అశ్విన్ అంటున్నారు.

కరోనా శతక 'రాజు'

వైనా దేశమునందున
దానవ గుణమున జనించి దండనచేయన్
మానవ దేహము జేరుచు
ప్రాణములను తీయుచున్న పాడు కరోనా!!

పుట్టితివట చైనాలో
పట్టితివట పాశము నర ప్రాణము తీయన్
చుట్టితివట సృష్టియంత
చుట్టపు చూపుగతిరిగెడి చురుకు కరోనా!!

...ఈ పద్యాలు సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండ్ల రాజు రచించిన 'కరోనా శతకం'లోనివి. ఆయన ప్రస్తుతం జిల్లాలోని చిన్నకోడూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

గేయాలు, పద్యాలు, కవితలు రాయడం ఆయన ప్రవృత్తి. పసిడి పలుకులు (బాలగేయాలు), సూక్తిసుధ శతకం, నీలకంఠ పదాలు... రాజు ఇతర రచనలు. ఇప్పటివరకు 800లకు పైగా పద్యాలు, గేయాలు రాశారు. విద్యార్థులను కూడా సాహిత్యం వైపు ప్రోత్సహిస్తున్నారు. ఆయన ఆశీస్సులతోనే కావ్య అనే విద్యార్థిని 'కావ్యమాలశతకం' రచించింది. రాజు తొగుట పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో పిల్లలు రాసిన కవితలతో 'బాలల కవితా మకరందం' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కరోనా వ్యాధిపై ఒక్కొక్కరు ఒక్కోరీతిలో పోరాడుతున్నారు. అవధాని అంజయ్య ఒక రోజులోనే వంద పద్యాలు రాసి అక్షర సమరాన్ని ప్రకటించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకున్న రాజు ఐదురోజుల్లో నూట ఒక్క కంద పద్యాలతో శతకం రాసి కవిగా తన గళం వినిపించారు.

సందేహం సమాధానం

ఆఫీసులో జాగ్రత్త

లాక్‌డౌన్ ఉన్నప్పటికీ అత్యవసర సేవల్లో భాగంగా కొన్ని ఆఫీసులు, దుకాణాలు పని చేయాల్సిన పరిస్థితి. ఇక్కడ కొవిడ్ -19 వ్యాపించకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
-రామ్, సికింద్రాబాద్

నిత్యావసర వస్తువుల దుకాణాలు, సూపర్ మార్కెట్లు, మెడికల్ షాప్‌లు ప్రతిరోజూ కొద్ది సమయమైనా తెరిచే ఉంచాల్సి ఉంటుంది. అదే విధంగా హాస్పిటల్స్, పత్రికల ఆఫీసులు, టీవీ స్టూడియోలు తప్పనిసరిగా పనిచేస్తూనే ఉంటాయి. దుకాణాల్లో బయటి నుంచి వచ్చేవాళ్లు ఉంటారు. ఆఫీసుల్లో కూడా బయటి నుంచి లోపలికి, లోపలి నుంచి బయటికి తిరగాల్సిన పనులు ఉంటాయి. అందువల్ల ఆఫీస్‌లోని అన్ని గదుల్లోనూ, ఫర్నిచర్ విషయంలోనూ ఎప్పటికప్పుడు డిస్‌ఇన్‌ఫెక్ట్ చేయాల్సిన అవసరం ఉంటుంది. ప్రతి ఆఫీసులో ప్రవేశం దగ్గర తప్పనిసరిగా హ్యాండ్ శానిటైజర్‌ను ఉంచాలి. ప్రతి ఒక్కరూ అది రాసుకున్న తరువాతే లోపలికి ప్రవేశించాలి. పని అయిపోయాక, మూసేసే ముందు మొత్తం ఆఫీసును శుభ్రం చేయాలి. ఆఫీసులోని ప్రతి గది, క్యాంటీన్‌తో సహా సోడియం హైపోక్లోరైట్ ద్రావణంతో గానీ, ఫినాయిల్‌తో గానీ శుభ్రంగా తుడవాలి. టేబుళ్లు, కుర్చీలను కూడా శుభ్రం చేయాలి. మురికి ఎక్కువగా ఉంటే సబ్బునీటితో శుభ్రపరచాలి. కారిడార్లు, మెట్లు, లిఫ్ట్, సెక్యూరిటీ ఏరియా... అన్నీ క్లీన్ చేయాలి. సోడియం 1 శాతం హైపోక్లోరైట్ ద్రావణం కోసం... 7 గ్రాముల బ్లీచింగ్ పౌడర్‌ని 1 లీటర్ నీటిలో కలపాలి. ఇకపోతే ఆఫీసులో ఎక్కువగా వాడే లిఫ్ట్ బటన్, కాల్ బటన్స్, టెలిఫోన్లు, ప్రింటర్, స్కానర్ లాంటి వాటిని సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో ముంచి, పిండిన గుడ్డతో శుభ్రం చేయాలి. తలుపు హ్యాండిల్స్, సెక్యూరిటీ లాక్స్ లాంటి వాటికి శానిటైజర్ వాడాలి. ఆఫీసులో ఎవరికైనా ఫ్లూ లక్షణాలుండి తుమ్మడమో, దగ్గడమో చేస్తే వెంటనే ఆ సీటు ఖాళీ చేయించి వాళ్లను మాస్కు పెట్టుకోమనాలి. ఆ చోటంతా సోడియం హైపోక్లోరైట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. హౌజ్ కీపింగ్ సిబ్బంది చేతులకు గ్లౌవ్స్, మాస్కులు, కాళ్లకు రబ్బర్ బూట్లు ధరించాలి. ఆ తరువాత గ్లౌవ్స్, మాస్కులను డిస్పోజ్ చేయాలి. ఉద్యోగులు కూడా రాగానే తమ టేబుల్, కంప్యూటర్ మానిటర్, మౌస్, కీబోర్డును శుభ్రం చేసుకోవాలి. ఒకరి ఫోన్ మరొకరు వాడొద్దు. ల్యాండ్‌లైన్ అలా వాడాల్సి వస్తే మౌత్ పీస్‌నీ, ఇయర్ పీస్‌నీ ఆల్కహాల్‌తో తుడవాలి. ఆఫీసులో కూడా దగ్గరగా కూర్చోవద్దు. కనీసం 2 మీటర్ల దూరంలో ఉండాలి.

డాక్టర్ ఎం.వి. రావు
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

మీ సందేహం... మా సమాధానం: కరోనా వ్యాధి గురించి మీకు ఎటువంటి అనుమానాలు, భయాలు ఉన్నా ఆందోళన పడకండి. మీ ప్రశ్నలు మాకు వాట్సప్ చేయండి. నిపుణులతో మీకు సమాధానాలు ఇప్పిస్తాం. ప్రశ్నలు పంపవలసిన వాట్సప్ నెంబర్: 91827 77177

జర నవ్వుకో!

టీచర్ : టైటానిక్ ఎలా మునిగింది రా చింటూ?
చింటూ : బుడుక్.. బుడుక్ అని టీచర్.

***

టీచర్: ఒరేయ్ గోపీ.. కోడి వలన ఏవైనా రెండు ఉపయోగాలు చెప్పరా..
గోపి: కోడి కూస్తే అలారం.. కోస్తే ఆహారం .

మ్యాప్ పాయింటింగ్

ఈ మ్యాప్‌లో కింద ఇచ్చిన ప్రాంతాలను గుర్తించండి.



1. ఆగ్రా (ఉత్తరప్రదేశ్)
2. అలప్పుజ (కేరళ)
3. కాళేశ్వరం (తెలంగాణ)
4. నాసిక్ (మహారాష్ట్ర)
5. బెంగళూర్ (కర్ణాటక)

పొడుపు కథలు

1 నిలబడితే నిలుస్తుంది. కూర్చుంటే కూలబడుతుంది. ఏమిటది?
2. కన్ను ఉంటుంది కానీ చూడలేదు. ఏమిటది?
3. వేలికి పెట్టుకోలేని రింగు?
4. పేపర్ చింపుతాడు కానీ పిచ్చివాడు కాదు. డబ్బులు అడుగుతాడు కానీ బిచ్చగాడు కాదు. ఎవరు?

పెద్దల మాట

ప్రాణాలను కాపాడటానికి మేం ఆర్థిక సాయం అందిచలేక పోవచ్చు. కానీ డాక్టర్లను అందిస్తాం. ఈ మాట నేడూ, రేపు, ఎల్లప్పుడూ ఆచరణలో ఉంటుంది. ప్రపంచంలో ఎవరికి సాయం అవసరమైనా క్యూబా ఈ డాక్టర్లు ముందుంటారు.

- ఫిడెల్ క్యాస్ట్రో

నేర్చుకొందాం..

నేను లోపలికి రావొచ్చా?
May I come in ?
మే ఐ కమ్ ఇన్?

నాకు మీ పెన్ను ఇవ్వగలరా?
Can you please give me your pen?
కెన్ యూ ప్లీజ్ గివ్ మీ యువర్ పెన్?

చుక్కలు కలుపండి

పండిత పుత్రుడు

రత్నపురి రాజ్యానికి ఆస్థాన పండితుడు వరదాచారి. ఎంతటి వారినైనా తన పాండిత్యంతో చిత్తు చేసేవాడు. దాంతో ఆయన కీర్తి నలుదిక్కులా వ్యాపించింది. అతనికి సుబుద్ధి అనే కుమారుడు ఉండేవాడు. కానీ ఆ బాలునికి చదువు మీద ఆసక్తి ఉండేది కాదు. 'చదువే బంగారు భవిష్యత్తుకు పునాది'అని ఎవరైనా హితవు పలికితే కోపం వచ్చేది. 'కష్టపడి చదవవలసిన అవసరం నాకు లేదు. చదువు లేకున్నా హాయిగా బతకగలను. మా నాన్న గొప్ప పండితుడు. మా ఇంటి నిండా బంగారు నాణాలు, రత్న మాణిక్యాలు ఉన్నాయి'అని గొప్పగా చెప్పేవాడు. రోజూ ఆట, పాటలతో సమయం వృథా చేసేవాడు. అది గమనించిన ఓ వ్యక్తి 'పండిత పుత్ర పరమ శుంఠ'అన్నాడు.

ఆ మాటలు విన్న సుబుద్ధి తనని గౌరవంగా పిలుస్తున్నాడేమో అనుకున్నాడు.ఒకరోజు సుబుద్ధి రాజుగారి ఉద్యానవనంలో ఆడుకుంటున్నాడు. అంతలో అటుగా వెళుతున్న మంత్రి... 'ఎవరు బాబూ నీవు?' అని ప్రశ్నించాడు. 'నేను పండిత వరదాచారి పుత్రుడిని. పరమశుంఠను' అని గర్వంగా చెప్పాడు. అంతలో ఏదో శబ్దం విని పిస్తే ఇద్దరూ అటువైపు చూశారు. అక్కడ ఓ చెట్టుపై కోతులు అటూ ఇటూ దూకుతున్నాయి. అంతలో ఓ కోతి పట్టు తప్పి కిందపడింది. వెంటనే మిగిలిన కోతులు దానిని వదిలేసి అక్కడ నుంచి వెళ్లిపోయాయి. సుబుద్ధి బాధపడుతూ.. 'కింద పడ్డ కోతిపై మిగతా కోతులు ఎందుకు జాలి చూపలేదు?' అని అడిగాడు. దానికి మంత్రి జవాబు చెప్తూ 'బాబూ కోతి జాతిలో ఓ పద్ధతి ఉంది. కోతులు ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదకు దూకేటప్పుడు కింద పడవు. ఏ కోతైనా పొరపాటున కిందపడితే, అది తమ జాతికే అవమానంగా భావిస్తాయి. అందుకే ఆ కోతిపై జాలి చూపక వెలివేసి వెళ్లిపోతాయి. కోతులు దేన్నైనా సహిస్తాయి. కానీ చేతకానితనాన్ని మాత్రం సహించలేవు' అని చెప్పాడు. అది విన్న సుబుద్ధి.. 'అయితే పండితుల పిల్లలంతా బాగా చదువుకుంటున్నారు. కానీ చదువు రాని నేను వాళ్లందరి ముందూ చేతకానివాడిని అవుతాను కదా! మరి అందరూ నన్ను వెలివేస్తారా?' అని ఉద్వేగంగా అడిగాడు. మంత్రి అతడి భుజంపై చెయ్యేసి 'అవును నాయనా... నీవు చదువుకోకుంటే అందరూ నిన్ను పండిత పుత్ర పరమ శుంఠ' అంటారు. పరమ శుంఠ అంటే తెలివితక్కువవాడు అని అర్థం. కాబట్టి నువ్వే ఆలోచించుకో అని చెప్పాడు . సుబుద్ధి కాసేపు ఆలోచించి.. 'నేను బాగా చదువుకొని గొప్ప పండితుడిని అవుతాను. తండ్రిని మించిన కొడుకు అన్న పేరు తెచ్చుకుంటాను'అన్నాడు. మంత్రి అతడిని మనసారా ఆశీర్వదించాడు.

నీతి:
చదువే మనిషికి విలువను పెంచుతుంది.

దారి కనుక్కోండి

అంత పెద్ద చెవులా?



అన్ని జంతువులకు పెద్ద పెద్ద తోకలు, చిన్న చిన్న చెవులు ఉంటాయి. కానీ ఏనుగుకు మాత్రం పెద్ద చెవులుంటాయి. ఎందుకో తెలుసా? సాధారణంగా మిగతా జంతువులు పొడవాటి తోక వల్ల.. శరీరం మీద వాలే ఈగల్ని, దోమల్ని వదిలించుకుంటాయి. మిగతా భాగాల్ని పొడవైన మూతితో శుభ్రపరుచుకుంటాయి. ఇక ఏనుగుది భారీ శరీరం. తోకేమో చిన్నది. తొండం ఉన్నా శరీరం మొత్తం అందదు. దీనివల్ల శరీరమంతా తడుముకునే అవకాశం లేదు. ఇక్కడే దాని చెవులు ఉపయోగపడతాయి. చేటల్లాగా ఉండి, మృదువుగా కదిలే చెవుల సాయంతో కీటకాలను వదిలిస్తుంది గజరాజు. ఏనుగు వేడిని అంతగా తట్టుకోలేదు. అందుకనే స్నానం చేసిన వెంటనే.. బురదను, ఇసుకను ఒంటిపై జల్లుకుంటుంది. దీనివల్ల ఉష్ణం బయటకు పోతుంది. చెవుల్లో సూక్ష్మమైన రక్తనాళికలు ఉంటాయి. వీటిని తరచూ ఊపడం వల్ల శరీరానికి గాలి తగలడంతో పాటు లోపలి రక్తం కూడా చల్లగా అయ్యే అవకాశం ఉంటుంది. ధ్వని తరంగాలను ఒడిసి పట్టుకోవడంలో కూడా ఈ చెవులు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

జవాబులు పొడుపు కథలు: 1.నీడ 2.సూది 3.ఫైరింగ్ 4.కండక్టర్

చిత్రం

సీసీసీ తక్షణ సాయం

ఎన్.శంకర్

కరోనా క్రైసిస్ ఛారిటీ మన కోసం(సీసీసీ) ద్వారా సినీ కార్మికులకు తక్షణ సాయంగా నిత్యవసర సరుకుల్ని అందజేయనున్నట్లు ఛారిటీ సభ్యుడు, దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'సినిమా ఇండస్ట్రీ అసోసియేషన్స్ సూచించిన నిరుపేద సినీ కార్మికులతో పాటు సహాయం కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటాం. నిత్యవసరాలు అవసరమైన వారికి ఈ నెల ఐదో తేదీ నుంచి డోర్ డెలివరీ ద్వారా అందజేస్తాం. మెడిసిన్స్ కోసం ఇబ్బందులు పడుతున్న వారికి చిరంజీవి, రామ్‌చరణ్, ఉపాసనల సహకారంతో ఇంటికే మందులు పంపించే ఏర్పాటు చేయడం జరిగింది. 500 నుంచి 1000 రూపాయల విలువ చేసే మందులు అందజేస్తాం. ఇండస్ట్రీలోని కార్మికులంతా తమ అసోసియేషన్స్ ద్వారా ఇబ్బందులను తెలియజేస్తే వారి ద్వారా మీకు సహాయసహకారాలను అందిస్తాం. ఇది నిరంతర సేవ. అవసరమైన అందరికి ఈ సేవలు అందుతాయి' అని తెలిపారు. దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'కార్మికులకు మంచి జరగాలనే చిరంజీవి ఆలోచన నుంచి సీసీసీ ట్రస్ట్ ఏర్పాటైంది. ఈ ఛారిటీ ద్వారా తాత్కాలికంగా కాకుండా శాశ్వత సహాయాన్ని అందించనున్నాం. భవిష్యత్‌లోనూ ఈ ఛారిటీ కొనసాగేలా ప్రణాళికను రూపొందిస్తున్నాం. ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేయబోతున్నాం. ఎన్.శంకర్ సారథ్యంలో వారి జాబితాల్ని సిద్ధం చేస్తున్నాం' అని చెప్పారు.

రెచ్చిపోదాం బ్రదర్

రవికిరణ్

వి.రవికిరణ్, అతుల్ కులకర్ణి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రెచ్చిపోదాం బ్రదర్'. ఏ.కె జంపన్న దర్శకుడు. వి.వి. లక్ష్మి, హనీష్‌బాబు ఉయ్యూరు నిర్మిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదలచేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. వాస్తవిక పరిస్థితులకు దర్పణంలా ఉంటుంది. అతుల్ కులకర్ణి, భానుచందర్, ఇంద్రజ వంటి అనుభవజ్ఞులు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు' అన్నారు. పాట మినహా చిత్రీకరణ పూర్తయిందని నిర్మాతలు పేర్కొన్నారు.

సినీ జర్నలిస్టులకు ఆసరా

కరోనా వైరస్ వల్ల లాక్‌డౌన్ ప్రకటించడంతో ఇబ్బందులు పడుతున్న సినీ పాత్రికేయులకు తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అండగా నిలిచింది. అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'సినీ పాత్రికేయులతో పాటు వీడియో జర్నలిస్ట్, ఫొటో జర్నలిస్ట్‌లకు అసోసియేషన్ అసరాగా నిలుస్తుంది. 35 మంది సినీ పాత్రికేయులకు నెలరోజులకి సరిపడా నిత్యవసర సరుకుల్ని అందజేశాం. ఆకలితో ఏ ఒక్కరూ ఉండకూడదన్నదే మా అసోసియేషన్ ముఖ్యోద్దేశ్యం' అని చెప్పారు.

అనుపమ పరమేశ్వరన్

బాలకృష్ణ కోటి ఇరవై ఐదులక్షల విరాళం

కరోనా వైరస్ వ్యాప్తితో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి తెలుగు రాష్ట్రాల సహాయనిధితో పాటు సినీ కార్మికులకు కోటి ఇరవై ఐదు లక్షల వితరణను అందజేశారు బాలకృష్ణ. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి యాభై లక్షలు, ఏపీ ముఖ్యమంత్రి సహాయనిధికి యాభై లక్షలు విరాళంగా ఇచ్చారాయన. శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కలిసిన బాలకృష్ణ ఆయనకు యాభై లక్షల చెక్‌ను అందించారు. అలాగే లాక్‌డౌన్ కారణంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న సినీ కార్మికులను ఆదుకోవడానికి చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటైన కరోనా క్రైసిస్ ఛారిటీకి బాలకృష్ణ ఇరవై ఐదు లక్షల రూపాయల్ని అందించారు. స్వీయనిబంధనలను పాటిస్తూ ఇంట్లోనే ఉంటూ కరోనా వైరస్‌ను ఎదుర్కోవాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ 'వైద్యులు, పోలీసులతో పాటు అనేక మంది సిబ్బంది మన కోసం, మన ఆరోగ్యం కోసం, మన కుటుంబాల బాగు కోసం రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నారు. కానీ మనం తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో పొరపాట్లు చేస్తున్నాం. ఈ పొరపాట్లు చేయకూడదని సోదరసోదరీమణులందరికి విన్నవిస్తున్నాను. కరోనా నియంత్రణలో మన బాధ్యతల్ని నిర్వరించాలి' అని చెప్పారు.

బాలకృష్ణ అల్లుడు కోటి విరాళం
కరోనా వ్యాప్తి నిర్మూలన కోసం బాలకృష్ణ చిన్నల్లుడు, గీతమ్ విద్యా సంస్థల చైర్మన్ ఎమ్. భరత్ తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి 25 లక్షలు అందించారు. చెక్‌ను మంత్రి కేటీఆర్‌కు శుక్రవారం అందజేశారాయన. అలాగే ఏపీకి యాభై లక్షలు, కర్ణాటకకు ఇరవై లక్షల్ని ప్రకటించారు భరత్.



భరత్, కేటీఆర్

కేటీఆర్‌కు విరాళ పత్రాన్ని అందజేస్తున్న బాలకృష్ణ

సంపత్‌నంది ఐదు లక్షలు
కరోనా క్రైసిస్ ఛారిటీకి దర్శకుడు సంపత్ నంది ఐదు లక్షల రూపాయల్ని విరాళంగా అందించారు. ఎవరూ ఊహించని ఉపద్రవమిదని, ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో సహాయంగా అందించే ప్రతి రూపాయి ఎంతో కీలకమని సంపత్‌నంది పేర్కొన్నారు.

'హెలెన్' రీమేక్‌లో?

గత ఏడాది మలయాళంలో వచ్చిన 'హెలెన్' చిత్రం విమర్శకుల ప్రశంసల్ని అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను సాధించింది. ఓ మాల్‌లోని చికెన్ హబ్‌లో పనిచేసే నర్సింగ్ విద్యార్థిని అనుకోని పరిస్థితుల్లో కోల్డ్‌స్టోరేజీలో చిక్కుకుపోతుంది. ఓ వైపు మృత్యువు కబళించే క్షణాలు సమీపిస్తుంటే ఆ యువతి ప్రాణరక్షణకై చేసిన పోరాటం నేపథ్యంలో మానవీయ ఇతివృత్తంతో ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్రాన్ని వివిధ భారతీయ భాషల్లో పునర్నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు రీమేక్‌లో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించబోతున్నట్లు సమాచారం. పీపీపీ సంస్థ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి నిర్దేశక బాధ్యతల్ని కొత్త దర్శకుడు చేపట్టబోతున్నాడని సమాచారం. 'రాక్షసుడు' తర్వాత తెలుగులో మరే సినిమాలోనూ నటించలేదు అనుపమ పరమేశ్వరన్. 'హెలెన్' సినిమాలోని హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలు, మానవీయ కోణం ఆకట్టుకోవడంతో ఈ సినిమాలో నటించేందుకు అనుపమపరమేశ్వరన్ సంతోషంగా అంగీకరించిందని చెబుతున్నారు. మలయాళంలో ఈ చిత్రానికి మత్తుకుట్టి జ్జేవియర్ దర్శకత్వం వహించారు.

ఆరువేల కుటుంబాలకు అండగా..

షారుఖ్‌ఖాన్

నేడు ప్రపంచ మానవాళి యావత్తు కరోనా కోరల్లో చిక్కి విలవిలలాడుతోందని, ఈ సంక్షుభిత పరిస్థితుల్ని జయించడానికి మానవత్వ వ్యక్తీకరణను మించిన మహాసాధనం లేదని బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ ఉద్ఘాటించారు. కరోనా విపత్తును ఎదుర్కోవడానికి తాను చేపట్టబోయే సహాయ కార్యక్రమాల వివరాల్ని ఆయన ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. షారుఖ్‌ఖాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న రెడ్ చిల్లీస్, మీర్‌ఫౌండేషన్, రెడ్ చిల్లీస్ వీఎఫ్‌ఎక్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సహాయ చర్యల్లో పాలుపంచుకోబోతున్నాయి. పీఎం కేర్స్‌కు నగదు విరాళంతో పాటు మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలకు మద్దతుగా షారుఖ్‌ఖాన్ పలు సహాయ కార్యక్రమాల్ని చేపట్టబోతున్నారు. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు, ఆరోగ్య శాఖ ఉద్యోగులకు 50వేల రక్షణ కిట్లను పంపిణీ చేయబోతున్నట్లు షారుఖ్ ఖాన్ తెలిపారు. ముంబయిలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ ఏక్‌సాథ్‌తో కలిసి దాదాపు 6000 కుటుంబాలకు నెలరోజుల పాటు భోజనాన్ని అందిస్తామన్నారు. ముంబయి కేంద్రంగా పనిచేసే రోటీ ఫౌండేషన్‌తో కలిసి రోజుకు పదివేల మీల్స్ చొప్పున ఒక నెలపాటు పేదవారికి, దినసరి కార్మికులకు భోజనాన్ని సమకూర్చబోతున్నామని షారుఖ్ ఖాన్ పేర్కొన్నారు. ఢిల్లీలో 2500 మంది డెయిలీ వర్కర్లకు ప్రతి రోజు నిత్యవసర వస్తువుల్ని అందించబోతున్నామని చెప్పారు. అయితే పీఎం కేర్స్‌తో పాటు మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలకు ఎంత మొత్తంలో నగదు విరాళాన్ని అందించే వివరాల్ని షారుఖ్‌ఖాన్ వెల్లడించలేదు.

పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

వైరస్‌ను తరిమికొడుదాం

- అందుకు ప్రజలంతా సహకరించాలి
- 14 వరకు ఇళ్లకే పరిమితం కావాలి
- అన్ని విషయాలపైనా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది
- మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ నుంచి కరోనా వైరస్‌ను తరమికొడుదామని, అందుకు ప్రజలందరూ సహకరించాలని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. వైరస్ నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని మారుతీనగర్‌కు చెందిన మోటార్ వైండింగ్ మెకానిక్ అల్లాడి ప్రభాకర్ తయారు చేసిన యాంటీ బ్యాక్టీరియా క్యాబిన్ యంత్రాన్ని శుక్రవారం నగర మేయర్ వై సునీల్‌రావుతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థలో 1200 మంది కార్మికులకు గ్లౌజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమాత్యుడు మాట్లాడుతూ, మార్చి 18న నగరంలో ఏడు పాజిటివ్ కేసులు రావడంతో కలకలం రేగిందని, ఆ వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. సకాలంలో స్పందించి ఇండోనేషియావాసులు తిరిగిన ప్రాంతాలను రెడ్‌జోన్ ఏర్పాటు చేయడంతో ముప్పును చాలా వరకు తగ్గించగలిగామని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో చాలా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. నగరాన్ని పూర్తిగా శానిటైజేషన్ చేశామని, ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షల సర్వేలు కూడా పూర్తి చేశామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం వల్ల పూర్తిస్థాయిలో సహకరించారని, దాంతో కేసుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. కూరగాయలు కొనేటప్పుడు సామాజిక దూరం పాటించకపోతే ఇబ్బందులు వస్తాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని యాంటీ బ్యాక్టీరియా క్యాబిన్ యంత్రాన్ని పరిశీలిస్తున్నామని, దీని పని తీరు విజయవంతంగా ఉంటే కూరగాయల మార్కెట్ల వద్ద ఏర్పాటు చేస్తామని చెప్పారు. కూరగాయల మార్కెట్ వద్ద కానీ, ఇతర ప్రాంతాల్లో కాని ఏర్పాటు చేస్తే శానిటైజేషన్ పూర్తవుతుందన్నారు. ఇంతటితో అయిపోయిందని అనుకోవద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా ఈ నెల 14 వరకు ఇండ్లలోనే ఉండాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ బియ్యం సరఫరాలో ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ క్రాంతి, నాయకులు చల్ల హరిశంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' నిధులు విడుదల

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జిల్లాకు ఆసరా పింఛన్ డబ్బులు విడుదలైనట్లు కరీంనగర్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు. 10వేల లబ్ధిదారులకంటే ఎక్కువగా ఉన్న వారికి పోస్టాఫీసుల ద్వారా పంపిణీ చేస్తున్నామని, అంతకంటే తక్కువగా లబ్ధిదారులున్న మండలాల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి 1,23,122 మంది లబ్ధిదారులకు ₹ 26.92 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి పింఛన్ తీసుకోవాలని కోరారు.

కొనుగోళ్లకు రెడీ

ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు, జీవనదిలా మారిన వరదకాలువ, నిండుగా పారుతున్న కాకతీయ కాలువలతో యాసంగి సస్యశ్యామలమైంది. గతంతో పోలిస్తే ఈ సారి 4.19 లక్షలకు పైగా ఎకరాల్లో అదనంగా వరి సాగయింది. దిగుబడులు కూడా పుష్కలంగా వచ్చే అవకాశముండడంతో అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు కరోనా నేపథ్యంలో రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు.. ఏ ఊరిరావూరిలోనే కొనేందుకు సిద్ధమైంది. అన్నదాతలు పండించిన ప్రతి గింజనూ ఎక్కడికక్కడే కొనేందుకు సర్కారు సిద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం సూచించిన విధంగా రైతులు తమ ధాన్యాన్ని క్రమ పద్ధతిలో తేవాలని విజ్ఞప్తి చేశారు.

- కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ

తరలివచ్చిన గంగ..

ఉమ్మడి జిల్లాల్లో వ్యాప్తంగా సాగు, దిగుబడి, కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	2018-19 వరి సాగు ఎకరాల్లో	2018-19 ఉత్పత్తి టన్నుల్లో	2018-19 కొనుగోలు కేంద్రాలు	2019-20 వరి సాగు ఎకరాల్లో	2019-20 ఉత్పత్తి టన్నుల్లో	2019-20 కొనుగోలు కేంద్రాలు
కరీంనగర్	1,10,064	2,27,151	211	2,19,066	3,60,000	339
జగిత్యాల	1,24,803	3,36,618	350	2,47,733	5,94,312	380
పెద్దపల్లి	81,850	2,50,000	199	1,92,777	3,41,429	290
సిరిసిల్ల	56,125	1,00,721	173	1,33,000	3,00,000	212
మొత్తం	3,72,842	9,14,490	933	7,92,576	15,95,741	1221

- ఉమ్మడి జిల్లాల్లో భారీగా పెరిగిన సాగు విస్తీర్ణం
- గత యాసంగితో పోలిస్తే 4.19లక్షల ఎకరాలు అదనం..
- దిగుబడులూ పుష్కలంగా వచ్చే అవకాశం
- సేకరణకు సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- కరోనా నేపథ్యంలో ఊళ్లలోనే కొనేందుకు ఏర్పాట్లు
- మొత్తం 1200కుపైగా కేంద్రాలు
- త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు
- ప్రతి గింజనూ కొంటాం : మంత్రి గంగుల

ఉమ్మడి కరీంనగర్ జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి యాసంగి సీజన్‌లో ధాన్యం దిగుబడి రాబోతున్నది. అందుకు ప్రధాన కారణం ముఖ్యమంత్రి మానస పుత్రిక అయిన కాళేశ్వరం ప్రాజెక్టే. దీని ద్వారా తొలిఫలితం పొందింది. పొందుతున్నది మన ఉమ్మడి జిల్లానే. ఈ పథకం నుంచి ఇప్పటికే సుమారు 60 టీఎంసీలకుపైగా నీరు అందింది. నీటిపారుదల శాఖ అధికారులు ఓవైపు శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) రిజర్వాయర్‌కు అందిస్తూనే ఎల్ఎండీకి, అక్కడి నుంచి కాకతీయ కాలువద్వారా చివరి ఆయకట్టుకు ఎటువంటి అటంకాలూ లేకుండా నీరందించారు. అలాగే వరదకాలువను నాలుగు రిజర్వాయర్లుగా మార్చి, పంటలకు నీళ్లిచ్చారు. ఎస్సారెస్పీపై భారం తగ్గడంతో ఆ ప్రాజెక్టు పరిధిలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తున్నది.

4.19 లక్షల ఎకరాల్లో అదనంగా సాగు..

పుష్కలంగా నీళ్లు ఉండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో వరి సాగుచేశారు. 2018-19 యాసంగిలో ఉమ్మడి జిల్లాలో 3,72,842 ఎకరాల్లో సాగు కాగా, 9,14,490 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకోసం 933 కొనుగోలు కేంద్రాలను అప్పట్లో ఏర్పాటు చేశారు. కాగా, ఈ యాసంగిలో ఉమ్మడి జిల్లా చరిత్రను తిరగరాసింది. ప్రస్తుతం 7,92,756 ఎకరాల్లో వరి సాగు చేయగా, 15,95,741 మెట్రిక్ టన్నుల దాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దిగుబడి ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో ఈ సారి 1221 కొనుగోలు కేంద్రాలు.. అంటే గత యాసంగి కన్నా 288 అదనంగా ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతి గింజనూ కొంటాం - మంత్రి గంగుల కమలాకర్

కరోనా నేపథ్యంలో ప్రస్తుతం గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. అయినా రైతన్నను రాజు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే అండగా నిలువాలని భావించి ఇప్పటికే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలోనే కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. అందులో భాగంగానే అధికారులతో సమీక్షించాం. ప్రతి గ్రామంలోనూ ధాన్యం కొనుగోలుచేసే విధంగా చర్యలు తీసుకున్నాం. ఏ రైతు ఎప్పుడు తన ధాన్యాన్ని విక్రయ కేంద్రాలకు తీసుకొని రావాలన్న సమాచారం సంబంధిత వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా అందుతుంది. అధికారులు ఇచ్చే ఆదేశాలను అన్నదాతలు తూచా తప్పకుండా పాటించాలి. లేని పక్షంలో కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు వస్తాయి. కాబట్టి ప్రతి ఊరిలోనూ రైతులే కథనాయకులుగా మారి.. ఆ గ్రామంలోని ఏ రైతు ఎప్పుడు కొనుగోలు కేంద్రానికి వెళ్లాలనేది నిర్ణయం తీసుకోవాలి. అధికారులకు పూర్తిగా సహకరించాలి. వాళ్లు, వీళ్లు చెప్పిన మాటలు నమ్మద్దు. మద్దతు ధర ఇచ్చి ప్రతి గింజనూ ప్రభుత్వమే కొంటుందని స్వయంగా ముఖ్యమంత్రి పదేపదే చెప్పిన విషయం తెలిసిందే. కరోనా ఉన్న నేపథ్యంలో.. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద శానిటైజర్, సబ్బులు రెడీగా ఉంచేందుకు ఇప్పటికే అదేశాలు జారీ చేశాం. మన పంట అమ్ముకోవాలి.. అదే సమయంలో మన అందరి ఆరోగ్యం బాగుండాలంటే ప్రభుత్వ, అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

❖ కడప ముందుకే 'కల్యాణలక్ష్మి'

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న వీఆర్వో దుర్గాప్రసాద్

కరోనా నియంత్రణకు అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నది. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అవాంతరం రాకుండా ఇంటి చెంతకే ఫలాలను తీసుకువస్తున్నది. అందులో భాగంగా హుజూరాబాద్ మండల అధికారులు హుజూరాబాద్, చెల్పూర్, శాలపల్లి-ఇందిరానగర్, రాజపల్లి, రంగాపూర్ గ్రామాలకు చెందిన 12మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి లక్షా నూటపదహారు రూపాయల చొప్పున చెక్కులు అందజేశారు. సర్కారు సాయం కడప ముందుకే రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– హుజూరాబాద్ టౌన్

❖ రోడ్లన్నీ నిర్మానుష్యం

నిర్మానుష్యంగా ఉన్న కరీంనగర్ రోడ్డు

లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేస్తుండడంతో కరీం'నగర' దారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తుండడంతో శుక్రవారం రోడ్లన్నీ వెలవెలబోయి కనిపించాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరించి రోడ్లపైకి వచ్చిన సుమారు 3 వేల వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వలంటీర్ల సేవలను వినియోగించుకుంటున్నామని, వారికి ఐడీ కార్డు, విజిల్, టీషర్టులు అందజేసినట్లు పేర్కొన్నారు. వలంటీర్లకు లాక్‌డౌన్ ముగిసిన తర్వాత ప్రశంసా పత్రాలు అందిస్తామని చెప్పారు.

– కరీంనగర్ క్రైం

ఆడబిడ్డ పెళ్లికి భరోసా

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తున్నదని, కల్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నదని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. రామడుగు మండలం రుద్రారం, మోతె గ్రామాలకు చెందిన చిలుముల పోచమ్మ, దాసరి లక్ష్మికి చొప్పదండిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ₹2 లక్షల 232 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఇక్కడ సింగిల్‌విండో అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, రుద్రారం ఎంపీటీసీ గుర్రం దేవిక, తదితరులున్నారు.

పెద్దపల్లి జిల్లాలో తొలి కరోనా కేసు

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ: జిల్లాలో తొలి కరోనా కేసు నమోదైంది. ఢిల్లీ మర్కజ్ ప్రార్థనలకు వెళ్లివచ్చిన ఎన్టీపీసీకి చెందిన వ్యక్తికి పాజిటివ్ వచ్చినట్లు జిల్లా వైద్యాధికారి సుధాకర్ తెలిపారు. ఐదు రోజుల క్రితమే సదరు వ్యక్తిని, కుటుంబ సభ్యులను సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి క్వారంటైన్‌కు తరలించారు. ఇప్పుడు పాజిటివ్ రావడంతో సదరు వ్యక్తిని వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. కరోనా పాజిటివ్ అని తేలడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్టీపీసీలోని అన్నపూర్ణ కాలనీలో శానిటేషన్ పనులు ముమ్మరం చేశారు. బాధితుడు ఎవరెవరితో సన్నిహితంగా మెదిలాడో తెలుసుకుంటూ వారి కోసం జల్లెడ పడుతున్నారు.

మంత్రి కొప్పుల భరోసా

వలస కూలీలకు ఆన్‌లైన్ ద్వారా ₹1.18లక్షల సాయం

ధర్మారం: ఉపాధి కోసం ముంబైకి వెళ్లి లాక్‌డౌన్‌తో అక్కడే చిక్కుకుపోయిన ధర్మపురి నియోజవర్గవాసులకు మంత్రి ఈశ్వర్ అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపిన ఆయన, తాజాగా శుక్రవారం మరో ₹1.18 లక్షలను ఆన్‌లైన్ ద్వారా పంపించారు. ఎలాంటి కష్టం రానివ్వనంటూ వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రికి వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికులు

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి..

గొల్లపల్లి: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పెంబికి చెందిన ప్రశాంత్ కుమార్, ప్రేమలత దంపతులు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లోని బోరబండలో ఉంటున్నారు. వారి ఆరేళ్ల కూతురు తనూశ్రీ మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాలలోని తన అమ్మమ్మ ఇంటికెళ్లి, లాక్‌డౌన్‌తో అక్కడే ఉండిపోయింది. తల్లిదండ్రులపై బెంగతో చిన్నారికి జ్వరం కూడా వచ్చింది. ఈ విషయాన్ని గొల్లపల్లికి చెందిన టీఆర్ఎస్ నాయకుడు చౌటపల్లి తిరుపతికి విషయం తెలుపగా, మంత్రి కొప్పుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి పాపను తీసుకెళ్లేందుకు వాహనానికి అనుమతి ఇప్పించారు. దీంతో తల్లిదండ్రులు హైదరాబాద్ నుంచి వచ్చి తనూశ్రీని తీసుకెళ్లారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

జగిత్యాల రూరల్/సారంగాపూర్ : రైతులకు ఇబ్బందులు కలుగకుండా మక్కల కొనుగోళ్లు చేపడతామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల మండలం చల్‌గల్‌లో, సారంగాపూర్ మండలం రేచపల్లిలో మక్కల కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు ప్రారంభించారు. రైతులంతా ఒక్కసారే కేంద్రాలకు ధాన్యాన్ని తేవద్దని, టార్పాలిన్ కవర్లను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. కరోనా వైరస్ కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతినడంతో మక్కల ధర పడిపోయిందని చెప్పారు. ఏ ఒక్క రైతుకూడా నష్టపోవద్దనే ఉద్దేశంతో క్వింటాల్ మక్కలకు ప్రభుత్వం ₹1760 మద్దతు ధర అందిస్తున్నదన్నారు. అనంతరం జగిత్యాల మండలం చల్‌గల్ శివారు మ్యాంగో మార్కెట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గాజర్ల గంగారాం గౌడ్, జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్‌రావు, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రావు, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : కాంటాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వద్దు : కలెక్టర్ శశాంక

కరీంనగర్ హెల్త్ : డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా జలుబు, ఒళ్లు నొప్పులు, వంటి వాటికి యాంటీబయాటిక్స్ మందులు అమ్మవద్దని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ మేరకు ఆయన అధ్యక్షతన డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్, కరీంనగర్ పట్టణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో అమ్మితే దాని కాపీ, సేల్ బిల్లు, కాపీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. మందులు అమ్మే సమయంలో ఎవరికైనా కొవిడ్-19 లక్షణాలు కనిపిస్తే తక్షణమే జిల్లా కంట్రోల్ సెంటర్ నంబర్ 0878-22347331/32, 104ను సంప్రదించాలని సూచించారు. మందుల కోసం వచ్చే రోగులు, షాపుల యజమానుల మధ్య సోషల్ డిస్టెన్స్ మెయింటేన్ చేయించాలని సూచించారు. జిల్లా కార్యాలయం ద్వారా పంపిన పోస్టర్స్ (ప్రివెంటివ్ మెజర్స్) షాపు బయట అతికించాలని, ప్రజలకు అవగాహన కోసం ఉపయోగపడుతుందన్నారు. మెడికల్ షాపులో శానిటైజర్స్, సబ్బు, నీళ్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ నార్ల సురేశ్‌కుమార్, సెక్రెటరీ మునీందర్, నార్ల శ్రీనివాస్, కోశాధికారి తదితరులున్నారు.

కరోనా నివారణకు ₹లక్ష విరాళం

కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న డాక్టర్ బీఎన్‌రావు

కరీంనగర్ హెల్త్ : సీనియర్ వైద్యుడు బీఎన్‌రావు ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు కరీంనగర్ కలెక్టర్‌ను చాంబర్‌లో కలిసి కలెక్టర్ శశాంకకు చెక్కును అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని బీఎన్ రావు కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రామకృష్ణారావు, డాక్టర్ నరేశ్, డాక్టర్ వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కారు.. పల్లెల్లో పరేషాన్

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఓ కారు పరేషాన్ చేసింది. ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ కారు (డీఎల్ 4సీ ఎన్ఏ 4721)లో ఓ వర్గం శుక్రవారం ఉదయం 8.03 గంటలకు దుర్శేడ్‌కు వచ్చింది. అక్కడి హెల్త్ సబ్ సెంటర్ నుంచి నల్లగుంటపల్లి, చేగుర్తి వైపు వెళ్తూ తప్పడు అడ్రస్ అడిగారని గ్రామస్తులు తెలిపారు. అనుమానాస్పదంగా తిరగడంతో భయాందోళన చెందారు. తర్వాత సీసీ కెమెరాల ఫుటేజ్‌ల్లో కారును గుర్తించారు. ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆ కారులో గ్రామానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు తిరగడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వచ్చింది కరోనా బాధితులేమోనని పలువురుఆందోళన చెందుతున్నారు. ఆ కారు రిజిస్ట్రేషన్ ఆధారంగా వెతకగా, ఓనర్ పేరు లేకపోవడం, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో ₹1400 ఫైన్ ఉన్నట్లు బయట పడింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా, దీనిపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

దుర్శేడ్‌లో తిరిగిన కారు ఇదే

పకడ్బందీగా కొనుగోళ్లు చేయాలి : కలెక్టర్ రవి

జగిత్యాల : పొలాస క్వారంటైన్ సెంటర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి

జగిత్యాల ప్రతినిధి/ జగిత్యాల, నమస్తే తెలంగాణ/ కొడిమ్యాల : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ గుగులోతు రవి అన్నారు. కొనుగోలు కేంద్రాలపై వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల్లో చేస్తున్న ఏర్పాట్ల వివరాలను ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాల, కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద సమస్యలు తెలుసుకున్నారు. క్వారంటైన్‌లోఉన్న వారికి బయటి ఆహార పదార్థాలను ఇవ్వవద్దని, క్వారంటైన్‌లోనే ప్రత్యేకంగా చేసి అందించాలని సూచించారు. ఢిల్లీకి వెళ్లొచ్చిన వారిలో 35మంది జేఎన్టీయూ సెంటర్‌లో ఉన్నారని, పొలాస వ్యవసాయ కళాశాలలో 29 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాజేశం, డీఏవో సురేశ్, డీఎంహెచ్‌వో శ్రీధర్, ఆర్డీవో ఘంటా నరేందర్, డాక్టర్ జైపాల్ రెడ్డి, తాసిల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో రమేశ్, వైద్యాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

మోటర్ మరమ్మతు చేస్తూ మృత్యుఒడికి..

ధర్మపురిరూరల్: బూరుగుపల్లికి చెందిన కంది శేఖర్ (30) శుక్రవారం ఇంటి వద్ద చేదబావిలో కరెంట్ మోటర్‌కు మరమ్మతులు చేశాడు. ఈ క్రమంలోనే మోటర్‌కు విద్యుత్ సరాఫరా అయి షాక్ తగిలి తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబీకులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. అతడి తమ్ముడు చందు సైతం ప్రమాదంలో గాయపడ్డాడు. శేఖర్ అన్న, సర్పంచ్ తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపాడు.

26 మంది క్వారంటైన్‌కు తరలింపు

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ: హుజూరాబాద్‌కు చెందిన ఇద్దరికి కరోనా వైరస్ సోకినట్లు తేలగా, వారి కుటుంబ సభ్యులు ఏడుగురిని అధికారులు గురువారం కరీంనగర్‌లోని క్వారంటైన్ సెంటర్‌కు తరలించిన విషయం తెలిసిందే. ముందు జాగ్రత్తగా వారితో సన్నిహితంగా మెలిగిన మరో 26 మందినీ శుక్రవారం క్వారంటైన్‌కు తీసుకెళ్లారు. వారందరికీ పరీక్షలు చేయడంతో పాటు 14రోజులు పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు తాసిల్దార్ బావుసింగ్ తెలిపారు.

24 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

కోనరావుపేటలో లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న జడ్పీ అధ్యక్షురాలు అరుణ

కోనరావుపేట: కోనరావుపేట మండలంలోని 12గ్రామాలకు చెందిన 24 మందికి సీఎంఆర్ఎఫ్ కింద ₹4లక్షల65వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు మండల కేంద్రంలో జడ్పీ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు చొరవతో ఆపదవేళ కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేశారని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్

బైక్‌లో పెట్రోల్ పోస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బాపురావు, డైరెక్టర్లు

ముస్తాబాద్: పోతుగల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ముస్తాబాద్ మండలం గూడెం– ఆవునూర్ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన డీజిల్, పెట్రోల్ బంక్‌ను సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు, పాలక మండలి సభ్యులు శుక్రవారం ప్రారంభించారు. బంక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజేశంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

తప్పుడు పోస్ట్ పెట్టిన ఒకరిపై కేసు

కొడిమ్యాల: గంగాధర మండలం మంగపేటకు చెందిన లింగాల సత్యనారాయణ కొడిమ్యాల మండలం తుర్కాశీనగర్‌లో ముగ్గురికి కరోనా పాజిటివ్ వచ్చిందని ఓ వాట్సాప్ గ్రూప్‌లో తప్పుడు పోస్ట్ పెట్టాడు. దీనిపై సర్పంచ్ సయ్యద్ హైదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

'భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి'

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 724/డీ లో 4 ఎకరాల 20 గంటల భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని, వెంటనే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నలుమాచు కొండయ్య కూతురు అంజని జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. దివంగత మాజీ ఎమ్మెల్యే అయిన తమ తండ్రి నలుమాచు కొండయ్యకు బొమ్మకల్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 724/డీ లో 4.20 ఎకరాల భూమి ఉన్నదని, 2009లో ఆయన మరణించిన తర్వాత ఆ భూమి తను, తన చెల్లి జ్యోతి కబ్జాలో ఉన్నదని తెలిపారు. ఆ భూమికి సంబంధించిన రికార్డులన్నీ తమ పేరుపైనే ఉన్నాయని, ఆ సర్వేనంబర్‌కు ఆనుకొని ఉన్న మరో సర్వే నంబర్‌కు చెందిన కొందరు భూమి అమ్మాలంటూ కొన్నాళ్లుగా తమపై ఒత్తిడి తెస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తమకు భూమి విక్రయించడం ఇష్టం లేదని చెప్పగా.. అమ్మకపోతే ఆక్రమించుకుంటామని రెండు మూడుసార్లు హెచ్చరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము విక్రయించడానికి నిరాకరించడంతో కొందరు మాఫియాగా ఏర్పడి.. తమ భూమిని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం కరోనా పరిస్థితుల నేపథ్యంలో తాము భూమి వద్దకు వెళ్లలేకపోయామని, ఈ పరిస్థితులను భూ కబ్జాదారులు ఆసరా చేసుకొని తమ భూమిని అక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూమి ఆక్రమించుకోవడం మొదటి తప్పు కాగా.. లాక్‌డౌన్ ఉన్న పరిస్థితుల్లో కూలీలను పెట్టి పనులు చేయించడం.. వారి తెగింపునకు నిదర్శనమని, అందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు కూడా వాట్సాప్‌ద్వారా పంపుతున్నట్లు తెలిపారు. సదరు భూ కబ్జాదారుల నుంచి తమకు ప్రాణ రక్షణ కల్పించడంతోపాటు.. తమ భూమిని కాపాడాలని కోరారు. ఒక మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన భూమినే కబ్జా చేస్తున్నారంటే.. ల్యాండ్ మాఫియా ఎంత దూరం వెళ్తుందో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోఖాపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

పేదలకు బాసట

లాక్‌డౌన్ నేపథ్యంలో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన పేదలు, వలస కూలీలకు దాతలు బాసటగా నిలుస్తున్నారు. నిత్యావసర సరుకులను అందజేస్తూ అండగా ఉంటున్నారు. మరికొందరు అన్నదానం చేస్తూ వారి కడుపు నింపుతున్నారు.

సిరిసిల్ల టౌన్ : పేదలకు కూరగాయలు పంపిణీచేస్తున్న పట్టణ సీఐ వెంకటనర్సయ్య

ఆపన్నహస్తం అందిస్తున్న దాతలు

కరీంనగర్ జిల్లా..

చొప్పదండి, నమస్తేతెలంగాణ/ కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్ టౌన్/ సైదాపూర్/ శంకరపట్నం/ గన్నేరువరం/ మానకొండూర్‌రూరల్ : చొప్పదండిలోని డాంబర్ ప్లాంట్‌లో పని చేస్తున్న 8 మంది వలస కూలీలకు మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ ఒక్కొక్కరికీ 12 కిలోల బియ్యం, ₹500 చొప్పున నగదు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు సందీప్ పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, కొలిమికుంటలో పలువురు మహిళలకు సర్పంచ్ సుజాత ₹500 చొప్పున పంపిణీ చేశారు. రేవెల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సర్పంచ్ లింగమ్మ, నాయకులు పాలాభిషేకం చేశారు. కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలో మాజీ సర్పంచ్ కిష్టయ్య, టీఆర్ఎస్ నాయకుడు సాగర్ వంద కుటుంబాలకు, కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో వలస కూలీలకు బియ్యం, నిత్యావసర సరుకులను సర్పంచ్ శాంత శ్రీనివాస్ పంపిణీ చేశారు. హుజూరాబాద్‌లో టౌన్ సీఐ మాధవి ఆధ్వర్యంలో 40 మంది పోలీసు వలంటీర్లను నియమించగా, వారికి ఏసీపీ ఎస్ శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా టీషర్టులు, విజిల్స్ అందజేశారు. బల్దియా పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ ఆధ్వర్యంలో మాస్కులు, శానిటైజర్లను ఆర్డీవో బెన్ షాలోం, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్‌పర్సన్ నిర్మల చేతుల మీదుగా పంపిణీ చేశారు. హుజూరాబాద్, జమ్మికుంటకు చెందిన పాత్రికేయులు, పోలీసులకు సుమారు 500 మాస్కులు, శానిటైజర్లు, గ్లౌజులను టీడీపీ కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు జోజిరెడ్డి ఏసీపీ శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా అందజేశారు. సైదాపూర్ మండలం దుద్దనపల్లిలో నిరుపేదలకు బియ్యం, పప్పు, నూనె, తదితర వస్తువులతోపాటు కూరగాయలను సర్పంచ్ యుగేంధర్‌రెడ్డి, శంకరపట్నం మండలం లింగాపూర్‌లోని ఓ క్వారీలో పని చేస్తున్న వలస కార్మికులకు బీజేపీ నాయకులు బియ్యం, గోధుమ పిండి, కూరగాయలు, నిత్యావసర సరుకులు, గన్నేరువరంలోని వలస కూలీలకు నిత్యావసర సరుకులను దాతల సాయంతో ఎస్ఐ తిరుపతి, మానకొండూర్ మండలం గంగిపల్లిలో 150 మాస్కులను గంగిపల్లి యూత్ సభ్యులు పంపిణీ చేశారు.

జగిత్యాల జిల్లా..

జగిత్యాల/ధర్మపురి/మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ/ కోరుట్లటౌన్/ కొడిమ్యాల/ మల్యాల/సారంగాపూర్/కథలాపూర్/మేడిపల్లి/జగిత్యాల అర్బన్/మల్లాపూర్/జగిత్యాల టౌన్/జగిత్యాల టవర్‌సర్కిల్/జగిత్యాల రూరల్ : జగిత్యాల మండలం చల్‌గల్ శివారు మ్యాంగో మార్కెట్ ఆవరణలో 29మంది బీహార్ వలస కూలీలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బియ్యం, నగదును అందజేశారు. అయ్యప్ప భజన మండలి ఆధ్వర్యంలో 132మందికి 12రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు జగిత్యాల వస్త్ర వ్యాపార సంఘం తరపున రోజూ 300 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని బల్దియా అధ్యక్షురాలు శ్రావణి ప్రారంభించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశానుసారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో వైద్యశాలలో రోగులు, వారి బంధువులకు అన్నదానం చేశారు. కమిషనర్ జయంత్ కుమార్ రెడ్డి, వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాంగోపాల్, శ్రీనివాస్, డీఈ లచ్చిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, జాగృతి నేతలు రాజేందర్, జమున, శేఖర్, సందీప్ పాల్గొన్నారు. ధర్మపురిలో వలసకూలీలకు, యాచకులకు ఎల్ఎమ్ కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, సాయంత్రం భోజనాన్ని అందించారు. జడ్పీటీసీలు రాజేందర్, అరుణ, మున్సిపల్ అధ్యక్షురాలు సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ సునీల్ పాల్గొన్నారు. మెట్‌పల్లి 4వ వార్డు బీజేపీ ఇన్‌చార్జి గంగాధర్ కూలీలకు భోజనం, కూరగాయలను అందజేశారు. కొడిమ్యాల మండలం పూడూర్ సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి కూరగాయలు పంపిణీ చేశారు. మల్యాల మండలం కొండగట్టు దేవస్థానం ఆవరణలో రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వలస కార్మికులు, యాచకులకు అన్నదానం చేశారు. సర్పం చ్ తిరుపతి రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు. మద్దుట్లలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ మల్లమ్మ పండ్లు పంపిణీ చేశారు. బీర్‌పూర్ మండల కేంద్రం మీదుగా కాలినడకన మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న వలస కూలీలకు గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు ఆహారం అందించారు. ట్రాక్టర్‌లో వారిని కమ్మునూర్ కలమడుగు బ్రిడ్జి దాకా చేర్చారు. నర్సింహులపల్లిలో సర్పంచ్ ప్రభాకర్ 30మంది నిరుపేదలకు, కథలాపూర్ మండలం పెగ్గెర్లలో వలస కూలీలకు భూషణ రావుపేట యువకులు సరుకులు పంపిణీ చేశారు. సిరికొండలో రుద్రసేన యూత్ సభ్యులు 150 కిలోల బియ్యం, సరుకులు అందించారు. మేడిపల్లిలో మాజీ సర్పంచ్ రాజాగౌడ్ అన్నదానం చేశారు. జగిత్యాలకు చెందిన అడమాల ప్రకాశ్, పద్మ దంపతులు అన్నదాన ఖర్చులు అందించారు. గోవిందారంలో వలస కార్మికులకు సర్పంచ్ మధుకర్ అన్నదానం చేశారు. జగిత్యాల 14వ వార్డులో వలస కూలీలకు బియ్యం, నగదును కౌన్సిలర్ పద్మ, ఆర్ఐ రాజేశ్ అందించారు. మండలంలోని నర్సింగాపూర్‌లో ఒంటరిగా ఉన్న వృద్ధుడు లక్ష్మీనారాయణను హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంగాధర్ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమానికి తరలించారు. మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌లో ఎన్ఆర్ఐ వీరబత్తిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రవీందర్, సిబ్బంది బీజేపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ మాస్కులు, శానిటైజర్లను అందించారు. జిల్లా కేంద్రంలోని వాణినగర్ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దవాఖానలో అన్నదానం, రాంబజార్ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య సిబ్బందికి అల్పాహారం పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు జగదీశ్, శ్రీకాంత్, సంఘం అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు. కోరుట్ల కొత్త బస్టాండ్ ఆవరణలో రమేశ్, రవీందర్, శ్రీధర్, మహేందర్, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 500 మాస్కులను మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, సీఐ రాజశేఖర్‌రాజు, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అనిల్ పట్టణవాసులకు పంపిణీ చేశారు. వలసకార్మిక కుటుంబాలకు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను, 12వ వార్డులో నిరుపేదలకు కౌన్సిలర్ అలేఖ్య మురళి దంపతులు నాలుగు క్వింటాళ్ల బియ్యం, సరుకులను అందజేశారు. హాజీపురా కాలనీలో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో పేదలకు మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో యాచకులు, వలస కూలీలకు భారతి పిల్లల హాస్పిటల్ వైద్యుడు శ్రీనివాస్, కనకదుర్గా సే వా సమితి సభ్యులు అన్నదానం చేయగా, మహేందర్, శ్రీనివాస్, నిరంజన్, నాగభూషణం, ఆంజనేయులు, అనిల్, సిరిపురం హరీశ్, అరుణ్ పాల్గొన్నారు.

సిరిసిల్ల జిల్లా..

సిరిసిల్ల టౌన్/ రుద్రంగి/ ఎల్లారెడ్డిపేట/చందుర్తి/కోనరావుపేట/ సిరిసిల్ల రూరల్: సిరిసిల్లలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూలీలకు మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ, డీఎస్పీ చంద్రశేఖర్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులను అందజేశారు. మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ సహకారంతో స్థానిక శాంతినగర్‌లో 2వేల మందికి కూరగాయ లను పట్టణ సీఐ వెంకటనర్సయ్య పంపిణీ చేశారు. పోలీసులు, పేదలకు పులిహోర ప్యాకెట్లను కర్త ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. చందుర్తి మండలం మూడపల్లిలోని నిరుపేద కుటుంబాలకు దాతల సహాయంతో బియ్యం, నిత్యావసర సరుకులను ఎస్ఐ సునీల్, తాసిల్దార్ నరేశ్, ఎంపీడీవో రవీందర్, సర్పంచ్ చిలుక అంజిబాబు పంపిణీ చేశారు. కోనరావుపేటకు చెందిన పొన్నం శంకరవ్వకు ₹5వేలు, పొన్నం రుక్మవ్వ కుటుంబానికి 60కిలోల బియ్యంతో పాటు ₹వెయ్యి నగదును ఉపసర్పంచ్ శ్రీనివాస్ అందించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన పవర్‌యూత్ సభ్యులు మండల కేంద్రంలోని వలసకూలీలకు అన్నదానం చేశారు. తిమ్మాపూర్‌లోని వలస కూలీలు, సంచార జాతుల వారి కోసం పలువురు దాతలు బియ్యం పంపిణీ చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని 20 మంది వలసకూలీలకు టీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు ఉప్పులూటి గణేశ్ జడ్పీటీసీ గట్ల మీనయ్యతో కలిసి బియ్యం, నిత్యావసరాలు అందించారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు పిలుపు మేరకు చందుర్తి మండలం జోగాపూర్ గ్రామం బబ్బిలివాళ్ల కాలనీలో పేదలకు మూడపల్లికి చెందిన యువకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, సర్పంచ్‌లు అంజిబాబు, మ్యాకల పరశురాములు తదితరులు పాల్గొన్నారు. తంగళ్లపల్లి మండలంలోని వంద మంది వలస కూలీలలకు పూర్ణిమ స్వచ్ఛంద సహకారంతో ఎంపీపీ మానస, ఎస్ఐ అభిలాష్ అన్నదానం చేశారు.

హుజూరాబాద్‌టౌన్: పారిశుధ్య కార్మికులకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేస్తున్న ఆర్డీవో బెన్ షాలోం, చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ నిర్మల

❖ ఇంటికే రేషన్

ధర్మారంలో ఇంటికే తీసుకెళ్లి బియ్యాన్ని అందజేస్తున్న జీపీ పాలకవర్గం సభ్యులు

ధర్మారం గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకున్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం పేదలకు అందజేసిన ఉచిత బియ్యాన్ని నేరుగా కార్డుదారుల ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నది. వార్డు సభ్యులు బాధ్యతగా తీసుకొని తమ తమ వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి బియ్యాన్ని అందించారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని సూచించారు.

– కోనారావుపేట

లైట్లు మాత్రమే ఆర్పివేయాలి

టవర్ సర్కిల్: ఈనెల 5న రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు క్యాండిల్స్ వెలిగించి, లైట్లు ఆర్పి వేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే ఒకేసారి అన్ని విద్యుత్ ఉపకరణాలు నిలిపి వేయడంతో గ్రిడ్‌లో అన్‌బ్యాలెన్స్ ఏర్పడి సాంకేతిక సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం లైట్లు మాత్రమే ఆర్పివేయాలని, మిగతా ఉపకరణాలకు విద్యుత్ వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బిక్కవాగుకు కాళేశ్వరం జలాలు..

ఇల్లంతకుంట: శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి పొత్తూరు వరకు సాగు భూములను తడిపేందుకు రాష్ట్ర సర్కారు డీ3 కాలువను నిర్మించింది. అందులో భాగంగా వంతడుపుల శివారులోని బిక్కవాగు వద్ద లింకు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పంటలు కోత దశకు చేరుకోగా, సాగునీరు లేక ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి అధికారులతో మాట్లాడారు. ఎస్సారార్ నుంచి నర్సక్కపేట గ్రామ శివారులోని బిక్కవాగులోకి నీటిని విడుదల చేయించారు. ఎమ్మెల్యేతోపాటు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సెస్ డైరెక్టర్ ఐల్లయ్యకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

❖ శక్తిమాన్.. శానిటైజేషన్

శక్తిమాన్ వాహనంతో టీఆర్ఎస్ నాయకులు

టీఆర్ఎస్ రాష్ట్ర నేత జోగినపల్లి రవీందర్‌రావు విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు రెండు శక్తిమాన్ (ప్రొటెక్టర్ 600) వాహనాలను యూపీఎల్ కంపెనీ అందించేలా కృషి చేశారు. అందులో ఒక వాహనంతో బోయినపల్లి మండలం కొదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీలో శానిటైజర్‌ను పిచికారీ చేశారు. దీంతో రవీందర్‌రావుకు నేతలు కొండయ్య, రమేశ్, నాగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

– బోయినపల్లి

పెద్దమనసు..

ప్రభుత్వానికి అండగా విరాళాలు

కొవిడ్–19 వ్యాప్తిని అరికట్టేందుకు దాతలు తమవంతుగా కృషి చేస్తున్నారు. స్వతహాగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి అండగా నిలుస్తున్నారు. తమకు తోచినంతా విరాళాలు ప్రకటించి, పెద్ద మనసును చాటుకుంటున్నారు.

కరీంనగర్‌లో ఎంపీకి చెక్కు అందజేస్తున్న డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్

కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/ సుభాష్‌నగర్/ కరీంనగర్ హెల్త్ : కరీంనగర్ జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరి రవి, ప్రధాన కార్యదర్శి అనసూరి వేణు, ప్రతినిధులు, సభ్యులు శుక్రవారం కలెక్టర్ శశాంకకు ₹63,677 విలువైన చెక్కు విరాళంగా అందజేశారు. ప్రధాన మంత్రి సహాయ నిధికి నగరంలోని పుల్లెల దవాఖాన చైర్మన్ పుల్లెల పవన్‌కుమార్ ₹లక్షా 116 చెక్కును, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుస్స శ్రీనివాస్ ₹50,116 చెక్కును ఎంపీ బండి సంజయ్‌కి అందజేశారు. నగరంలోని అపూర్వ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పీ వేణు ₹25 వేల చెక్కును కలెక్టర్ శశాంకకు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఇదే విధంగా ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం అందించాలని అండగా నిలవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

జగిత్యాల జిల్లా..

జగిత్యాల రూరల్/మెట్‌పల్లి రూరల్/ కథలాపూర్/మేడిపల్లి : జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్‌లో బీహార్ వలస కూలీలకు ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో అడ్డీ ఖరీదుదారుల సంఘం తరపున ₹20వేల నగదు, సంఘం అధ్యక్షుడు చిక్కుల భూమయ్య ఒక్కరోజు భోజనం అందించారు. సమిండ్ల శ్రీనివాస్, భిక్షపతి, నర్సయ్య, కిషన్, గురువయ్య, చందు పాల్గొన్నారు. సీఎంఆర్ఎఫ్‌కు బీజేపీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ₹21వేలు పంపినట్లు పార్టీ మండలాక్షుడు కంటె సత్యనారాయణ తెలిపారు. మేడిపల్లి మండలం రాగోజిపేట జీపీకి శానిటేషన్ కోసం వెంకట్రావుపేటకు చెందిన పత్రి గణేష్ ₹5వేలు, వేముల చిన్న రాజం ₹5వేలు, పొన్నం సంతోష్ ₹2వేలు, దుబాయిలో ఉంటున్న గ్రామ యువకులు ₹40వేలు సర్పంచ్ బాలుసాని లహరికకు అందజేశారు. మెట్‌పల్లి మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ, 23 గ్రామాల సర్పంచులు, 11 మంది ఎంపీటీసీలు మొత్తం ₹1.90 లక్షల విరాళం ప్రకటించారు. ఎంపీపీ మారు సాయిరెడ్డి ₹10 వేలు, జడ్పీటీసీ కాటిపెల్లి రాధాశ్రీనివాస్ ₹10వేలు, సర్పంచులు ఆకుల రాజరెడ్డి, బద్దం శేఖర్, పీసు తిరుపతి, చౌట్‌పల్లి లావణ్య, జరుపుల శ్రీనివాస్, జంగిటి అంజయ్య, నల్ల యమున, గుగ్లావత్ జమున, గడ్డం లింగారెడ్డి, బద్దం సుగుణ, గజ్జెల నరేశ్, చొప్పరి గంగు, ఆరెళ్ల లక్ష్మి, పటేరి సత్యనారాయణ, మ్యాకల అర్చన, గుగ్లావత్ శంకర్‌నాయక్, కోరెపు శ్యామల, ఆకుల రాజగంగు, జరుపుల బుజ్జి, కోరెపు రవి, కాట శ్రీధర్, గూడూరు రజిని, ఎగుర్ల లక్ష్మి నెలవేతనం ₹5వేల చొప్పున, ఎంపీటీసీలు పాక లత, తుమ్మల పుష్ప, జరుపుల రజిత, పోతుగంటి రాజేందర్, అంకం స్వప్న, గుండెల నగేశ్, సదిరం లక్ష్మి, తేలుకంటి శంకరయ్య, నోముల గంగాధర్, పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యుడు అనిరెడ్డి మారుతి నెల వేతనం ₹5వేల చొప్పున విరాళం ఇచ్చారు. మొత్తం ₹1.90లక్షలను సీఎంఆర్ఎఫ్ పేర డీడీ తీసి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు అందజేశారు.

సిరిసిల్ల జిల్లా..

కలెక్టరేట్/ముస్తాబాద్: వేములవాడకు చెందిన చీకోటి శ్రీహరి, విమల దంపతులు తమ కుటుంబీకులతో కలిసి ₹లక్ష చెక్కును క

సెన్సెక్స్ 27,591 674 | నిఫ్టీ 8,084 170

వాణిజ్య

వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

ఫారం ధర	72.00	రిటైల్ లైవ్	94.00
డ్రెస్‌డ్	136.00	స్కిన్‌లెస్	155.00

గుడ్ల ధరలు (వందకు)

హైదరాబాద్	335.00	వరంగల్	338.00
మెదక్	335.00	కరీంనగర్	338.00
రంగారెడ్డి	335.00	డజన్ ధర	54.00

డాలర్ @ రూ.76

53 పైసలు పడిపోయిన మారకం • ఆల్‌టైం కనిష్ఠ స్థాయికి విలువ

ముంబై, ఏప్రిల్ 3: దేశీయ కరెన్సీ గుబులురేపుతున్నది. రోజురోజుకు బక్కచిక్కుతున్న మారకం విలువ మరో చారిత్రక కనిష్ఠ స్థాయి 76కి జారుకున్నది. శుక్రవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరో 53 పైసలు పతనం చెంది 76.13కి జారుకుంది. భారత్‌లో కరోనా వైరస్ భారిన పడినవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటం, ఈక్విటీ మార్కెట్లు కుదేలవడంతో మారకం విలువ పతనానికి ఆజ్యంపోసిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్ బలోపేతం కావడం ఇతర కరెన్సీలు కుదేలయ్యాయి. వారాంతం ట్రేడింగ్‌లో 75.97 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు చివరకు 53 పైసలు పడిపోయింది. వరుసగా రెండు రోజుల తర్వాత ఆరంభమైన ఫారెక్స్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. కరోనా వైరస్‌తో ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది మరణిస్తుండటం, మరోవైపు ప్రపంచ దేశాలను ఆర్థిక మాం ద్యం చుట్టుముట్టనున్నట్లు వచ్చిన సంకేతాలు ఈక్విటీలతోపాటు కరెన్సీ మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నాయి. ఈవారంలో కరెన్సీ 124 పైసలు పడిపోయింది.

డెబిట్, కరెన్సీ మార్కెట్ల సమయం కుదింపు

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా ఈ నెల 7 నుంచి డెబిట్, కరెన్సీ మార్కెట్ల ట్రేడింగ్ సమయాన్ని తగ్గించినట్లు రిజర్వు బ్యాంక్ ప్రకటించింది. ఈ నెల 7 నుంచి 17 వరకు ఈ రెండు మార్కెట్లు ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. లాక్‌డౌన్ కారణంగా ఆర్థిక సేవల మార్కెట్లపై పడుతున్న ప్రతికూల ప్రభావంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జారీ చేసిన సర్క్యూలర్‌లో పేర్కొంది.

28 వేల దిగువకు సెన్సెక్స్

674 పాయింట్లు క్షీణించి సూచీ • పడేసిన బ్యాంకింగ్ రంగ షేర్లు

రెండు రోజుల్లో రూ.5 లక్షల కోట్లు ఆవిరి



ముంబై, ఏప్రిల్ 3: స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. రోజు రోజుకు విస్తరిస్తున్న కరోనా వైరస్‌తో దేశ ఆర్థిక వ్యవస్థపై అనిశ్చిత పరిస్థితి నెలకొనడం మార్కెట్ల పతనానికి కారణమయ్యాయి. మరోవైపు ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడం, రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోవడం మార్కెట్ల పతనానికి ఆజ్యంపోశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు దలాల్‌స్ట్రీట్ వర్గాల్లో ఆందోళనను పెంచింది. ఫలితంగా వారాంతం ట్రేడింగ్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 28 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 27,500 పాయింట్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన సూచీ చివరకు 674.36 పాయింట్లు(2.39 శాతం) నష్టపోయి 27,590.95 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 170 పాయింట్లు(2.06 శాతం) తగ్గి 8,083.80 వద్ద పరిమితమైంది. వరుసగా రెండు రోజుల్లో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 4,82,034.63 కోట్లు పడిపోయా రూ.1,08,66,722.96 కోట్లకు పరిమితమైంది. ఈ వారంలో సెన్సెక్స్ 2,224.64 పాయింట్లు(7.46 శాతం), నిఫ్టీ 576.45 పాయింట్లు(6.65 శాతం) పతనం చెందాయి. దేశీయ బ్యాంకింగ్ వృద్ధిపై గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఆందోళన వ్యక్తం చేయడం మార్కెట్లలో అలజడి సృష్టించింది. ఆర్బీఎల్ బ్యాంక్ 15 శాతం పడిపోగా, యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 9 శాతం పడిపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 8.49 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 8 శాతం, ఎస్బీఐ 5.92 శాతం, సిటీ యూనియన్ బ్యాంక్ 3.67 శాతం, ఫెడరల్ బ్యాంక్ 3.51 శాతం, కొటక్ మహీంద్రా బ్యాంక్ 2 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95 శాతం పతనం చెందాయి. మరోవైపు సన్ ఫార్మా, ఐటీసీ, ఓఎన్‌జీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రాల షేర్లు లాభాల్లో ముగిశాయి.

డేంజర్ బెల్స్

జీడీపీపై అంచనాలు (శాతంలో)

ఫిచ్ రేటింగ్స్	2
మూడీస్	2.5
ఎస్‌అండ్‌పీ	3.5
ఇండియా రేటింగ్స్	3.6
ఏడీబీ	4

దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం

- వృద్ధిరేటు 30 ఏండ్ల కనిష్ఠానికి తగ్గే అవకాశం
- ఈ ఏడాది 2 శాతంలోపే ఉండొచ్చన్న ఫిచ్
- 4 శాతానికి పరిమితమవుతుందన్న ఏడీబీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: ఆర్థికమాంద్యంతో అల్లాడుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ కరోనా కాటుతో మరింత దిగజారనున్నదా? ఈ ప్రశ్నకు వివిధ వర్గాల నుంచి అవునన్న సమాధానమే వస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో దేశ ఆర్థిక వృద్ధిరేటు 30 ఏండ్ల కనిష్ఠానికి పతనమవుతుందని ప్రముఖ రేటింగ్ సంస్థ 'ఫిచ్' అభిప్రాయపడింది. ఈ ఏడాది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 5.1 శాతంగా నమోదవుతుందని 'ఫిచ్' గతంలో అంచనా వేసింది. కానీ ఓవైపు ప్రపంచవ్యాప్తంగా మాంద్యం కొనసాగుతుండటం, మరోవైపు కొవిడ్-19 వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో తమ అంచనాను కుదిస్తున్నామని, ఈ ఏడాది భారత జీడీపీ వృద్ధిరేటు 2 శాతంలోపే ఉండవచ్చని 'ఫిచ్' శుక్రవారం వెల్లడించింది. 'కరోనా వైరస్ వ్యాప్తితో ఇటీవల చైనాలో పలు పరిశ్రమలు మూతపడటంతో భారత్‌తోపాటు వివిధ దేశాల్లోని మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలకు ముడిసరుకులు, విడిభాగాల సరఫరాలు ఆగిపోయాయి. ప్రస్తుతం చైనాలోని వివిధ పరిశ్రమల్లో మళ్లీ పనులు ప్రారంభమైనప్పటికీ కరోనా వైరస్ వ్యాప్తి ఉద్ధృతమవడంతో ఆ ప్రభావం భారత్ ఎగుమతులను, కొనుగోలు శక్తిని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటుపై మా అంచనాను 5.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం. భారత్‌లో గత 30 ఏండ్లలో ఇదే అతితక్కువ వృద్ధిరేటుగా నిలుస్తుంది' అని 'ఫిచ్' శుక్రవారం ఓ ప్రకటనలో వివరించింది. 2020-21లో భారత జీడీపీ వృద్ధిరేటు 5.1 శాతంగా ఉంటుందని 'ఫిచ్' గత నెల 20న అంచనా వేసింది. ఇది గతేడాది డిసెంబర్‌లో 'ఫిచ్' అంచనా వేసిన 5.6 శాతం వృద్ధిరేటు కంటే 0.5 శాతం తక్కువ.

ఏడీబీ అంచనాలో భారీ కోత

ఈ ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధిరేటు 4 శాతానికి క్షీణిస్తుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) అభిప్రాయపడింది. ప్రస్తుతం కొవిడ్-19 వ్యాప్తి వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య అత్యవసర పరిస్థితి (హెల్త్ ఎమర్జెన్సీ) నెలకొన్న నేపథ్యంలో ఏడీబీ ఈ అంచనా వేసింది. అయితే స్థూల ఆర్థిక పునాదులు బలంగా ఉండటంతో 2021-22లో భారత వృద్ధిరేటు పుంజుకొంటుందని ఏడీబీ తన 'ఆసియా డెవలప్‌మెంట్ అవుట్‌లుక్'లో పేర్కొన్నది. గత ఆర్థిక సంవత్సరం (2019-20)లో భారత జీడీపీ వృద్ధిరేటు 5 శాతంగా నమోదవుతుందని జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్వో) అంచనా వేసింది. 'ప్రస్తుతం మనం అసాధారణ సవాళ్లతో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. కొవిడ్-19 మహమ్మారి ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేయడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా అనేక వ్యాపారాలను, ఇతర ఆర్థిక కార్యకలాపాలను దారుణంగా దెబ్బతీసింది. కానీ భారత స్థూల ఆర్థిక పునాదులు బలంగా ఉన్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధిరేటు బలంగా పుంజుకొంటుందని మేము భావిస్తున్నాం' అని ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త యసుయుకీ సవాడ తెలిపారు. కరోనా కాటు నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకొనేందుకు అధికారులు చాలా చురుకుగా వ్యవహరించారని ఆయన కొనియాడారు. వ్యక్తిగత, కార్పొరేట్ పన్నులకు సంబంధించి ప్రస్తుతం కొనసాగుతున్న సంస్కరణలు, వ్యవసాయ రంగంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ఆర్థిక వ్యవస్థపై వత్తిడిని తగ్గించేందుకు చేపడుతున్న చర్యలు భారత్ వేగవంతంగా పుంజుకొనేందుకు దోహదం చేస్తాయని ఆయన అన్నారు.

సంస్కరణలు మొదలైన తర్వాత..

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత బలమైన దెబ్బ తగిలింది. ఇప్పటికే గత ఆరు త్రైమాసికాల నుంచి మందగమన దశలో కొనసాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు లాక్‌డౌన్ దెబ్బ శరాఘాతం లాంటిది. కనుక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు మరింత దిగజారుతుంది. దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన (1991) తర్వాత అతితక్కువ వృద్ధిరేటు ఈ ఏడాదే నమోదు కావచ్చు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఉద్దీపనలను ప్రకటించినా.. మార్కెట్లలో ద్రవ్యలభ్యతను పెంచేందుకు ఎంత పటిష్ఠమైన చర్యలు చేపట్టినా జీడీపీ వృద్ధిరేటు మరింత క్షీణించడం ఖాయం. కానీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిస్థితి మెరుగుపడవచ్చు.

- ఎన్ఆర్ భానుమూర్తి, ప్రొఫెసర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ ప్రాపర్టీ

కోరలు చాస్తున్న నిరుద్యోగం

గతనెలలో 8.74 శాతానికి చేరిక

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు భారత్ సమర్థంగా పోరాడుతున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ రేటు గణనీయంగా పెరిగి దాదాపు 9 శాతానికి చేరింది. గత 43 నెలల్లో ఇదే అత్యధికమని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) వెల్లడించింది. దేశ నిరుద్యోగరేటు గత నెలలో 8.74 శాతానికి చేరిందని, డీమానిటైజేషన్ (పెద్దనోట్ల చెలామణి రద్దు) తర్వాత ఇదే అత్యధికమని తెలిపింది. అంతకుముందు 2016 ఆగస్టులో నిరుద్యోగరేటు 9.59 శాతంగా నమోదయింది. ఈ ఏడాది మార్చిలో నిరుద్యోగరేటు పట్టణ ప్రాంతాల్లో 9.35 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 8.45 శాతంగా ఉన్నట్టు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఫిబ్రవరిలో దేశ నిరుద్యోగరేటు 7.78 శాతంగా నమోదయింది. జులై, అక్టోబర్ నెలలు మినహా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఈ రేటు చాలా వరకు 8 శాతంలోపే కొనసాగింది. జులై, అక్టోబర్ నెలల్లో మాత్రం 8 శాతం దాటింది. రాష్ట్రాలవారీగా చూస్తే ఈ ఏడాది మార్చిలో నిరుద్యోగరేటు త్రిపురలో అత్యధికం (29.9 శాతం)గా, పుదుచ్చేరిలో అత్యల్పం (1.2 శాతం)గా ఉన్నట్టు సీఎంఐఈ వెల్లడించింది.

బిగ్‌బాస్కెట్‌లో 10 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ: ఒకవైపు కరోనా వైరస్ దెబ్బకు ఉద్యోగాలు పోతుంటే మరోవైపు ప్రముఖ సరుకుల రవాణా సదుపాయాల సంస్థ బిగ్‌బాస్కెట్ మా త్రం భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ప్రకటించింది. కరోనా వైరస్‌ను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా నిలిచిపోయిన సరుకుల రవాణా కోసం దేశవ్యాప్తంగా 10 వేల మందిని రిక్రూట్ చేసుకోబోతున్నట్లు తెలిపింది. గిడ్డంగులు, లాస్ట్-మైల్ డెలివరి అవసరాల నిమిత్తం 26 నగరాల్లో పది వేల మంది సిబ్బందిని నియమించుకోవాలనుకుంటున్నట్లు బిగ్‌బాస్కెట్ వైస్ ప్రెసిడెంట్(మానవ వనరులు) తనుజా తివారీ తెలిపారు.

ఆదిత్యా బిర్లా రూ.500 కోట్ల విరాళం

ప్రధాని సహాయ నిధికి రూ.201 కోట్లు ప్రకటించిన వేదాంత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: కరోనా వైరస్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కార్పొరేట్ సంస్థలు దన్నుగా నిలుస్తున్నాయి. ఇదివరకే టాటా, మహీంద్రా, విప్రోలు వేలాది కోట్ల రూపాయలను పీఎం-కేర్స్ ఫండ్‌కు తమ విరాళాలను అందించగా..తాజాగా ఆదిత్యా బిర్లా గ్రూపు రూ.500 కోట్లను ప్రకటించింది. దీంట్లో రూ.400 కోట్లను ప్రధాని సహాయ నిధికి అందించనున్న సంస్థ..మిగతా రూ.50 కోట్లను ఫిక్కీ-ఆదిత్యా బిర్లా సీఎస్ఆర్ సెంటర్‌కు, మరో రూ.50 కోట్లను వెంటిలేటర్లు, మాస్కులు, ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్లను కొనుగోలు చేయడానికి వినియోగించనున్నట్లు తెలిపింది. దీంతోపాటు వేదాంత రిసోర్స్ కూడా రూ.201 కోట్లు ప్రకటించింది. ప్రభుత్వరంగ ఎరువుల తయారీ సంస్థలు మొత్తంగా రూ.32 కోట్లను అందచేశాయి. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రధాని సహాయ నిధికి తన లక్ష రూపాయల వేతనాన్ని విరాళంగా అందించారు.

పలు సంస్థల విరాళాలు (రూ.కోట్లలో)

యూపీఎల్	75
మోయిల్	45
సిడ్బీ	15
ఇండియన్ పోటాష్	5
ఐఐఎల్	2.33
బీడీఎల్	9

స్మార్ట్‌ఫోన్లకు 15 వేల కోట్ల నష్టం

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌కు కరోనా వైరస్ సెగ తగులబోతున్నది. మార్చి, ఏప్రిల్ నెలల్లో స్మార్ట్‌ఫోన్ల ఇండస్ట్రీకి 2 బిలియన్ డాలర్ల మేర నష్టం రావచ్చునని కౌంటర్‌పాయింట్ రీసర్చ్ వెల్లడించింది. మన కరెన్సీలో ఇది రూ.15 వేల కోట్లకు పైమాటే. దీంతో ఈఏడాది స్మార్ట్‌ఫోన్ల దిగుమతి 158 మిలియన్ల యూనిట్ల నుంచి 153 మిలియన్ యూనిట్లకు పడిపోనున్నట్లు కౌంటర్‌పాయింట్ రీసర్చ్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ తెలిపారు.

ఆట

కృష్ణప్రియ 5 లక్షల విరాళం

హైదరాబాద్: కరోనా వైరస్‌పై పోరాటంలో తాను కూడా పాలుపంచుకుంటానని తెలంగాణ యువ షట్లర్ కుదరవల్లి శ్రీకృష్ణప్రియ ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి సహాయక నిధికి కృష్ణప్రియ శుక్రవారం రూ.5లక్షల విరాళమిచ్చింది. బ్యాడ్మింటన్ ద్వారా తాను సాధించిన ఆదాయాన్ని ఇలా సమాజానికి ఉపయోగపడేలా వినియోగించడం సంతోషంగా ఉందని పేర్కొంది. సామాజిక బాధ్యతలో తనకు తల్లి ఆదర్శమని చెప్పుకొచ్చింది. కరోనాపై పోరులో తన సహాయం మిగతా క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మహమ్మారిని పారదోలేందుకు ప్రతి ఒక్కరు ముందుకురావాలని కృష్ణప్రియ పేర్కొంది.

సఫారీ క్రికెటర్లకు నెగెటివ్

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా క్రికెటర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఆటగాళ్లందరికీ జరిపిన కరోనా వైరస్ పరీక్షల్లో నెగెటివ్ అని తేలింది. ఈ విషయాన్ని జట్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షుయిబ్ మంజ్రా శుక్రవారం ధృవీకరించాడు. కొవిడ్-19 కారణంగా మూడు వన్డేల సిరీస్ అర్ధాంతరంగా రద్దుకావడంతో గత నెల 18న భారత్ నుంచి సఫారీ క్రికెటర్లు తమ స్వదేశానికి బయల్దేరి వెళ్లారు. అప్పటి నుంచి 14 రోజుల పాటు వీరంతా స్వీయ నిర్బంధంలో ఉన్నారు.

ప్రధాని పంచ సూత్రాలు

ప్రమాదకర కరోనా వైరస్‌పై సమిష్టిగా పోరాడుదామని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. కరోనాపై పోరాటంలో క్రీడాకారులందరూ మద్దతు కావాలని కోరారు. రోజురోజుకు వైరస్ ప్రమాదకరంగా మారుతున్న క్రమంలో ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు క్రీడాకారులు తమ వంతు పాత్ర పోషించాలని ప్రధాని సూచించారు. శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేశంలోని ప్రముఖ క్రీడాకారులతో మోదీ ముచ్చటించారు. ఐదు సూత్రాలతో జనాల్లోకి వెళ్లాలంటూ ఆయన ఆటగాళ్లకు వివరించారు.

- **కరోనాపై పోరాటంలో క్రీడాకారులు కలిసిరావాలి**
- **వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ**

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రమాదకర కరోనా వైరస్‌పై పోరాడేందుకు ప్రధాని నరేంద్రమోదీ అందరిని కలుపుకుపోతున్నారు. ఇందులో భాగంగా క్రీడాకారులను భాగస్వామ్యులను చేయాలనే ఆలోచనతో వారితో ముచ్చటించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశంలోని ప్రముఖ క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా సలహాలు, సూచనలు చేస్తూ వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ భేటిలో మోదీతో పాటు కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ మహమ్మారి కరోనా కారణంగా ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ వచ్చే ఏడాదికి వాయిదా పడిన సంగతిని గుర్తు చేశాడు. అంతకంతకు కరాళ నృత్యంతో సవాలు విసురుతున్న ఈ వైరస్ వల్ల పలు టోర్నీలు రద్దు కావడమో, వాయిదా పడటమో జరుగుతున్నాయని అన్నారు. అయితే మైదానంలో మీరు చూపించే తెగువ, పట్టుదల..కరోనా వైరస్‌పై పోరాటంలోనూ చూపించాలని ఆయన కోరారు.

కోహ్లీ లాగా స్ఫూర్తిని కనబరుద్దాం

తెలుగు యువ షట్లర్ సాయి ప్రణీత్ సోషల్‌మీడియాలో షేర్ చేసిన వీడియోను మిగతా అథ్లెట్లతో కలిసి మోదీ పంచుకున్నారు. 'మీ అభిప్రాయాలన్నింటినీ కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటాను. కరోనాపై యుద్ధంలో గెలిచేందుకు కెప్టెన్ విరాట్ కోహ్లీ లాగా పోరాట స్ఫూర్తిని కనబరుద్దాం' అని మోదీ సూచించారు.

ఐదు సూత్రాలతో ముందుకెళ్లండి

మీరంతా ఐదు సూత్రాలతో ప్రజల్లోకి వెళ్లండి. మహమ్మారిపై పోరాడాలనే 'సంకల్పం', నిర్లక్ష్య దూరం పాటించేలా 'నిగ్రహం', సానుకూల ధోరణితో ఉండాలనే 'అనుకూలత', కరోనాపై పోరాటంలో ముందున్న వైద్య, పోలీస్, పారిశుధ్య సిబ్బంది పట్ల 'గౌరవం', పీఎం కేర్స్ ఫండ్‌కు విరాళాల ద్వారా 'సహాయం' ప్రదర్శించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దిగ్గజ క్రికెటర్లు సచిన్, గంగూలీతో పాటు యువరాజ్‌సింగ్, జహీర్‌ఖాన్, కోహ్లీ, రోహిత్‌శర్మ, పీవీ సింధు, సాయి ప్రణీత్, నీరజ్ చోప్రా, ఆనంద్, హిమా దాస్, అమిత్ పంగల్, వినేశ్ ఫోగట్, మను భాకర్, అజయ్ ఠాకూర్, అంకితా రైనా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు, పోలీసులపై దాడులు బాధాకరం

కరోనా వైరస్‌పై అలుపెరగకుండా పోరాటం చేస్తున్న డాక్టర్లు, పోలీసులపై దాడులు చాలా బాధాకరమని భారత యువ అథ్లెట్ హిమాదాస్ అంది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హిమ ఆ తర్వాత ఓ వీడియోను విడుదల చేసింది. 'కొవిడ్-19 వైరస్‌తో పోరాడుతున్న డాక్టర్లు, పోలీసులపై కొందరు రాళ్లతో దాడులు చేయడంపై నేను చాలా బాధపడ్డాను. విధి నిర్వహణలో ప్రాణాలను కూడా లెక్కచేయని వారిపై ఇలాంటి దాడులు గర్హనీయం. లాక్‌డౌన్ నిబంధనలు పాటించకుండా రోడ్లపై నిర్లక్ష్యంగా తిరుగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని హిమ అంది.

గోపీచంద్ ఆన్‌లైన్ పాఠాలు

హైదరాబాద్: కరోనా వైరస్ కారణంగా ఏర్పడ్డ లాక్‌డౌన్‌తో క్రీడాకారులందరూ స్వీయ నిర్బంధంలో గడుపుతున్నారు. ఇంటి నుంచి బయటికి వచ్చి ప్రాక్టీస్ చేయాలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో షట్లర్లకు ఆన్‌లైన్‌లో వీడియోల ద్వారా సలహాలు, సూచనలు ఇచ్చేందుకు భారత బ్యాడ్మింటన్ చీఫ్ పుల్లెల గోపీచంద్ ముందుకొచ్చాడు. జూమ్ యాప్ ద్వారా ఒకేసారి పలువురు షట్లర్లతో ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు చెబుతున్నాడు.

ఐపీఎల్ కంటే జీవితాలే ముఖ్యం

న్యూఢిల్లీ: ఐపీఎల్ కంటే జీవితం ముఖ్యమని భారత సీనియర్ క్రికెటర్ సురేశ్ రైనా అన్నాడు. 'ప్రస్తుత పరిస్థితుల్లో జీవితాలే ముఖ్యం. ఐపీఎల్ కోసం వేచిచూడాల్సిందే. కొవిడ్-19 కారణంగా చాలా మంది జనాలు ప్రాణాలు కోల్పోతున్నారు. వాళ్లను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని రైనా అన్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
శనివారం 4 ఏప్రిల్ 2020

జాతీయస్థాయి ఎంసీఏ ఎంట్రన్స్ టెస్టులు

- **నిమ్‌సెట్:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎంసీఏలో ప్రవేశం కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌నే నిమ్‌సెట్ అంటారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా నిట్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. దీనికి దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 7 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే చివరివారంలో ఎంట్రన్స్ ఉంటుంది. ఇతర వివరాల కోసం www.nimcet.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **బిట్:** డీమ్డ్ యూనివర్సిటీ అయిన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిట్) ఎంసీఏలో ప్రవేశాల కోసం ప్రతి ఏడాది ఎంట్రన్స్‌ను నిర్వహిస్తుంది. దీనికి దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. మే 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎంట్రన్స్ పరీక్ష జూన్ 14న ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.1200. ఇతర వివరాల కోసం www.bitmesra.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **జేఎన్‌యూ:** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ఎంసీఏలో ప్రవేశం కోసం పరీక్ష నిర్వహిస్తుంది. దరఖాస్తు ఫీజు రూ.220. ఇతర వివరాల కోసం www.jnu.ac.in వెబ్‌సైట్‌ను సదర్శించవచ్చు.
- ఇంకా ఇవేకాకుండా పుణె యూనివర్సిటీ (www.unipune.ac.in), పశ్చిమ బెంగాల్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (www.wbjeeb.in/jeca.html), జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎంసీఏ (ఐఐటీ జామ్) (www.iitr.ac.in/jam) తదితర రాష్ట్రాలు కూడా ఎంసీఏలో ప్రవేశాల కోసం ఎంట్రన్స్ ఎగ్జామ్‌లను నిర్వహిస్తున్నాయి.

బీఈ, బీటెక్, ఎంబీబీఎస్‌లే కాకుండా ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు కూడా మంచి డిమాండ్ ఉంది. వ్యాపారం, వ్యాపార సంస్థ పరిపాలన, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్థిరపడాలనుకునేవారు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చేయడం ఉత్తమం. ఐసెట్ ఎంట్రన్స్ పరీక్ష ద్వారా వివిధ కాలేజీలు ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తాయి. తెలంగాణ స్టేట్ ఐ సెట్ (టీఎస్ ఐ సెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ వివరాలు, రాష్ట్రంలో ప్రవేశాలు కల్పించే కాలేజీల గురించి నిపుణ పాఠకుల కోసం ప్రత్యేకం.

టీఎస్ ఐసెట్

ఎంబీఏ, ఎంసీఏ ఎంట్రన్స్ పరీక్షలు

- అయిదంకెల జీతం, కార్పొరేట్ కంపెనీ, మంచి హోదాలో ఉద్యోగం చేయాలనేది ప్రతి నిరుద్యోగి కల. ఆ కలను సాకారం చేసుకోవాలంటే తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ ఐసెట్) రాయాలి. ఈ పరీక్ష ద్వారా ఎంబీఏ, ఎంసీఏలలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంబీఏ చదివిన వారికి వాణిజ్య, వినియోగ, సేవా రంగాల్లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభిస్తాయి. ఎంసీఏ చేసినవారికి కూడా మంచి భవిష్యత్తు ఉంది.
- ఉద్యోగావకాశం సులువుగా లభించాలంటే ఎంట్రన్స్ పరీక్ష రాసిన తర్వాత కళాశాల ఎంపిక కీలకం. మొదటగా నిష్ణాతులైన బోధనానుభవం లేదా పరిశ్రమ అనుభవం, పీహెచ్‌డీ పట్టా ఉన్న అధ్యాపకులున్న కళాశాలను ఎంపిక చేసుకోవాలి. కాలేజీలోని మౌలిక సదుపాయాలు, ప్లేస్‌మెంట్ రికార్డు, ఆ కాలేజీలోని గత ప్లేస్‌మెంట్‌లో ఎంపికైన విద్యార్థులు ప్రస్తుతం ఏ హోదాలో ఉన్నారో తదితర విషయాలు తెలుసుకోవాలి.

అర్హతలు

- ఈ ప్రవేశ పరీక్ష (ఐసెట్) రాయాలంటే ఏదైనా మూడేండ్ల బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ చదవాలంటే ఇంటర్‌లో తప్పనిసరిగా మ్యాథమెటికల్ సబ్జెక్టు చదివి ఉండాలి.
- జనరల్ విద్యార్థులు 50 శాతం, రిజర్వేషన్ విద్యార్థులు 45 శాతం మార్కులతో తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
- డిగ్రీ చివరి ఏడాది పరీక్షలు రాస్తున్నవారు కూడా ఈ ఎంట్రన్స్ రాయవచ్చు.

పరీక్ష విధానం

- పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో కంప్యూటర్ బేస్డ్ ఆధారంగా ఉంటుంది.
- పరీక్షలో 200 ప్రశ్నలు వస్తాయి. ప్రతి కరెక్టు సమాధానానికి ఒక మార్కు ఉంటుంది. 150 నిమిషాల సమయం ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ లేదు.
- పరీక్షలో మొత్తం మూడు సెక్షన్లు అనలిటికల్ ఎబిలిటీ (75 ప్రశ్నలు), మ్యాథమెటికల్ ఎబిలిటీ (75), కమ్యూనికేషన్ ఎబిలిటీ (50) ఉంటాయి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- ఈ సెక్షన్ నుంచి మొత్తం 50 మార్కులు, 50 ప్రశ్నలు కేటాయించారు. దీనిలో వొకాబులరీ, ఫంక్షనల్ గ్రామర్, బిజినెస్ అండ్ కంప్యూటర్ టర్మినాలజీ, రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 50 ప్రశ్నలు వస్తాయి. వొకాబులరీలో సినానిమ్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. బిజినెస్ అండ్ కంప్యూటర్ టర్మినాలజీలో కంప్యూటర్ బేసిక్స్, ఇండియన్ ఎకానమీ, అకౌంటింగ్, అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్ స్కిల్ టెస్ట్ చేసేలా పది ప్రశ్నలు అడుగుతారు.
- మూడో పార్ట్‌లో ప్రశ్నలు ఫంక్షనల్ గ్రామర్ అయిన యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచెస్, ఇడియమ్స్ అండ్ ప్రేజెస్ వంటి టాపిక్‌ల నుంచి వస్తాయి. కాబట్టి వాటిని చదవాలి. రీడింగ్ కాంప్రహెన్షన్‌లో మూడు అన్‌సీన్ ప్యాసేజ్‌ల నుంచి 15 ప్రశ్నలు అడుగుతారు. తెలియని అంశాన్ని చదివి అందులో విషయాలు ఎలా అవగాహన చేసుకున్నారో? ప్యాసేజ్ థీమ్ ఏంటి? రచయిత ఉద్దేశం ఏంటి? వంటి అంశాలను పరీక్షిస్తారు.
- ఐసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. కాబట్టి సమయం చాలా కీలకం. రెండున్నర గంటల్లో 200 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. అంటే ప్రతి ప్రశ్నకు 45 సెకన్ల సమయంలో సమాధానం గుర్తించాలి. కాబట్టి సాధ్యమైనన్ని గత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

ముఖ్యతేదీలు
టీఎస్ ఐసెట్

- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 9
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **రూ.500 ఆలస్య రుసుముతో:** మే 6
- **రూ.2000 ఆలస్య రుసుముతో:** మే 11
- **రూ.5000 ఆలస్య రుసుముతో:** మే 16
- **పరీక్ష తేదీ:** మే 20, 21
- **వెబ్‌సైట్:** www.icet.tsche.ac.in

ఐసెట్ ద్వారా ప్రవేశాలు కల్పించే రాష్ట్రంలోని ప్రముఖ కాలేజీలు

- ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)– హైదరాబాద్
- నిజాం కాలేజ్– హైదరాబాద్
- ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఫర్ ఉమెన్– హైదరాబాద్
- జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ – హైదరాబాద్
- ప్రొ. జీ రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్– హైదరాబాద్
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్–ఉస్మానియా యూనివర్సిటీ సైఫాబాద్– హైదరాబాద్
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) – వరంగల్
- కాకతీయ యూనివర్సిటీ– వరంగల్
- తెలంగాణ యూనివర్సిటీ– నిజామాబాద్
- మహాత్మాగాంధీ యూనివర్సిటీ– నల్లగొండ
- పాలమూరు యూనివర్సిటీ – మహబూబ్‌నగర్
- ఏవీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ – హైదరాబాద్
- ఇంకా ఇవేకాకుండా, వీటి అనుబంధ కాలేజీలు, ప్రైవేట్ కాలేజీల్లో కూడా ర్యాంకులను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు.

జాతీయస్థాయి ఎంబీఏ ఎంట్రన్స్‌లు

- **క్యాట్:** దీన్నే కామన్ అడ్మిషన్ టెస్ట్ అంటారు. ఈ ఎగ్జామ్‌ను దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తారు. ఈ ఐఐఎంలు అహ్మదాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కశ్మీర్, కోజికోడ్, లక్నో, నాగపూర్, రాయ్‌పూర్, రాంచి, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, తిరుచిరాపల్లి, ఉదయ్‌పూర్, విశాఖపట్నంలలో ఉన్నాయి. క్యాట్ నోటిఫికేషన్ జూలై లేదా ఆగస్టులో వెలువడుతుంది.
- **మ్యాట్:** మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్)ను ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఏడాదికి నాలుగుసార్లు (ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్) నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ద్వారా దేశంలోని సుమారుగా 300కు పైగా బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏ, పీజీడీఎం, అలైడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఎక్స్‌ఎటీ (గ్జాట్):** జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (గ్జాట్)ను జంషెడ్‌పూర్‌లోని జేవియర్ లేబర్ రిలేషన్స్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తుంది. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 150కి పైగా సంస్థల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. ఈ ఎంట్రన్స్ నోటిఫికేషన్‌ను జూలై లేదా ఆగస్టులో వెలువడుతుంది.
- **సీమ్యాట్:** కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సీమ్యాట్)ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఈ ఎంట్రన్స్ ద్వారా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, యూనివర్సిటీలు, అనుబంధ కాలేజీల్లో ఎంబీఏ, పీజీడీఎం, పీజీసీఎం, ఎగ్జిక్యూటివ్ పీడీజీఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. దీని నోటిఫికేషన్ నవంబర్‌లో వెలువడుతుంది.
- **జీమ్యాట్:** గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జీమ్యాట్)ను గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్ (జీఎంఏసీ) ఏడాదికి అయిదుసార్లు నిర్వహిస్తుంది. దీనిద్వారా అంతర్జాతీయంగా, దేశీయంగా ప్రముఖ విద్యాసంస్థల్లో ఎంబీఏలో చేరవచ్చు.
- **సీయూ సెట్:** సెంట్రల్ యూనివర్సిటీస్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూ సెట్)ను ఏడాదికి ఒకసారి నిర్వహిస్తారు. ఈ ఎంట్రన్స్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో యూజీ, ఇంటిగ్రేటెడ్, పీజీ, రిసర్చ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఎంట్రన్స్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. దరఖాస్తులకు చివరితేదీ ఏప్రిల్ మొదటివారం.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

- దీని నుంచి 75 ప్రశ్నలు, 75 మార్కులు ఉంటాయి. అర్థమెటిక్ ఎబిలిటీ, జామెట్రీ అండ్ ఆల్జీబ్రా ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ అనే మూడు అధ్యాయాలు దీనిలో ఉంటాయి. అంకగణిత సామర్థ్యంలో లాస్ ఆఫ్ ఇండీసెస్, రేషియో అండ్ ప్రపోర్షన్, సర్డ్స్, నంబర్స్ అండ్ డివిజబిలిటీ, కసాగు, గసాభా, రేషనల్ నంబర్స్, ఆర్డరింగ్, శాతాలు, లాభనష్టాలు, భాగస్వామ్యం, పైప్స్ అండ్ సిస్టర్న్స్, కాలం, దూరం, పని, వైశాల్యాలు, ఘనపరిమాణాలు, మెన్సురేషన్ అండ్ మాడ్యులర్ అర్థమెటిక్ టాపిక్‌ల నుంచి 35 ప్రశ్నలకు 35 మార్కులు వస్తాయి.
- స్టేట్‌మెంట్స్, ట్రూత్ టేబుల్స్, సెట్స్, రిలేషన్స్ అండ్ ఫంక్షన్స్, త్రికోణమితి, దాని నిష్పత్తులు, కోణాలు, దూరాలు, ఎత్తులపై సమస్యలు, పాలినామినల్స్, ప్రోగ్రెషన్స్, బైనామినల్ థియరమ్, మాత్రికలు, త్రిభుజాలు, దీర్ఘచతురస్రాలు, వృత్తాలు వంటి అంశాల నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టికల్ ఎబిలిటీ నుంచి మీన్, మీడియన్, మోడ్, స్టాండర్డ్ డీవియేషన్, కొరిలేషన్, ప్రాబబిలిటీల నుంచి 5 ప్రశ్నలు వస్తాయి.

అనలిటికల్ ఎబిలిటీ

- అనలిటికల్ ఎబిలిటీలో రీజనింగ్ అంశాలుంటాయి. దీనిలో డేటా సఫిషియన్సీ, ప్రాబ్లం సాల్వింగ్ అనే రెండు ప్రధాన అధ్యాయాలు ఉంటాయి. డేటా సఫిషియన్సీ నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలు మ్యాథమెటిక్స్ అధ్యాయాలైన వాస్తవ సంఖ్యలు, త్రిభుజాలు, వైశాల్యాలు, సరాసరి, శ్రేఢులు, శాతాలు, నిష్పత్తులు, ప్రాబ్లమ్స్ ఆన్ ట్రైన్స్, మెన్సురేషన్, భిన్నాలు, బారువడ్డీ, చక్రవడ్డీ తదితర చాప్టర్ల నుంచి వస్తాయి. ప్రాబ్లం సాల్వింగ్ చాప్టర్లో సీక్వెన్సెస్ అండ్ సిరీస్ డేటా అనాలసిస్, కోడింగ్, డీకోడింగ్, డేట్, టైమ్ అండ్ అరేంజ్‌మెంట్ ప్రాబ్లమ్స్ అనే నాలుగు విభాగాలున్నాయి. అనాలజీ (నంబర్స్ అండ్ ఆల్ఫాబెట్), సిరీస్ కంప్లీషన్ (రిలేషన్‌షిప్, ఆడ్‌మ్యాన్ అవుట్, మిస్సింగ్ నంబర్) అంశాల నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. డేటా అనాలసిస్ నుంచి 10 మార్కులు వస్తాయి. టేబుల్/పైచార్ట్/గ్రాఫ్/వెన్ డయాగ్రమ్/ప్యాసేజ్ నుంచి ఏవైనా రెండు 5 మార్కుల ప్రశ్నలు వస్తాయి. కోడింగ్ డీకోడింగ్ నుంచి 10 ప్రశ్నలు వస్తాయి. ఒక పజిల్ ఇచ్చి దాని ఆధారంగా 5 ప్రశ్నలు అడుగుతారు. మిగిలిన ఐదు ప్రశ్నలు విడివిడిగా ఇస్తారు. టైమ్ అండ్ అరేంజ్‌మెంట్ ప్రాబ్లమ్స్‌లో గడియారాలు, క్యాలెండర్, ట్రైన్స్, సిట్టింగ్ అరేంజ్‌మెంట్ వంటి టాపిక్‌ల నుంచి 10 ప్రశ్నలు వస్తాయి.

...✍ సత్యం చాపల

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్–ఐజీఐబీలో

సీఎస్ఐఆర్– ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జినోమిక్స్&ఇంటిగ్రేటివ్ బయాలజీ (ఐజీఐబీ)లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులు:** ఫీల్డ్ డాటా కలెక్టర్–1, ల్యాబ్ టెక్నీషియన్–1, పోస్ట్ డాక్టోరల్ ఫెలో–1, ప్రాజెక్ట్ మేనేజర్–1, ప్రాజెక్ట్ అసిస్టెంట్–4, డాటా అనలిస్ట్–2, జేఆర్ఎఫ్–1 పోస్టు ఉన్నాయి.
- అర్హతలు, వయస్సు, జీతభత్యాలు తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** https://www.igib.res.in

ఐవోసీఎల్‌లో అసిస్టెంట్ ఆఫీసర్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **పోస్టు:** అసిస్టెంట్ ఆఫీసర్
- **అర్హతలు:** కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత. వీటితోపాటు సీఏ/సీఎంఏ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. ఫైనాన్స్/అకౌంట్స్/ట్యాక్సేషన్ /కాస్ట్ అకౌంటింగ్/ఆడిటింగ్ వంటి అంశాల్లో అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, వ్యక్తిగత ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ద్వారా చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** https://www.iocl.com

పొల్యూషన్ బోర్డులో

ఢిల్లీలోని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ)లో కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** కన్సల్టెంట్లు
- **మొత్తం ఖాళీలు:** 5
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **అర్హతలు:** పీజీలో మ్యాథ్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ లేదా ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ లేదా బీఈ/బీటెక్, ఎంబీఏ, పీజీలో ఎకనామిక్స్, ఎంసీజే చేసిన వారు అర్హులు.
- **వయస్సు:** 35 ఏండ్లు మించరాదు
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 7
- **వెబ్‌సైట్:** https://cpcb.nic.in

హెచ్‌పీసీఎల్‌లో

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోని రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 72
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెకానికల్–22, ఎలక్ట్రికల్–17, ఇన్‌స్ట్రుమెంటేషన్–11, సివిల్–10, ఫైర్ అండ్ సేఫ్టీ–6, ఫైనాన్స్–2, హ్యూమన్ రిసోర్సెస్–2, ఇన్ఫర్మేషన్ సిస్టమ్–1, లీగల్–1 ఉన్నాయి.
- **అర్హతలు:** ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధిత బ్రాంచీల్లో డిప్లొమా/ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. మిగిలిన పోస్టులకు ఆయా సబ్జెక్టులతో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 24
- **వెబ్‌సైట్:** https://www.hrrl.in

మజ్‌గావ్ డాక్‌లో

ముంబైలోని మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 4
- **పోస్టులవారీగా ఖాళీలు:** అసిస్టెంట్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ)–1, సీనియర్ ఇంజినీర్ (మెకానికల్/మెరైన్)–2, సీనియర్ ఆఫీసర్ (మెడికల్)–1 ఉన్నాయి.
- **అర్హత:** పోస్టుని బట్టి ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీబీఎస్, ఐసీఎస్ఐ ఉత్తీర్ణత. అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 16
- **వెబ్‌సైట్:** https://mazagondock.in

ఐఐఎంలో

తిరుచిరాపల్లిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 5
- **పోస్టులవారీగా ఖాళీలు:** సీనియర్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్–1, ఎస్టేట్ మేనేజర్–1, మేనేజర్ (ఈఈసీ)–1, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–1, మేనేజర్ (చెన్నై క్యాంపస్)–1 ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** http://www.iimtrichy.ac.in

ఐఎంఆర్‌టీలో

సికింద్రాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట్రో అండ్ రైల్ టెక్నాలజీ (ఐఎంఆర్‌టీ)లో 2020 విద్యాసంవత్సరానికి కింది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది.

- **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మెట్రో అండ్ రైల్ టెక్నాలజీ (పీజీపీఎంఆర్‌టీ–2020)
- **కాలవ్యవధి:** ఏడాది
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000/–
- **వెబ్‌సైట్:** http://imrtindia.edu.in

ప్లేస్‌మెంట్స్ ఇబ్బంది లేకుండా చూసుకోండి!



- కరోనావైరస్ మహమ్మారి కారణంగా విద్యార్థుల నియామకాలు ప్రభావితం కాకుండా చూసుకోవాలని కేంద్ర మానవ వనరుల మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లను ఆదేశించారు. కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 23 ఐఐటీల డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో కొన్ని సూచనలు చేశారు. నియామకాల్లో ఇబ్బందులు ఏర్పడకుండా ఉండటం కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ప్లేస్‌మెంట్ల సంఖ్య పెంచేలా ఆయా సంస్థలతో సత్సంబంధాలు ఉండాలన్నారు. దీనికోసం ప్లేస్‌మెంట్ టాస్క్‌ఫోర్స్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగించాలని పేర్కొన్నారు. ఐఐటీల్లో నాలుగో ఏడాది ఇంజినీరింగ్ కోర్సులు చేసేవారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఇబ్బందులు రాకుండా ఐఐటీలు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

epaper.ntnews.com